https://epaper.dksaardyamlochaatimpu.com

E-mail: dkchaatimpu80@gmail.com RNI. NO. APTEL/2008/26737

డీకే చాటింపు

సారథ్యంలో

తెలంగాణ దిన పత్రిక



హైదరాబాద్ సంపుటి : 18 సంచిక : 54 ఎడిటర్ : పూసాల శ్రీనివాస్ గురువారం,నవంబర్,26, 2026 పేజీలు : 8 వెల : రూ.1/-

స్కూల్ ఎడ్యుకేషన్‌లో ఇంటర్ విలీనంపై

ఏకపక్ష నిర్ణయాలు వద్దు: కవిత

స్టేక్‌హోల్డర్లతో సమగ్ర చర్చలు జరిపిన తర్వాతే ముందడుగు వేయాలని డిమాండ్

కొత్త విధానంతో తల్లిదండ్రులపై మరింత ఫీజుల భారం పడుతుందని ఆందోళన



హైదరాబాద్,నవంబర్,25 : ఇంటర్మీడియట్ బోర్డును ఏకపక్షంగా స్కూల్ ఎడ్యుకేషన్‌లో విలీనం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం యత్నిస్తోందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. విద్యారంగానికి సంబంధించిన కీలక అంశాలపై నిర్ణయం తీసుకునే ముందు తల్లిదండ్రులు, జూనియర్ కాలేజీలు, పాఠశాల యాజమాన్యాలు, విద్యావేత్తలతో సమగ్ర చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. ప్రజల్లో ఉన్న అనుమానాలను నివృత్తి చేసిన తర్వాతే ప్రభుత్వం ఎలాంటి అడుగైనా వేయాలన్నారు. ఇంటర్మీడియట్ బోర్డును స్కూల్ ఎడ్యుకేషన్‌లో విలీనం చేసే ప్రతిపాదనను తాము అంగీకరించబోమని స్పష్టం చేశారు. అలాగే, విద్యారంగానికి సంబంధించిన ఇలాంటి కీలక నిర్ణయాలను ఏకపక్షంగా తీసుకోవడం సరికాదని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రక్రియపై స్పష్టత కొరవడిందని చెబుతూ... “స్కూల్ విద్యలో ఇంటర్‌ను విలీనం చేస్తారా? లేక ఇంటర్ విద్యలో పాఠశాల విద్యను కలుపుతారా? అన్న దానిపై స్పష్టత ఇవ్వాలని అన్నారు. 9, 10, 11, 12 తరగతుల విధానం వస్తే తల్లిదండ్రులపై మరింత భారం పడుతుందని చెప్పారు. ఇప్పటికే ఇంటర్ విద్య కోసం రూ. 3 లక్షల నుంచి రూ. 4 లక్షల వరకు ఖర్చు చేస్తున్న తల్లిదండ్రులపై మరింత ఆర్థిక భారం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు, రాష్ట్రంలో నెలకొన్న కరవు పరిస్థితులు, నిధుల విడుదలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని ఆమె తప్పుబట్టారు. కేంద్రం నుంచి కరవు సహాయం తీసుకురావడంలో రాష్ట్ర బీజేపీ ఎంపీలు విఫలమయ్యారని విమర్శించారు. కరవు ప్రభావిత మండలాలపై ప్రభుత్వం మరోసారి సర్వే నిర్వహించాలని, రైతులకు పంటల ధరలపై పూర్తి స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఉమర్ ఖలీద్, షర్జీల్ ఇమామ్‌లకు సుప్రీంకోర్టు షాక్.. మధ్యంతర బెయిల్ నిరాకరణ!



న్యూఢిల్లీ,నవంబర్,25 : 2020 ఫిబ్రవరిలో ఈశాన్య ఢిల్లీలో జరిగిన అల్లర్ల వెనుక “పెద్ద కుట్ర” ఉందన్న ఆరోపణలపై చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం కింద నమోదైన కేసులో సామాజిక కార్యకర్తలు ఉమర్ ఖలీద్, షర్జీల్ ఇమామ్‌లకు సుప్రీంకోర్టు బుధవారం తక్షణ ఊరటనిచ్చేందుకు నిరాకరించింది. ప్రస్తుతానికి వారికి మధ్యంతర బెయిల్ మంజూరు చేయలేమని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. తమకు బెయిల్ నిరాకరిస్తూ గతంలో ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాలు చేస్తూ వీరిద్దరూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ప్రధానన్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జోయ్‌మల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్లపై విచారణ జరిపింది.

ఇద్దరు నిందితుల మధ్యంతర బెయిల్ పిటిషన్లపై స్పందన కోరుతూ ఢిల్లీ పోలీసులకు నోటీసులు జారీ చేసింది. విచారణ సందర్భంగా ఖలీద్ తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపిస్తూ, తుది నిర్ణయం వెలువడేలోగా మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని కోరారు.

ఇమామ్ తరపు న్యాయవాది సిద్ధార్థ్ దవే కూడా ఆయన సుదీర్ఘ జైలు జీవితాన్ని ప్రస్తావిస్తూ ఇదే తరహా ఉపశమనం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. లఅయితే, న్యాయవాదులు పదేపదే మధ్యంతర బెయిల్ కోసం పట్టుబట్టగా, “ఈ రోజుకు కుదరదు”) అని ధర్మాసనం తేల్చిచెప్పింది. మధ్యంతర బెయిల్ అభ్యర్థనలను పరిశీలించే ముందు ఢిల్లీ పోలీసుల వాదనను వింటామని స్పష్టం చేసింది. అలాగే, ఈ కేసును తదుపరి విచారణ నిమిత్తం ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనానికి కేటాయించేందుకు పరిపాలనా పరమైన అనుమతి కోసం ప్రధాన న్యాయమూర్తి ముందు ఉంచాలని ఆదేశించింది.ప్రాసిక్యూషన్ రక్షిత సాక్షులను విచారించడంలో విఫలమైందని, సుప్రీంకోర్టు గతంలో విధించిన ఏడాది గడువు కూడా ముగియబోతోందని పేర్కొంటూ వీరిద్దరూ బెయిల్ పిటిషన్లు దాఖలు చేశారు.

దలైలామాకు ఢిల్లీలో కొత్త నివాసం..

లూటియన్స్ ఢిల్లీలో ప్రభుత్వ బంగ్లా కేటాయించిన కేంద్రం!



న్యూఢిల్లీ,నవంబర్,25 : టిబెట్ ఆధ్యాత్మిక గురువు దలైలామా నివాసం విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దేశ రాజధాని న్యూఢిల్లీలోని అత్యంత ప్రముఖ ప్రాంతమైన లూటియన్స్ ఢిల్లీలో ఆయన కార్యాలయానికి ప్రభుత్వ బంగ్లాను కేటాయించింది. పండిట్ రవిశంకర్ శుక్లా లేన్‌లో ఉన్న ఈ బంగ్లాను దలైలామా కార్యాలయమైన ‘గాదెన్ ఫోడ్రాంగ్ ట్రస్ట్’కు కేటాయించినట్లు సమాచారం. విదేశాంగ శాఖ అభ్యర్థన మేరకు కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. అయితే ఈ కేటాయింపుపై కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. దలైలామా కార్యాలయ నిర్వహణ కోసం పనిచేస్తున్న గాదెన్ ఫోడ్రాంగ్ ట్రస్ట్‌కు ఈ ప్రభుత్వ నివాసాన్ని కేటాయించినట్లు సమాచారం. విదేశాంగ శాఖ ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయగా, దాని ఆధారంగా లూటియన్స్ ఢిల్లీలోని ప్రముఖ ప్రాంతంలో బంగ్లాను కేటాయించినట్లు తెలుస్తోంది. దలైలామాకు సంబంధించిన అధికారిక కార్యకలాపాలు, కార్యాలయ నిర్వహణకు ఈ నివాసం ఉపయోగపడే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వం ఇలాంటి ప్రభుత్వ నివాసాలను సాధారణంగా మూడేళ్ల కాలానికి కేటాయిస్తుంది. అవసరాన్ని బట్టి గడువును పొడిగించే అవకాశం కూడా ఉంటుంది. అయితే దలైలామా కార్యాలయానికి కేటాయించిన బంగ్లా విషయంలో ఎంతకాలం అనుమతి ఇచ్చారు? ఎప్పటి నుంచి ఈ కేటాయింపు అమల్లోకి వస్తుంది? అనే విషయాలపై అధికారిక సమాచారం వెల్లడికావాల్సి ఉంది.

ఏఐతో ఫేక్ ఐడీలు.. రూ.కోటికిపైగా రుణాలు

గురుగ్రామ్: ఏఐ సాయంతో తప్పుడు గుర్తింపు పత్రాలు తయారు చేసి రూ.కోటికి పైగా రుణాలు తీసుకున్న సోదరుల్ని గురుగ్రామ్ పోలీసులు అరెస్టు చేశారు. గౌరవ్ చబ్రా(35), దివ్యాంగ్ చబ్రా(24) కలిసి 2002 నుంచి తమ పేర్లతో ఉన్న వారి వివరాలు ఆన్ లైన్ లో శోధించి తప్పుడు గుర్తింపు పత్రాలు తయారు చేసి అప్పులు తీసుకుంటున్నారు. పదో తరగతితో చదువు ఆపేసిన వీళ్లిద్దరు.. పాన్ కార్డులు, ఓటర్ ఐడీలు తయారు చేసి ఆన్‌లైన్ లోన్ కంపెనీల నుంచి అప్పులు కుంటున్నారు. పెద్దమొత్తంలో అప్పు తీసుకుంటే అనుమానం వస్తుందని కేవలం రూ.లక్ష మాత్రమే తీసుకునేవారు. ఇలా నెలకు మూడు నుంచి నాలుగు లక్షలు సంపాదించే వారని పోలీసులు చెప్పారు. దిల్లీలోని ప్రతాప్ గంజ్ కు చెందిన ఓ వ్యక్తి.. తన పాన్ నంబర్ పై తాను తీసుకోని అప్పులు ఉన్నాయని గుర్తించి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేయటంతో ఈ సోదరుల బాగోతం బయటపడింది. సుమారు 30 లోన్లు ఫిర్యాదుదారుడి పేరు మీద నిందితులు తీసుకున్నారని.. మొత్తం రూ.7లక్షలు విడతల వారీగా డ్రా చేశారని పోలీసులు వివరించారు.అంతేకాక.. మరో 47 లక్షల రూపాయలకు గ్యారెంటీ ఇచ్చారన్నారు. బాధితుల పాన్, ఓటర్ ఐడీల్లో ఏఐ సాయంతో వేరే ఫొటోలు, తండ్రి పేరు, చిరునామా మార్చి అప్పులు, మొబైల్ సిమ్ కార్డులు తీసుకున్నారు. కేవలం గౌరవ్ అనే పేరుతో ఉన్న 50 మంది తప్పుడు గుర్తింపు పత్రాలను తయారు చేసి హర్యానా, నోయిడాలో లోన్లు తీసుకున్నారు. ఎవరూ గుర్తు పట్టకుండా ఉండటానికి చిరునామాలు మార్చే వాళ్లు.

అర్హులైన ప్రతి పేద కుటుంబానికి

విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లు

పేద కుటుంబాలకు రూ.5 లక్షల బీమా

- అంగన్‌వాడీ సేవలు మెరుగుపడాలి: మంత్రి పొంగులేటి



బూర్గంపాడు: కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం బూర్గంపాడు మండలం వేపలగడ్డలో రూ.20 లక్షలతో నిర్మించిన నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణ, కోరం కనకయ్య, కలెక్టర్ అంకిత్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం పోలవరం గ్రామంలో రూ.12 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. కొత్త రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, చేయూత పింఛన్లు అందిస్తున్నామని తెలిపారు. గతంలో రైతులకే పరిమితమైన బీమా భద్రతను పేద కుటుంబాలు, గీత కార్మికులు, కులవృత్తుల వారికి విస్తరించామని చెప్పారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ద్వారా కుటుంబ పెద్దను కోల్పోయిన కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక భరోసా కల్పిస్తున్నట్లు వివరించారు. ఇప్పటికే రెండు విడతల్లో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, త్వరలో మూడు, నాలుగో విడతల్లోనూ అర్హులకు ఇళ్లు అందిస్తామని హామీ ఇచ్చారు. మహిళా సంఘాలకు సున్నా వడ్డీ రుణాలు, చీరల పంపిణీ చేపడుతున్నామని, నిరుద్యోగ యువతకు 74 వేల ఉద్యోగాలు కల్పించామని, మరో 14 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చామని తెలిపారు.

నేడు నాగర్ కర్నూల్‌కుసీఎం రేవంత్‌రెడ్డి

రూ.450 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం



నాగర్ కర్నూల్ జిల్లా, నవంబరు 25 తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలో రేపు (గురువారం) పర్యటించనున్నారు. రేపు మధ్యాహ్నం మద్దిమడుగులో సంత్ సేవాలాల్ మహారాజ్ భారీ విగ్రహ ఏర్పాటుకు, వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం హెలికాప్టర్‌లో అచ్చంపేటకు చేరుకోనున్నారు. అచ్చంపేటలో హెలిప్యాడ్ నుంచి పాదయాత్రగా బహిరంగసభా ప్రాంగణా నికి సీఎం వెళ్లనున్నారు. బహిరంగ సభ ప్రాంగణంలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బహిరంగ సభ వేదికగా ఇందిరమ్మ చీరల పంపిణీ, చేయూత నూతన పెన్షన్ల పంపిణీని ప్రారంభించనున్నారు. అనంతరం బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి సీఎం ప్రసంగించనున్నారు. రూ.450 కోట్లతో నాగర్ కర్నూల్ జిల్లాలో పలు అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థా పన చేయనున్నారు. మద్దిమడుగులో...రూ.15 కోట్లతో శ్రీ పబ్బతి ఆంజనేయ స్వామి ఆలయ సమీపంలో హరిత హోటల్ ఏర్పాటుకు సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేస్తారు. రూ.18 కోట్లతో శ్రీ పబ్బతి ఆంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి శంకుస్థాపన చేయనున్నారు. రూ.38 కోట్లతో సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ భారీ విగ్రహం, ఇతర అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. అచ్చంపేట బహిరంగ సభ ప్రాంగణంలో.. రూ.274.32 కోట్ల తో నాగర్ కర్నూల్ జిల్లాలో బీటీ రోడ్ల అభివృద్ధికి శంకు స్థాపన. రూ.29.65 కోట్లతో నాగర్ కర్నూల్, పెద్ద కొత్తపల్లి, వెల్దండ ప్రాంతాల్లో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటుకు శంకుస్థాపన. రూ.25 కోట్లతో అచ్చంపేట మున్సిపాలిటీ పరిధిలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన. రూ.18.105 కోట్లతో వివిధ ప్రభుత్వ పాఠ శాలల్లో 130 అదనపు తరగతి గదుల నిర్మాణానికి శ్రీకారం చుట్టను న్నారు. రూ.14 కోట్లతో అమ్రాబాద్ మండలం మన్ననూర్‌లో నూతన ఐటీడీఏ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు.

తిరుప్పరంకుండ్రం దీపం వివాదం..

సుప్రీంకోర్టుకు క్షమాపణలు చెప్పిన తమిళనాడు ప్రభుత్వం



చెన్నై,నవంబర్,25 : దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారిన తమిళనాడులోని మదురై సమీపంలో గల తిరుప్పరంకుండ్రం కొండ రాతిస్తంభం (దీపతూన్ – వివాదం విషయంలో కీలక పరిణామం చోటు చేసుకుంది.ఎన్నో ఏళ్లుగా వస్తున్న సంప్రదాయం కార్తీక దీపం వెలిగించ లేకపోయినందుకు తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టుకు క్షమాపణలు చెప్పింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం అత్యున్నత న్యాయస్థానంలో స్థాయి నివేదికను దాఖలు చేసింది. అందులో తిరుప్పరం కుండ్రం దీపతూన్ వద్ద సంప్రదాయ దీపం వెలిగించలేకపోయామని అంగీకరిస్తూ తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్టేటస్ రిపోర్ట్ సమర్పించింది. కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ దీపం వెలిగించ లేకపోయి నందుకు ప్రభుత్వం తరఫున క్షమాపణలు కోరింది.

ఆలయ ధర్మకర్తల మండలి బృందానికి అధికారికంగా అనుమతి ఇవ్వకపోవడం వల్లే దీప తూన్ వద్ద సంప్రదాయ దీపం వెలిగించడం సాధ్యం కాలేదని తమిళనాడు ప్రభుత్వం కోర్టుకు వివరించింది. దీపం వెలిగించేందుకు దేవస్థానం అనుమతి పొందే విషయంలో జిల్లా యంత్రాంగం అన్ని విధాలా ప్రయత్నాలు చేసిందని మదురై జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. తిరుప్పరంకుండ్రం దీపతూన్ వద్ద దీపం వెలిగించేందుకు అనుమతిస్తూ మద్రాస్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ దాఖలైన ప్రధాన పిటిషన్‌పై వచ్చే ఏడాది జనవరిలో (జనవరి 2027) తుది విచారణ చేపట్టనున్నట్లు సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

తుంగభద్ర నుంచి తక్షణమే నీటిని విడుదల చేయాలి:శ్రీనివాస్ గౌడ్

ఆర్డీఎస్ ఆయకట్టుకు నీరివ్వకుంటే 20 వేల ఎకరాల్లో పంట నష్టమని వ్యాఖ్య

తుమ్మిళ్ల, ఆర్డీఎస్ చివరి తడులకు వెంటనే నీరు విడుదల చేయాలని డిమాండ్



హైదరాబాద్,నవంబర్,25 : తుంగభద్ర జలాశయం నుంచి రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ (ఆర్డీఎస్) ఆయకట్టుకు తక్షణమే చివరి తడుల కోసం 1 టీఎంసీ నీటిని విడుదల చేయించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత శ్రీనివాస్ గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.తుంగభద్ర నుంచి నీటి సరఫరా నిలిచిపోవడంతో ఆర్డీఎస్ ఆనకట్టలో నీటి నిల్వలు పూర్తిగా అడుగంటిపోయాయని శ్రీనివాస్ గౌడ్ వివరించారు. పంటలు చేతికొచ్చే సమయంలో నీటి విడుదల ఆగడంతో జోగులాంబ గద్వాల జిల్లాలోని రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు.

ఆర్డీఎస్ పరిధిలోని 12 నుంచి 22వ డిస్ట్రిబ్యూటరీ గ్రావిటీ కెనాల్స్ కింద సాగవుతున్న సుమారు 10 వేల ఎకరాలకు చివరి తడులు అందడం లేదన్నారు. అలాగే తుమ్మిళ్ల లిఫ్ట్ ఇరిగేషన్ పరిధిలోని మరో 10 వేల ఎకరాలకు కూడా సాగునీరు అందక మొత్తం 20 వేల ఎకరాల్లో పంటలు ఎండిపోయే ప్రమాదం ఏర్పడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. చేతికొచ్చిన పంటలు దెబ్బతినకుండా కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెంటనే ఈ అంశంపై దృష్టి సారించాలని కోరారు. కర్ణాటక ప్రభుత్వంతో తక్షణమే సంప్రదింపులు జరిపి, తుంగభద్ర నుంచి రావాల్సిన నీటిని విడుదల చేయించేలా చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అయ్యప్ప స్వామి మాలధారణ చేపట్టిన కాకర్ల

-శ్రీ అయ్యప్ప స్వామి దీక్ష భక్తిశ్రద్ధలతో ఆచరించాలి... -అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి జిల్లా అధ్యక్షులు డాక్టరేట్ కాకర్ల భీమయ్య... -30వ పాదం గురుస్వామి డాక్టరేట్ కాకర్ల భీమయ్య... -కర్ణాటక రాష్ట్రం మొత్కపల్లి బల భీమసేన ఆలయంలో మాలాధారణ...



నారాయణపేట,(డీకే చాటింపు): హరిహరపుత్రుడు శ్రీ అయ్యప్ప స్వామి మాలధారణ చేపట్టిన భక్తులు దీక్షా నియమ నిష్ఠలను తూచా తప్పకుండా భక్తి శ్రద్ధలతో ఆచరించాలని అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి జిల్లా అధ్యక్షులు డాక్టరేట్ కాకర్ల భీమయ్య అన్నారు.కర్ణాటక రాష్ట్రం మొత్కపల్లి బల భీమసేన ఆలయంలో పూజారి భీమాచార్య శ్రీనివాస్ చేతుల మీదుగా బుధవారం అయ్యప్ప దీక్ష మాలధారణ చేపట్టారు.ఈ సందర్భంగా 30వ పాదం గురుస్వామి డాక్టరేట్ కాకర్ల భీమయ్య మాట్లాడుతూ అయ్యప్ప దీక్ష చేపట్టిన స్వాములు నిత్యం స్వామి వారిని స్మరిస్తూ భక్తి,శ్రద్ధలతో పూజలు నిర్వహించాలన్నారు.దీక్షా కాలంలో నియమ నిష్ఠలు, ఆచార వ్యవహారాలను పాటిస్తూ సాత్విక జీవనం సాగించాలని సూచించారు. స్వామి శరణుఘోషతో ఆధ్యాత్మిక భావాలను పెంపొందించుకోవాలని అన్నారు.అయ్యప్ప దీక్ష చేపట్టిన స్వాములు నిత్యం స్వామి వారి నామస్మరణ చేస్తూ క్రమశిక్షణతో దీక్ష నియమాలను పాటించాలని ఆయన స్వాములకు సూచించారు.స్వాములు స్వాత్విక ఆహారం తీసుకుంటూ కోపతాపాలకు దూరంగా ఉంటూ భక్తి భావంతో మండల దీక్షను కొనసాగించాలని తెలిపారు. అంతే కాకుండా ప్రతి వారితో స్వామి అంటే పలుకుతూ చిరునవ్వుతో దీక్ష చేపట్టి స్వామివారికి నిత్యం పూజిస్తూ మండల దీక్షను చేపట్టాలని కోరారు. అయ్యప్ప స్వామి ఆశీస్సులు అందరికీ కలగాలని ఆయన ఆకాంక్షించారు.

నాటు వైద్యం వికటించి.. యువకుడి చేతికి తీవ్ర ముప్పు..!

-నారాయణపేట యశోద కేర్ హాస్పిటల్స్‌లో అరుదైన శస్త్రచికిత్స... -విజయవంతమైన చికిత్స... -డాక్టర్ల బృందాన్ని అభినందించిన కుటుంబ సభ్యులు... -నాటు వైద్యం నమ్ముకుని ప్రాణాల మీదికి తెచ్చుకోకండి... -నారాయణపేట యశోద కేర్ హాస్పిటల్స్ వైద్య బృందం...





నారాయణపేట,(డీకే చాటింపు): అర్హతలేని వ్యక్తుల వద్ద నాటు వైద్యం చేయించుకోవడం ఎంత ప్రమాదకరమో నారాయణపేట జిల్లా మక్తల్ మండలానికి చెందిన రాజశేఖర్(20)సంఘటన వెలుగులోకి వచ్చింది. మిడిమిడి జ్ఞానంతో నాటు వైద్యుడు చికిత్స చేసి సదరు పేషంట్ అనారోగ్యాన్ని క్షీణింప జేసి చివరకు ప్రాణం మీదికి తీసుకొచ్చారు.నాటు వైద్యంతో రోజురోజుకు క్షీణిస్తున్న సదరు పేషెంట్ పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని వారి కుటుంబ సభ్యులు వెంటనే నారాయణపేట జిల్లా కేంద్రంలోని యశోద కేర్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు.ఆ పేషంటుకు ఆస్పత్రి వైద్య బృందం మెరుగైన చికిత్సను అందించి అందరి చేత ప్రశంసలు పొందారు.వివరాల్లోకి వెళితే...మక్తల్ మండలానికి చెందిన రాజశేఖర్‌కు ఇటీవల చేతి ముంజేయిలోని రేడియస్,అల్నా ఎముకలు విరగడంతో అర్హత కలిగిన ఆర్థోపెడిక్ వైద్యుడిని సంప్రదించకుండా ముందుగా నాటు వైద్యం చేసే వ్యక్తి వద్దకు వెళ్ళి నాటు చికిత్స చేయించుకున్నారు.

రాజశేఖర్‌కు చేతికి సదరు నాటు వైద్యుడు బిగుతుగా నాటు కట్టు కట్టారు.ఈ కట్టు కారణంగా రాజశేఖర్ చేతి రక్తప్రసరణకు ఆటంకం ఏర్పడి తీవ్ర వాపు,రక్తంతో కూడిన బొబ్బలు, దుర్వాసనతో కూడిన చీము స్రావం వంటి సమస్యలు తీవ్రస్థాయిలో తలెత్తాయి.ఈ తీవ్రమైన పరిస్థితిలోనూ పేషంటును వారి కుటుంబ సభ్యులు నారాయణపేట యశోద కేర్ హాస్పిటల్స్,ఓల్డ్ గంజ్ కు తీసుకోచ్చారు. సదరు రోగిని హాస్పిటల్ వైద్య బృందం అన్ని విభాగాల్లో పరీక్షించింది.ఈ పరీక్షల్లో స్కానింగ్‌లో తీవ్రమైన సెల్యులైటిస్,మృదు కణజాల ఇన్ఫెక్షన్‌కు సంబంధించిన మార్పులను గుర్తించింది. అతిగా బిగుతుగా,సరైన ప్యాడింగ్ లేకుండా కట్టే నాటు కట్టు వల్ల రక్తం తిరిగి గుండెకు చేరే ప్రక్రియ దెబ్బతిని,రక్తం పేరుకుపోవడం,కణజాలం దెబ్బతినడం,తీవ్రమైన ఇన్ఫెక్షన్ వంటి ప్రమాదాలు ఏర్పడవచ్చని వైద్యులు తెలిపారు.సకాలంలో సరైన చికిత్స అందకపోతే చర్మం కుళ్లిపోవడం,ఎముకలకు ఇన్ఫెక్షన్,కంపార్ట్‌మెంట్ సిండ్రోమ్ వంటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని డాక్టర్ల బృందం నిర్ధారించి హెచ్చరించింది.యశోద కేర్ హాస్పిటల్స్‌లో ఆర్థోపెడిక్ వైద్యుడు డాక్టర్ డి.నరేందర్ (ఎంబీబీఎస్,ఎంఎస్, ఆర్థోపెడిక్స్,ఉస్మానియా) ఆధ్వర్యంలో అపసరమైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఈ చికిత్సలో డాక్టర్ నీలా వర్ణ,ఎండి అనస్థీషియా, సీనియర్ ఓటి అసిస్టెంట్ నరేష్ పాల్గొన్నారు. ప్రస్తుతం రోగి క్షేమంగా ఉన్నారని, ఆరోగ్య పరిస్థితి మెరుగుపడటంతో కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. వైద్యులు మాట్లాడుతూ ఫ్రాక్చర్ అంటే కేవలం ఎముక విరగడం మాత్రమే కాదు. ఎముకలతో పాటు రక్తనాళాలు, నరాలు, చర్మం, మృదు కణజాలాన్ని కూడా కాపాడటం ఎంతో ముఖ్యం. నాటు వైద్యం పేరుతో అర్హతలేని వ్యక్తుల వద్ద బిగుతైన కట్టు వేయించుకోవడం ప్రమాదకరమని తెలిపారు. ఎముకలు విరిగిన వెంటనే అర్హత కలిగిన ఆర్థోపెడిక్ వైద్యుడిని సంప్రదించాలని సూచించారు.నా రాయణపేట జిల్లా ప్రజలకు ఆధునిక వైద్య సదుపాయాలతో పాటు తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్య సేవలు అందించడమే యశోద కేర్ హాస్పిటల్స్ లక్ష్యమని ఆసుపత్రి యాజమాన్యం వెల్లడించింది. ఆర్థోపెడిక్ చికిత్స,స్కానింగ్, డిజిటల్ ఎక్స్‌రే,శస్త్రచికిత్స వంటి సేవలను అందుబాటు ధరల్లో అందిస్తున్నట్లు నారాయణపేట యశోద కేర్ హాస్పిటల్స్ యజమాన్యం తెలిపింది.

ప్రజలకు విజ్ఞప్తి :నాటు కట్టును నమ్మి మీ ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టుకోవద్దు.ఎముకల చికిత్సను అర్హత కలిగిన ఆర్థోపెడిక్ వైద్యుడితోనే చేయించుకోవాల్సిందిగా యశోద కేర్ హాస్పిటల్స్ ఓల్డ్ గంజ్,నారాయణపేట సూచించింది.మీ ఆరోగ్యం– మా బాధ్యత అని తెలిపారు.

బెల్టు షాపులపై చర్యలు తీసుకోవాలి

-నారాయణపేట ఎక్సైజ్ అధికారులకు జనసేన పార్టీ వినతి పత్రం... -బెల్ట్ షాపులను నియంత్రించకపోతే ఆందోళన కార్యక్రమాలు...



నారాయణపేట,(డీకే చాటింపు): నారాయణపేట పట్టణం పరిసరాల గ్రామాల్లో విచ్చలవిడిగా కొనసాగుతున్న బెల్ట్ షాపులను తక్షణం నియంత్రించేందుకు తగు చర్యలు తీసుకోవాలని నారాయణపేట జనసేన పార్టీ మహిళ నేతలు బుధవారం నారాయణపేట ఎక్సైజ్ అధికారులకు ఓ వినతి పత్రాన్ని సమర్పించారు. గ్రామాల్లో పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన అక్రమ బెల్ట్ షాపులు నిరుపేద కూలీల జీవితాలను మరింత ఆగం చేస్తున్నట్లు వారు ఆవేదన వ్యక్తం చేశారు.ఎల్ నినో ప్రభావంతో వర్షాలు సరిగ్గా పడక భూగర్భ జలాలు అడుగంటిపోయి పంటలు ఎండిపోతున్నాయి.సాగు నీరు లేక,పెట్టిన పెట్టుబడులు రాక అప్పుల ఊబిలో రైతులు కూరుకుపోయి తీవ్ర ఆవేదనలో ఉన్నారు. పంటలు లేకపోవడంతో పల్లెల్లో పనులు దొరక్క పొట్ట కూటి కోసం రోజువారీ కూలీలు(డైలీ లేబర్) పడుతున్న కష్టాలు అన్నీ ఇన్నీ కావని అన్నారు. ఇలాంటి కరువు పరిస్థితుల్లో రైతులకు,కూలీలకు అండగా నిలవాల్సిన సమయంలో జిల్లా కేంద్రంలో చుట్టూ, గ్రామాల్లో పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన అక్రమ బెల్ట్ షాపులు వారి జీవితాలను మరింత ఆగం చేస్తున్నాయి. రోజంతా కష్టపడితే దొరికే అరకొర కూలీ డబ్బులు, అప్పులు చేసి తెచ్చిన డబ్బులన్నీ ఈ బెల్ట్ షాపుల పాలవుతున్నాయి.కరువుతో, అప్పుల బాధతో కుమిలిపోతున్న రైతులు, కూలీలు మానసిక ఒత్తిడితో ఈ మత్తుకు బానిసలవుతున్నారు.ప్రతి వీధిలో,కిరాణా కొట్టులో విచ్చలవిడిగా మద్యం దొరకడంతో వల్లె ప్రజల ఆరోగ్యం,ఆర్థిక పరిస్థితి పూర్తిగా దెబ్బతింటోంది.ఇంటి పెద్ద మద్యానికి బానిస కావడంతో ఇంట్లో ఆడబిడ్డలు,పిల్లలు పస్తులుండాల్సిన దుస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు.యువత కూడా పనులు లేక ఈ మత్తుకు అలవాటు పడి తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలగడానికి, కుటుంబ కలహాలు పెరగడానికి ఈ అక్రమ మద్యం విక్రయాలే మూల కారణమవుతున్నట్లు వారు తెలిపారు.కరువు బారిన పడిన రైతులు,కూలీలను ఆదుకోవాల్సింది పోయి బెల్ట్ షాపుల ద్వారా వారి రక్తాన్ని పీల్చడం అత్యంత దారుణమని జనసేన పార్టీ తరపున వెల్లడించారు. తక్షణమే ఎక్సైజ్,పోలీసు శాఖ అధికారులు స్పందించి నారాయణపేట జిల్లాలోని అన్ని గ్రామాల్లో నడుస్తున్న అక్రమ బెల్ట్ షాపులపై ఉక్కుపాదం మోపాలి. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకొని వల్లెలను మత్తు రహిత గ్రామాలుగా మార్చాలి.అదేవిధంగా ఎల్ నినో ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతులకు ఉపాధి కోల్పోయిన రోజువారీ కూలీలకు ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం అందించి ఆదుకోవాలి. అధికారులు తక్షణమే బెల్ట్ షాపులపై చర్యలు తీసుకోకపోతే రైతులు, కూలీలు,ఆడబిడ్డలతో కలిసి జనసేన పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడతామని ఆ పార్టీ నేతలు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వీర మహిళలు,జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సబితా ఇంద్రా రెడ్డి ఆధ్వర్యంలో 29 న పెద్దబావి మల్లారెడ్డి గార్డెన్ లో దీక్షా దివస్

మీర్పేట పార్టీ అధ్యక్షులు అర్కల కామేష్ రెడ్డి



మహేశ్వరం, (డికే చాటింపు) మాజీ మంత్రివర్యులు బిఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ మహేశ్వరం నియోజకవర్గ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆదేశాల మేరకు ఈ యొక్క ప్రెస్ మీట్ నిర్వహించడం అయినది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో తెలంగాణ రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాన్ని వ్యతిరేకించి ఆరోజు 2001లో కేసీఆర్ అప్పటి ప్రభుత్వం నుంచి బయటకు వచ్చి తెలంగాణ రాష్ట్ర సమితి అనే ఒక పార్టీని స్థాపించి తెలంగాణ రాష్ట్రంలో అన్ని వర్గాలను ఏకం చేసి అప్పటి కేంద్ర కేంద్ర ప్రభుత్వంపై పలుమార్లు ఒత్తిడి తెచ్చి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించే దిశగా ఎన్నో అడుగులు వేశారు కేసీఆర్ అప్పటికి తెలంగాణ పైన ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా వేచిచూసే దూరంలో కేంద్ర ప్రభుత్వం తీరును నిరసిస్తూ 29 11 2009వ సంవత్సరంలో కెసిఆర్ ఆమరణ నిరాహార దీక్షకు పోనుకొని కెసిఆర్ చర్చలో తెలంగాణ వచ్చుడో అనే నినాదాలు తీసుకొని 11 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి కేంద్రం మెడలు వంచి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన తీరు మనమందరం కూడా గమనించా మని కెసిఆర్ ఆమరణ నిరాహార దీక్ష చేసిన రోజును అప్పటినుంచి దీక్షా దివస్ గా పరిగణించి వివిధ కార్యక్రమాలను చేపట్టడం జరుగుతూ ఉంది అందులో భాగంగానే ఈనెల 29వ తేదీన మహేశ్వరం నియోజకవర్గ ఎమ్మెల్యే సబితా ఇంద్రా రెడ్డి ఆధ్వర్యంలో బడంగ్పేట్ లోని పెద్దబావి మల్లారెడ్డి గార్డెన్ లో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు దీక్షా దివస్ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుంది. కావున ఈ కార్యక్రమాల్లో మహేశ్వరం నియోజకవర్గ టిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు విధిగా పాల్గొని జయప్రదం చేయవలసిందిగా మనవిఈ ప్రెస్ మీట్ లో పాల్గొన్నవారు మహేశ్వరం నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్, మీర్పేట పార్టీ అధ్యక్షులు అర్కల కామేష్ రెడ్డి ఉద్యమకారుల కన్వీనర్ నేలకొండ శ్రీనివాస్ రెడ్డి సిద్దల భరత్ జగన్మోహన్ రెడ్డి పెంబర్తి శ్రీనివాస్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు

రఘునాథ్ చెరువులో వాటర్ స్పోర్ట్స్ ఏర్పాట్లను పర్యవేక్షించిన పోలీస్ కమిషనర్





నిజామాబాద్ ప్రతినిధి నవంబర్ 25 (డీకే చాటింపు):నిజామాబాద్ జిల్లాలో నిర్వహించనున్న 5వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్--2026 ముగింపు కార్యక్రమం లో భాగంగా, రఘునాథ్ చెరువులో నిర్వహిం చనున్న వాటర్ స్పోర్ట్స్ కు సంబంధించిన ఏర్పాట్లను పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, క్షుణ్ణంగా పరిశీలించి పర్యవే క్షించారు.ఈ సందర్భం గా చెరువులో క్రీడా కార్యక్రమాల నిర్వ హణకు చేపడుతున్న ఏర్పాట్లు , క్రీడాకారు లకు అవసరమైన సౌకర్యాలు , భద్రతా చర్యలు , నీటి క్రీడలకు అనువైన వాతావరణం తదితర అంశాలను పరిశీలించారు. వాటర్ స్పోర్ట్స్‌లో పాల్గొనే క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు కలగ కుండా అన్ని ఏర్పాట్లు సమగ్రంగా చేయాలని సంబంధిత అధికా రులకు సూచించారు.ఈ సందర్భంగా సి.సి.యస్ ఎ.సి.పి శ్రీశైలం , వాటర్ స్పోర్ట్స్ కోచ్ పి. కృష్ణారావు , డైరెక్టర్ ఆనందం , కోచ్ ఎన్. శ్రీనివాస్,నిజా మాబాద్ రూరల్ ఇన్స్పెక్టర్ శ్రీ శ్రీనివాస్ తదితరులు పాల్గొనడం జరిగింది.

అంకాపూర్ మోడల్ విలేజ్ కు ట్రైనీ అధికారుల సందర్శన



ఆర్మూర్ విలేఖరి నవంబర్ 25 (డీకే చాటింపు):దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన మన ఆర్మూర్ నియోజకవర్గం లోని అంకాపూర్ మోడల్ విలేజ్ ను వారం రోజులపాటు సందర్శిం చడానికి విచ్చేసిన ట్రైనీ ఐఏఎస్ క్యాడర్ అధికారుల బృందం అంకాపూర్ లోని ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ రంగంలో అంకాపూర్ సాధించిన ప్రగతి, గ్రామ పరిపాల నా విధానాలు, అభి వృద్ధి నమూనా గురిం చి వారు క్షుణ్ణంగా తెలుసుకున్నారు .ఈ సందర్భంగా వారిని ఎమ్మెల్యే శాలువాతో నత్కరించి, ట్రైనీ ఐ ఎ ఎన్ లకుశుభా కాంక్షలు తెలియజేశారు.పరిపాలనలో నిబద్ధతతో పనిచేయాలని, ప్రభుత్వ పథకాలు ప్రతి పేదవాడికి,చివరి వ్యక్తికి అందేలా చూడాలని, ప్రజలకు సేవ చేయడమే అత్యున్నత ధర్మమని సూచించడం జరిగింది.

నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ మరింత అభివృద్ధి చెందాలి

-డాక్టర్స్ కాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నల్లెంకి ధన్ రాజ్ గౌడ్-

ఎంబి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ను ప్రారంభించిన నల్లంకి



ఎల్బీనగర్, (డికే చాటింపు) ఎల్బీనగర్ నియోజకవర్గ గడ్డి అన్నారం డివిజన్లో హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ భాను చందర్,డాక్టర్ బాలు సోదరుడు ఇమ్రాన్ అలీ ఆహ్వానం మేరకు నూతనంగా ఏర్పాటు చేసిన ఎంబి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న డాక్టర్స్ కాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నల్లెంకి ధన్ రాజ్ గౌడ్ ఈ సందర్భంగా నల్లెంకి ధన్ రాజ్ గౌడ్ మాట్లాడుతూ నూతనంగా ప్రారంభమైన ఎం.బి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ యాజమాన్యానికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఈ ఆసుపత్రి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ మరింత అభివృద్ధి చెందాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.ఈ కార్యక్రమంలో డివిజన్ ఎస్ సి సెల్ అధ్యక్షులు కలుముల సంతోష్ కుమార్ , మురళి ,శ్రీకాంత్ , శ్రీధర్ ,యువ నాయకులు నల్లెంకి భార్గవ్ గౌడ్ గారులి మరియు తదితరులు పాల్గొన్నారు.



డీకే చాటింపు
తెలంగాణ దిన పత్రిక
గురువారం,నవంబర్,26, 2026

మనిషిలో దాగిన క్రూరత్వం!

చిన్నారులపై జరుగుతున్న లైంగిక దాడులు, హత్యలు కేవలం చట్టపరమైన సమస్యలు మాత్రమే కావు. ఈ నేరాల వెనుక దాగి ఉన్న క్రూర మనస్తత్వం, సామాజిక వైఫల్యాలు, నైతిక సంక్షోభం గురించి విశ్లేషించే కథనం. చిన్నారులపై జరుగుతున్న అత్యాచారాలు, వాటి తర్వాత వెలుగులోకి వస్తున్న అమానుష హింస, హత్యలు సమాజాన్ని కుదిపేస్తూనే ఉన్నాయి. ప్రతి సంఘటన తర్వాత ఒకే రకమైన ఆవేదన వ్యక్తమవుతోంది. కొవ్వొత్తుల ర్యాలీలు జరుగుతున్నాయి. న్యాయం కోసం నినాదాలు వినిపిస్తున్నాయి. కఠిన శిక్షల కోసం డిమాండ్లు పెరుగుతున్నాయి. కానీ ఈ ఆగ్రహం, దుఃఖం , ఆందోళనలు, మానసిక సంఘర్షణలు అసలు మూలాన్ని వెతకడంలో అలసిపోతున్నాయి . ఇలాంటి నేరాలకు పాల్పడే వ్యక్తుల మానసిక ప్రవృత్తి ఏమిటి? అది ఒక్క క్షణపు ఉద్వేగమా? లేక వారి వ్యక్తిత్వంలోనే దాగి ఉన్న ఏదైనా చీకటా? లేదా వారి జీవితం, వారి స్వతః సిద్ధ మానసిక కోణం ఇలాంటప్పుడే బయటపడుతోందా!? ఇన్నాళ్లు మనం దానిని ఇగ్నోర్ చేశామా? ఇవే ఆ మూలాలు.. ఇలాంటి నేరాలు జరగగానే ఆ క్రూరుడిని ఒక గాటన కట్టేస్తాం "అదుపు తప్పిన కోరిక", "క్షణిక ఉద్వేగం", "ఆవేశం" వంటి అనేక పొరల మాటున అతను చేసిన గాయాన్ని మర్చిపోతున్నాం. కానీ వయసుతో సంబంధం లేకుండా, పరిస్థితుల అంశం లేస్యమాత్రమైనా లేకుండా చిన్నారులపై, మహిళలపై, జరిగే అత్యాచారాలను, వాటి తర్వాత జరిగే హత్యలను పరిశీలించినప్పుడు ఇవన్నీ అసంపూర్ణాలు కదా!. అవును ఒకవేళ అది నిజంగానే ఒక్క క్షణపు ఉద్వేగమే అయితే, ఆ దారుణ కృత్యానికి ముందూ, వెనుకా కనిపించే పాశవిక హింస సంగతి ఏమిటి? చిన్నారి భయాన్ని చూస్తూ, చిన్నారి లేదా ఆమె అసహాయతను గమనిస్తూ, ఆ బాధను గ్రహిస్తూ కూడా తనను తాను మనిషిగా మరచిపోయి మృగత్వాన్ని కొనసాగించడం ఏ రకపు ఉద్వేగం? తన తనకాలమాన పరిస్థితులు, తన సోషల్ స్టేటస్, అందులో తాను అప్పటివరకూ పొందిన పేరు అన్నీ వదిలేసి కేవలం తన పశుత్వాన్ని మాత్రమే తాను నిరూపించుకోవడానికి సిద్ధపడటం ఏమిటి ! పోనీ నేరం జరిగిన తర్వాత అయినా తనను తాను గుర్తిస్తున్నారా? హత్యలకూ దిగుతున్నారు అదీ అత్యంత కర్కశంగా.. ఎవిడెన్స్‌ను చెరిపేయడానికి తొక్కకూడని దారులు తొక్కుతూ ఒక తప్పుకు వంద తప్పులు చేస్తూ పోతున్నారు? బయటపడతాననే భయంతో బాధితులకు ఇంకా ఇంకా నరకం చూపెడుతున్నారు. అసలిక్కడి వాస్తవం క్షణిక ఉద్వేగం కాదు. అతని లోపలి ఎన్నో రోజుల క్రూరత్వం. ఒక చిన్నారి కన్నీళ్ల కంటే తన కోరిక పెద్దదిగా కనిపిస్తోంది, ఒక చిన్నారి ప్రాణం కంటే తన రక్షణ ముఖ్యమైపోతోంది, ఎదుటివారి బాధను గుర్తించలేని నైతిక పతనం ఇది. ఒక మనిషి మరొక మనిషిని మనిషిగా చూడలేని స్థితి ఇది. సైకాలజీ దీనిని మానవత్వాన్ని హరించడంగా నిర్వచిస్తుంది. అంటే ఎదుటివారి వ్యక్తిత్వం, హక్కులు, బాధ అన్నీ అదృశ్యమై, అతను లేదా ఆమె కేవలం ఒక వస్తువుగా మారిపోవడం, తన ఆనందం, తన మానసిక వికారం తీర్చుకోవడానికి వారు ఒక ఆటబొమ్మగా వీరి దృష్టికి కనిపించడం. పోనీ ఇది క్షణకాలపు ఉద్వేగం కాదు, ఇది వారి వ్యక్తిత్వంలో భాగమే అనుకుంటే, అటువంటి వ్యక్తులను మనం ఎలా గుర్తించాలి? ఎవరిని నమ్మాలి? ఎవరిని అనుమా నించాలి? ఇలాంటి నేరాలు చేసే వారు మనకేం రాక్షసుల్లా కనిపించరు. వారి ముఖాలపై క్రూరత్వం రాసి ఉండదు. వారు కుటుంబ సభ్యులుగా, బంధువులుగా, పొరుగువారిగా, సహోద్యోగులు గా, కొన్నిసార్లు సమాజంలో అత్యంత గౌరవనీయులుగా కూడా ఉంటారు."అతను అలాంటి వాడని అనుకోలేదు." అనేంత మంచివాడిగా మన మధ్య తిరుగుతూ మనతోనే జీవిస్తుంటారు. ఇదే ఇప్పటి సమాజం ఎదుర్కొంటున్న అసలైన సవాలు, ఒకానొక చీకటిని గురించిన భయం. ఇది కేవలం ఒక వ్యక్తి సమస్య కాదు. మనుషులను అర్థం చేసుకునే మన సామర్థ్యపు సమస్య, విలువల సమస్య. మనం చూసేది ఒక పబ్లిక్ ఇమేజ్‌ని మాత్రమే అయితే? మనకు కనిపించని అతని మరో ప్రపంచం!? ఆ చీకటిని ముందుగానే గుర్తించలేని మన నమ్మకం!? ఇవన్నీ ప్రశ్నలే. మనం చేస్తున్న కొవ్వొత్తుల ర్యాలీలతో మనతో నిలబడ్డ వ్యక్తుల అసలు రంగు మనం చూసేది ఎలా!? వారి అంతర్ముఖ చిత్రాలు చిత్రించేది ఎలా!? అందుకే చిన్నారులపై జరిగే లైంగిక హింసను కేవలం చట్ట పరమైన సమస్యగా చూడలేం.


NEWS
డీకే చాటింపు
తెలుగు దినపత్రిక
సమాచారం.. ప్రజల కోసం.. ప్రజలతో...
విలేఖరులు కావలెను!
తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోని అన్ని నియోజకవర్గాలు మరియు మండలాల వారీగా డీకే చాటింపు తెలుగు దినపత్రికకు విలేఖరులు కావలెను.
అన్ని జిల్లాలు
అన్ని నియోజకవర్గాలు
అన్ని మండలాలు
మా లక్ష్యం... ప్రజా సమస్యలపై నిరంతరం వార్తలు!
అర్హతలు, ప్రాధాన్యతలు
తెలంగాణలోని అన్ని జిల్లాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.
అన్ని నియోజకవర్గాలు, మండలాల వారీగా విలేఖరుల నియోమకం.
అనుభవం కలిగిన విలేఖరులకు ప్రాధాన్యత ఇవ్వబడును.
ప్రతి జిల్లాకు 2 అక్రిడిటేషన్‌లు కలిగిన తెలుగు దినపత్రిక.
సంప్రదించండి:
9603754136
ఆసక్తి గల అభ్యర్థులు వెంటనే సంప్రదించగలరు.

పౌల్ట్రీ ఎక్స్పో ను ప్రారంభించిన సీఎం



డీకే చాటింపు ప్రతినిధి, (హైదరాబాద్):హైదరాబాద్ లో పౌల్ట్రీ ఇండియా ఎక్స్ పో 2026 ఏర్పాటు చేయడం అభినందనీయమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. 5 కోట్ల 30 లక్షల గుడ్లను ఉత్పత్తి చేసి విద్యార్థులకు, యువతకు పౌష్టిక ఆహారాన్ని అందించడంలో పాల్ట్రీ వ్యాపారులు భాగస్వాములు అవుతున్నారని ఆయన తెలిపారు.నగరంలోని హెచ్ఐసిసి లో బుధవారం పౌల్ట్రీ ఎక్స్పో ఇండియా 2026 ను సీ ఎం ప్రారంభించారు.పౌల్ట్రీ పరిశ్రమ ఏర్పాటు చేసుకునేందుకు ఎదురవుతున్న సమస్యలను నా దృష్టికి తీసుకొచ్చారన్నారు.సంక్షోభ సమయంలో రాష్ట్ర ప్రభుత్వం సహకారం ఉండాలని ప్రతిపాదనలు అందించారని, గ్రామ పంచాయతీలలో పౌల్ట్రీ నిర్మించుకోవడానికి సింగిల్ విండో విధానంలో అనుమతులు అందించేలా ప్రభుత్వం మార్పులు తీసుకొస్తుందని ముఖ్యమంత్రి వివరించారు.ఎల్ నినో కరువు పరిస్థితుల నేపథ్యంలో రెండేళ్లకు సరిపడా సన్నంబియ్యం ప్రభుత్వం దగ్గర నిల్వలు ఉన్నాయని గుర్తు చేసారు. పౌల్ట్రీకి సంబంధించి మొక్కజొన్నల కొరత ఉందని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఆ సమస్యను పరిష్కరించేలా చూడాలని మా మంత్రులను ఆదేశిస్తున్నానని తెలిపారు. వ్యవసాయ కూలీలకు, రైతులకు ఉపాధి కలిగించే పరిశ్రమ పౌల్ట్రీ,పౌల్ట్రీ ఇండస్ట్రీ కేవలం కోళ్లను, గుడ్లను ఉత్పత్తి చేయడమే కాదు.. రైతుల ఆర్థిక శక్తిని బలోపేతం చేస్తుందని సీ ఎం అభిప్రాయపడ్డారు.ఈ పరిశ్రమకు ప్రభుత్వం నుంచి అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. ఒడిదుడుకులను తట్టుకుని పరిశ్రమలో నిలబడటం, పరిశ్రమను కాపాడటాన్ని ప్రభుత్వం అభినందిస్తోందన్నారు. పౌల్ట్రీని ఒక ప్రాధాన్యత రంగంగా గుర్తించి శాశ్వత పరిష్కారం దిశగా పాలసీలను రూపొందిస్తామని ఆయన స్పష్టం చేశారు. కాలానుగుణంగా, క్షేత్రస్థాయి అవసరాలకు అనుగుణంగా పాలసీలను ఇంప్రూవ్ చేసుకుంటామన్నారు. పాలసీలు, ప్రభుత్వ నిర్ణయాల విషయంలో చింత అవసరం లేదని తెలిపారు. తెలంగాణలో పాలసీ పెరాలసిస్ లేదని,గత ప్రభుత్వాలు రూపొందించిన మంచి పాలసీలను కొనసాగిస్తూనే, కొత్త పాలసీలను తీసుకొస్తున్నామన్నారు. 2047 నాటికి తెలంగాణకు 3 ట్రిలియన్ ఎకానమీగా తీర్చి దిద్దాలనే లక్ష్యంతో ముందుకు వెళుతున్నామని రేవంత్ రెడ్డి స్పష్టం చేసారు.

పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష -- బాధితులకు రూ.16 లక్షల పరిహారం

సిబ్బందిని అభినం దించిన పోలీసు కమిషనర్



నిజామాబాద్ ప్రతినిధి నవంబర్ 25 (డీకే చాటింపు): ఎడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో బాధితుల కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నమోదైన పోక్సో కేసులో నింది తుడికి ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ జడ్జ్ ఫర్ పోక్సో కోర్ట్ (ఇన్‌ఛార్జ్ ఉమెన్స్ కోర్ట్), నిజామాబాద్ 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది.కేసువివరాలు PSC 165/2020, Cr No. 77/2020, ఎడపల్లి ూూ పరిధిలో376ూూదీ , 363, 506 IPC Ê Sec 5(m) r/w 6 ఫోక్సో చట్టం కింద పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయినట్లు వివరించారు. న్యాయమూర్తి డి. దుర్గా ప్రసాద్ బహిరంగ న్యాయస్థానంలో తీర్పు వెలువరించారు.నిందితుడు వివరాలు మాచ్కూరి నారాయణ 53 సం. తండ్రి: అబ్బన్న, ఎడపల్లి మండలంలోని జాన్‌కంపేట్ గ్రామస్తు డని వివరించారు .న్యాయస్థానంవిధించిన శిక్షలు1.POCSO Sec 5(m) r/w 6:లి 20 సంవత్సరాల RI + రూ.20,000/- జరిమానా. జరిమానా చెల్లించని పక్షంలో 6 నెలల RI.,2.IPC Sec 506:2 సంవత్సరాలు + రూ.5,000/- జరిమానా. జరిమానా చెల్లించని పక్షంలో 6 నెలల RI. ఉంటుందని తెలిపారు.బాధిత బాలికలకు డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ణూూూ ద్వారా మొత్తం రూ.16 లక్షలుపరిహారం అందిం చాలని గౌరవనీయ న్యాయస్థానం ఆదే శించింది. ఇట్టి కేసులో ఎం. నీరజా రెడ్డి, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, పోక్సో కోర్ట్, నిజామాబాద్, మరియుదర్యాప్తు అధికారులు: 1వ ×ూ - వి. జయపాల్ రెడ్డి, ACP, 2e IO - ఎన్. రామారావు, ఏసీపీ , బోధన్ రూరల్ డివిజన్.బ్రీఫింగ్ అధికారులు: డి. విజయ్ బాబు, CIP, బోధన్ రూరల్ సర్కిల్ & ఎం. రామ,ఔ×ూ, ఎడపల్లి సమర్థవంత మైన దర్యాప్తు , పటిష్ట మైన సాక్ష్యాధారాలు , ప్రాసిక్యూషన్ సమర్థవంతమైన వాదనల వల్ల నిందితుడికి శిక్ష పడేందుకు కృషి చేసిన కోర్టు లైజాన్ అధికారి టి. గోవింద్ జమీ, జణూ,ఎన్. మారుతి , PC-806 , బి. ప్రవీణ్ , PC-2105,ఎస్. రణ BósY,PC-3025 ఎడ పల్లి PS సిబ్బందిని నిజామాబాదు పోలీస్ కమిషనర్ పి సాయి చైతన్య,అభినందించారు.

సాలూర ఉన్నత పాఠశాలను ఆకస్మికం గా తనిఖీ చేసిన కలెక్టర్ - అదనపు తరగతి గదులు మంజూరు- ప్లే గ్రౌండ్, ప్రహరీ గోడ నిర్మాణాలకు నిధుల కేటాయింపు



నిజామాబాద్ ప్రతినిధి, నవంబర్ 25 (డీకే చాటింపు): సాలూర మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాలను కలెక్టర్ ఇలా త్రిపాఠి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణ, తరగతి గదులను పరిశీలిం చారు. ఎఫ్.ఆర్.ఎస్ విధానంలో విద్యార్థు లు, ఉపాధ్యాయుల హాజరు ప్రక్రియను తనిఖీ చేశారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందిస్తున్నా రా లేదా అని ఆరా తీశారు. మౌలిక వసతులు, అందు బాటులో ఉన్న సదు పాయాల గురించి అడిగి తెలుసుకున్నారు.స్థానికంగా విద్యార్థు లకు పలు ఇబ్బందులు తలెత్తుతున్నాయని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులులేవని హెచ్.ఎం రాజీ మంజుశ్రీ కలెక్టర్ దృష్టికి తేగా, ఐదు అదనపు తరగతి గదులను మంజూరు చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. పాఠశాలకు ప్రహరీ గోడ, ప్లే గ్రౌండ్ ను కూడా మంజూరు చేస్తామని వెల్లడించా రు. అయితే వచ్చే విద్యా సంవత్సరంలో విద్యార్థుల సంఖ్య మరింత గణనీయంగా పెరిగేలా అంకిత భావం తో కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఉపా ధ్యాయులు అందరూ తప్పనిసరిగా సమయ పాలనపాటిస్తూ, బోధనా విధులకు హాజరు కావాలని అన్నారు. ఎలాంటి అనుమతి లేకుండా విధులకు గైర్హాజర్ అయిన వారిని షోకాజ్ నోటీసులు అందించడం వంటివి కాకుండా నేరు గా సస్పెన్షన్ చేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. అదేవిధంగా విద్యార్థు లు సైతం నూటికి నూరు శాతం మంది క్రమం తప్పకుండా బడికి హాజరయ్యేలా చూడాలన్నారు. ఎక్కువ రోజుల పాటు గైర్హాజర్ అయ్యే విద్యా ర్థిని విద్యార్థులపై ప్రత్యే క దృష్టిని కేంద్రీకరించా లని, వారు ఎందుకు బడికి రావడం లేదన్న ది క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు అందు బాటులో ఉండేలా చూడాలన్నారు. ప్రతి విద్యార్థికి సంబంధించి తప్పనిసరిగా ఆధార్ సీడింగ్ పూర్తి చేయాల న్నారు. ఉన్నత పాఠశా లకు ఆనుకుని ఉన్న ఉర్దూ మీడియం స్కూల్ ను సైతం కలుపుకుని విద్యార్థు లకు అనువైన రీతిలో ప్లే గ్రౌండ్ అందుబాటు లోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని సంబం ధిత అధికారులను ఆదేశించారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ 8వ తరగతి గదికి వెళ్లి విద్యార్థులతో భేటీ అయ్యారు. గణితం సబ్జెక్టుపై ప్రశ్నలు వేసి, విద్యార్థుల సామర్థ్యా న్ని అంచనా వేశారు. చక్కగా సమాధానాలు చెప్పిన విద్యార్థులకు బహుమతులు, చాక్లెట్లు అందించారు. అన్ని వసతులు అందు బాటులో ఉండేలా చర్యలు తీసుకున్నా మని, చక్కగా చదువు కోవాలని హితవు పలికారు. కలెక్టర్ వెంట ఇంచార్జి డీ.ఈ.ఓ సాయాగౌడ్, తహసీ ల్దార్ ఎం.ఏ.నవాజ్ తదితరులు ఉన్నారు.

డ్రగ్స్ ఫ్రీ ఇండియా కార్యక్రమానికి భారీగా తరలివెళ్లిన బీజేపీ జి ఎస్ ఐ డివిజన్ నాయకులు, కార్యకర్తలు

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి -- సమాజంలో చైతన్యం తీసుకురావాలి: ఎర్ర వినోద్ రెడ్డి



ఎల్బీనగర్ (డీకే చాటింపు) కేంద్ర మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి గారు నిర్వహించిన "నశా ముక్త్ భారత్ -- డ్రగ్స్ ఫ్రీ ఇండియా" కార్యక్రమానికి బీజేపీ +ూ× డివిజన్ అధ్యక్షులు ఎర్ర వినోద్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ సినీ నటుడు విక్టరీ వెంకటేష్ గారు హాజరై, జెండా ఊపి పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యక్రమం ముఖ్య ఉద్దేశాన్ని వివరిస్తూ, నేటి యువత తెలిసీ తెలియక మత్తు పదార్థాలకు అలవాటు పడుతూ తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని, అలాంటి ప్రమాదకరమైన అలవాట్లకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. యువతలో చైతన్యం తీసుకురావడంతో పాటు, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.మత్తు పదార్థాల రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని, యువత తమ శక్తిసామర్థ్యాలను దేశాభివృద్ధికి ఉపయోగించాలని ఈ కార్యక్రమం ద్వారా సందేశం ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు సిద్దాల ఐలయ్య జిల్లా కౌన్సిల్ మెంబర్ పాల్వాయి సంజీవ రెడ్డి, నరేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రాజు (రవీందర్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, శ్రీనివాస్ చారీ, నరేష్ యాదవ్, సంపత్ కుమార్, రమణ రెడ్డి, లక్ష్మి దీప, సంజీవ రెడ్డి, వీరయ్య,ప్రభాకర్ రెడ్డి వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

భక్తీ శ్రద్దలతో మహా లింగార్చన



నిజామాబాద్ ప్రతినిధి నవంబర్ 25(డీకే చాటింపు): కార్తీక దామోదర మాసం సందర్భంగా.డిచ్పల్లి స్థానిక కాశీ విశ్వనాథ స్వామి దేవాలయంలో మహాలింగార్చన కార్యక్రమం భక్తీ శ్రద్దలతో నిర్వహిం చారు. సాయంత్రం కార్యక్రమాన్ని ఆరున్నరకు ప్రారంభ మైన లింగార్చన గంట పాటు జరిగింది. కార్య క్రమంలో పెద్ద సంఖ్య లో భక్తులు తరలి వచ్చారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లు దేవాలయ కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కి కృషి:ఎమ్మెల్యే గడ్డం వినోద్...



బెల్లంపల్లి (డీకే చాటింపు) గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది అని ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామిఅన్నారు. బుధవారం కన్నెపల్లి మండలంలోని టేకులపల్లి గ్రామపంచాయతీలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే,అదనపు కలెక్టర్. చంద్రయ్యతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వినోద్ మాట్లాడుతూ, నూతన గ్రామపంచాయతీ భవనం గ్రామ ప్రజలకు మెరుగైన పరిపాలన అందించడంతో పాటు, గ్రామ అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను దశలవారీగా కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు.అనంతరం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో రూ.26 లక్షలతో నిర్మించిన నూతన భోజనశాలను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలోమాజీ ఎంపీపీ సృజనా నర్సింగరావు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

28న పూలే 136వ వర్ధంతిసభ

(డీకే చాటింపు,హైదరాబాద్):నగరంలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈనెల 28న సాయంత్రం 6గంటలకు మహాత్మా జోతిరావు పూలే 136వ వర్ధంతి సభ ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. ఎస్వీకే మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్. వినయకుమార్ కార్యక్రమానికి అధ్యక్షత వహిస్తారు.మహాత్మా పూలే : నేటి విద్యా వ్యవస్థ అనే అంశంపై అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టర్ సుదర్శన్ బాలబోయిన ప్రసంగిస్తారు.టీపీఎస్కే కన్వీనర్ భూపతి వెంకటరశ్వర్లు స్వాగతం పలుకుతారు. ఎస్వీకే మేనేజింగ్ కమిటీ సభ్యులు జీ. బుచ్చిరెడ్డి వందన సమర్పణ చేస్తారు. సభానంతరం సత్య భాస్కర్ రచించిన యముండ ఏకాంకిక ప్రదర్శనను ఎల్ ఎన్ థియేటర్ ట్రైనింగ్ సెంటర్ ఆధ్వర్యంలో వుంటుంది.

క్రీడలతో మానసిక ఉల్లాసం ...మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య



బెల్లంపల్లి (డీకే చాటింపు) క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. బుధవారం వేమనపల్లి మండలం చామనపల్లి గ్రామపంచాయతీ బద్దంపల్లిలో మండల స్థాయి వాలీబాల్ పోటీలనుమాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ప్రారభించా చారు.ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వేణుమాధవ రావు,బెల్లంపల్లి మాజీ ఎంపీపీ సుభాష్ రావు,ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసిన మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్

హుస్నాబాద్ : తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ కోతల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పంటలు చేతికొచ్చే సమయంలో విద్యుత్ సరఫరా సక్రమంగా లేక పంటలు ఎండిపోతున్నాయని బీఆర్ఎస్ పార్టీ తరఫున హుస్నాబాద్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు.రైతులు నెలల తరబడి పెట్టుబడులు పెట్టిసాగుచేసిన పంటలకు విద్యుత్ కోతల వల్ల నష్టం వాటిల్లితే వారి కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటాయని పేర్కొన్నారు. వ్యవసాయానికి అవసరమైన సమయంలో నాణ్యమైన, నిరంతర విద్యుత్ అందించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రభుత్వంపై ప్రధాన డిమాండ్లు: రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయానికి నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలి, విద్యుత్ కోతల వల్ల నష్టపోతున్న రైతులకు తక్షణ సహాయం అందించాలి.కాలిపోయిన మోటార్లు, దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్లను వెంటనే మరమ్మతు చేయాలి.విద్యుత్ ఉత్పత్తి, బొగ్గు నిల్వలు, సరఫరా పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేయాలి.సింగరేణిలో బొగ్గు నిల్వలకు సంబంధించి వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలి.

భారీగా పెరుగుతున్న ఇళ్ల అద్దెలు



హైదరాబాద్: హైదరాబాద్‌లో ఇటీవలి కాలంలో ఇళ్ల ధరలు అద్దెలను మించి పెరిగాయని నివేదికలు చెబుతున్నాయి. 2025 మార్చి నాటికి, నగరంలోని స్థిరాస్తి మార్కెట్ గణనీయమైన వృద్ధిని సాధిస్తోంది. హైదరాబాద్.. తెలంగాణ రాజధాని. విశ్వనగరంగా గుర్తింపు పొందింది. పదేళ్లలో గణనీయమైన అభివృద్ధి సాధించడ ంతో ఇక్కడికి కంపెనీలు క్యూ కడుతున్నాయి. దీంతో తెలంగాణ తోపాటు ఆంధ్రప్రదేశ్, ఇతర రాష్ట్రాల నుంచి కూడా ఉద్యోగులు హైదరాబాద్‌లో స్థిరపుతున్నారు. కొందరు అద్దెకు ఉంటుండగా, కొందరు ఇళుల కొనుగోలు చేస్తున్నారు. హైదరాబాద్‌లో ఇటీవలి కాలంలో ఇళ్ల ధరలు అద్దెలను మించి పెరిగాయని నివేదికలు చెబుతున్నాయి. 2025 మార్చి నాటికి, నగరంలోని స్థిరాస్తి మార్కెట్ గణనీయమైన వృద్ధిని సాధిస్తోంది, ముఖ్యంగా ఐటీ కారిడార్‌లు మరియు ఉన్నత స్థాయి రెసిడెన్షియల్ ప్రాంతాలైన గచ్చిబౌలి, మాదాపూర్, కొండాపూర్, హైటెక్ సిటీ వంటి ప్రాంతాల్లో ఈ ధోరణి స్పష్టంగా కనిపిస్తోంది. సాధారణంగా, హైదరాబాద్‌లో గత కొన్ని సంవత్సరాలుగా ఇళ్ల ధరలు స్థిరంగా పెరుగుతున్నాయి. 2024లో ఒక స్క్వేర్ ఫీట్ ధర సగటున రూ. 5 వేల నుంచి రూ. 10 వేల వరకు ఉండగా, 2025 నాటికి ఇది కొన్ని ప్రాంతాల్లో రూ. 11 వేల నుంచి రూ. 12,500 దాటింది. దీనికి ప్రధాన కారణాలు ఐటీ రంగ విస్తరణ, మెరుగైన మౌలిక సదుపాయాలు, నగరంలోకి వలస వచ్చే జనాభా పెరుగుదల.అద్దెల విషయానికొస్తే, హైదరాబాద్‌లో అద్దె ధరలు కూడా పెరిగినప్పటికీ, ఇళ్ల ధరలతో పోలిస్తే అవి నిష్పత్తిలో తక్కువ వేగంతో పెరుగుతున్నాయి. గచ్చిబౌలిలో 2 ఃఊఐ అపార్ట్‌మెంట్ అద్దె సగటున రూ. 25 వేల నుంచి రూ. 35 వేల వరకు ఉంటే, అదే ప్రాంతంలో ఇంటి కొనుగోలు ధర రూ. 80 లక్షల నుంచి రూ. 1.2 కోట్ల వరకు ఉంటోంది. దీని ఫలితంగా, రెంటల్(అద్దె ద్వారా వచ్చే ఆదాయం శాతం) సగటున 4?5% వద్ద ఉంటోంది, ఇది ఇళ్ల ధరల పెరుగుదలతో సమానంగా లేదు.ఈ పరిస్థితి కొనుగోలుదారులకు ఒక సవాలుగా మారుతోంది, ఎందుకంటే అద్దెకు ఇళ్లు తీసుకోవడం కంటే కొనడం ఖరీదైన ఎంపికగా మారింది

నష్టాలతో స్టాక్ మార్కెట్లు..!



బిజినెస్ : దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు కొత్త ఆర్థిక సంవత్సరాన్ని భారీ నష్టాలతో ప్రారంభించాయి. అంతర్జాతీయ మార్కెట్లలో బల హీన సంకేతాలు సూచీల సెంటిమెంట్‌ను ప్రభావితం చేస్తున్నా యి. ప్రతీకార టారిఫ్‌లపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏప్రిల్ 2న తుది నిర్ణయాన్ని ప్రకటించనున్న నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. ఈ కారణంగా సూచీలు ఒత్తిడికి గురవుతున్నాయి. మార్కెట్ ప్రారంభంలోనే సెన్సెక్స్ 450 పాయింట్లు నష్టపోగా, నిఫ్టీ 23,400 మార్క్ వద్ద ఊగిసలాడుతోం ది. ఉదయం 9:25 గంటల సమయంలో సెన్సెక్స్ 374 పాయిం ట్ల నష్టంతో 77,035 వద్ద ట్రేడవుతుండగా, నిఫ్టీ 85 పాయింట్ల నష్టంతో 23,433 వద్ద ఉ న్నాయి. సెన్సెక్స్ 30 సూచీలో ఇన్ఫోసిస్, టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టెక్ మహీంద్రా,హెచ్‌సీఎల్ టెక్నాల జీస్, బజాజ్ ఫైనాన్స్, సన్ ఫార్మా, మారుతీ సుజుకీ, టాటా స్టీల్, అల్ట్రాటెక్ సిమెంట్, బజాజ్ ఫిన్‌సర్వ్, హెచ్‌యూఎల్ షేర్లు నష్టాల్లో ట్రేడవుతున్నాయి. ఇండస్ ఇండ్ బ్యాంక్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఎంఅండ్‌ఎం, ఎన్టీపీసీ, అదానీ పోర్ట్స్, నెస్లే ఇండియా షేర్లు లాభాల్లో కొనసాగుతున్నాయి.

మిశ్రమంగా అమెరికా మార్కెట్లు : అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 74.93 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.బంగారం ఔన్సు 3,174 డాలర్ల మార్క్‌ను దాటింది. అమెరికా మార్కెట్లు మిశ్రమ ంగా ముగిశాయి. ఎస్ అండ్ పీ సూచీ 0.55 శాతం, డౌజోన్స్ 1 శాతం మేర లాభపడ్డాయి. నాస్‌డాక్ మాత్రం ఫ్లాట్‌గా ము గిసింది. ఆసియా-పసిఫిక్ మార్కెట్లు నేడు లాభాల్లో ట్రేడవుతు న్నాయి. ఆస్ట్రేలియా ఎఎస్ఎక్స్ సూచీ 0.63 శాతం, జపాన్ నిక్కీ 0.58 శాతం, హాంకాంగ్ హాంగ్‌సెంగ్ 1.05 శాతం, షాంఘై 0.48 శాతం లాభంతో కదలాడుతున్నాయి.

ఉక్కిరిబిక్కిరవుతున్న సచివాలయ ఉద్యోగులు!

- సంబంధం లేని శాఖల పనుల అప్పగింతతో తీవ్ర పని భారం



గుంటూరు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన అనేక అంశాలపై క్షేత్ర స్థాయిలో సమాచారం తెలుసుకునేందుకు సచివాలయ ఉద్యోగులతో ఉన్నతాధికారులు పలు రకాల సర్వేలు చేయిస్తున్నారు. ఒక సర్వే పూర్తవ్వగానే మరో సర్వే బాధ్యతలు అప్పగిస్తున్నారు. దీంతో, ఉద్యోగులు క్షేత్ర స్థాయి సర్వేలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. సచివాలయ ఉద్యోగుల సంఖ్య తక్కువగా ఉండడం, ఇతర ప్రాంతాల బాధ్యతలు కూడా వారికే అప్పగించడంతో పనిభారం మరింత పెరిగింది. దీంతో, వివిధ ధ్రువపత్రాలు, ఇతర పనుల కోసం నచివాలయాలకు వచ్చే వారికి వారు అందుబాటులో ఉ ండలేకపోతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 11 మంది, పట్టణ ప్రాంతాల్లో పది ఉద్యోగులతో గత ప్రభుత్వం సచివాలయాలను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో ఏడుగురు, పట్టణ ప్రాంతాల్లో ఆరుగురు మంది మాత్రమే ఉంటున్నారు. బ్యాంకర్లు తమ ఖాతాదారుల ఆధార్ లింక్, ఇకెవైసి బాధ్యతలను కూడా ఇటీవల సచివాలయాల ఉ ద్యోగులకు అప్పగించడం వివాదస్పదమైంది. ఈ పనిని బ్యాంకు ఉ ద్యోగులు చేయాల్సి ఉండగా వివిధ పథకాల కింద నిధులు జమ చేసే పేరుతో అధికారులు ఈ బాధ్యతలను తమకే అప్పగించారని సచివాయాల ఉద్యోగులు వాపోతున్నారు. ఐటి శాఖ చేయాల్సిన వర్క్ ఫ్రం హోం సిటిజన్స్ గుర్తింపు సర్వేనూ తమకే అప్పగించినట్టు చెబుతున్నారు. తాజాగా పి4 సర్వే మొత్తం సచివాలయాలకు అప్పగించారు. పరిశ్రమల శాఖ నిర్వహించాల్సిన ఎంఎస్ఎంఇ సంస్థల గుర్తింపును తమకే అప్పగించారని సచివాలయాల ఉద్యోగులు వాపోతున్నారు. తుపాన్లు, వరదలు, ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు ఇబ్బందులు తలెత్తకుండా హౌస్ హోల్డ్ మ్యాపింగ్, వ్యక్తుల నివాసిత గుర్తింపు వివరాల నమోదుకు ఇంటి ఫొటోలు, జియోట్యాగింగ్ బాధ్యతలు ఇటీవల సచివాలయాల ఉద్యోగులు పూర్తి చేశారు. నేషనల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా చిన్నారులను గుర్తించే, ఆధార్‌లో నమోదు చేయించే బాధ్యతలను కూడా వారికే అప్పగించారు. చర్మకారులకు పలు పథకాల అమలుకు లబ్ధిదారులను గుర్తించడం, పింఛనుదారుల్లో అనర్హుల గుర్తింపునకు వారికి నోటీసులు జారీ చేయడం, వికలాంగులను తిరిగి వైద్య పరీక్షలకు పంపడం తదితర పనులను సచివాలయ ఉద్యోగులతోనే చేయిస్తున్నారు. సహకార సంఘాల్లో రికార్డుల కంప్యూటీకరణలో భాగంగా రైతులకు ఇకెవైసి చేయాల్సిన సంబంధిత శాఖ ఉద్యోగులకు కాకుండా ఈ పని కూడా సచివాలయాల ఉద్యోగులకే అప్పగించారు. సిటిజన్ గుర్తింపు గుర్తింపు సర్వే మున్సిపల్, గ్రామ పంచాయతీలు చేయాల్సి ఉండగా ఈ పని కూడా సచివాలయ ఉద్యోగులతో చేయిస్తున్నారు. రైతులకు సంబంధించిన భూ ఆధార్ నమోదును సచివాలయాల్లోని వ్యవసాయ సహాయకుడికి అప్పగించారు. బియ్యం కార్డుల్లోని సభ్యులు ఇకెవైసి బాధ్యతను విఆర్ఒ చేయాల్సి ఉండగా, ఈ పని కూడా తమకే అప్పగించారని సచివాలయ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో వలంటీర్లు చేసిన ప్రతి పనినీ సచివాల యాల ఉద్యోగులకు అప్పగించారు. వివిధ శాఖల ఉద్యోగులు చేయాల్సిన అన్ని పనులనూ తమకే అప్పగిస్తున్నారని, దీనివల్ల సచివా లయాలకు వచ్చే ప్రజలకు ఉద్యోగులు అందుబాటులో ఉండలేక పోతు న్నారని,.తద్వారా పౌర సేవల్లో కొంత జాప్యం జరుగుతున్న మాట వాస్తవమేనని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లా మని సచివాలయాల ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.అంకమ్మరావు తెలిపారు. మున్సిపాలిటీల్లో, మండల పరిషత్తుల్లో అనేకమంది ఉద్యోగులు ఉన్నా ప్రతి పనికీ సచివాలయాల ఉ ద్యోగులకు అప్పగించేస్తున్నారని ఆయన చెప్పారు.

వైసీపీ యూ టర్న్..!

గుంటూరు, : ఆంధ్రప్రదేశ్ లో వచ్చే ఏడాది స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. అయితే వైసీపీ ఈ ఎన్నికల్లో పోటీ చేయాలని జగన్ దాదాపుగా నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయకపోతే తప్పుడు సంకేతాలు వెళతాయని, నేతలు కూడా గ్రామ, పట్టణ స్థాయిలో డీలా పడే అవకాశముందని జగన్ భావిస్తున్నా రు. గెలుపోటములతో సంబంధం లేకుండా పోటీకి దిగితే ఖచ్చితంగా పార్టీ ఎదుగుదలకు అది కారణమవుతుందని వైఎస్ జగన్ భావిస్తున్నారు. అందుకే ఇటీవల జరిగిన నేతల సమావేశంలో బూత్ లెవెల్ కమిటీలు వేయాలని జగన్ ఆదేశించారు. బూత్ లెవెల్ కమిటీల నుంచి పార్టీని బలోపేతం చేసుకుని స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలన్న యోచనలోనే జగన్ ఉన్నారని తెలిసింది. పులివెందుల ఎంపీటీసీ ఉప ఎన్నిక చూసిన తర్వాత కొందరు నేతలు స్థానిక సంస్థల ఎన్నికలకు దూరంగా ఉండాలని జగన్ ఎదుట ప్రతిపాదన పెట్టారు. అయితే జగన్ మాత్రం ఇందుకు అంగీకరించలేదు. ఓటమికి భయపడి ఎన్నికల్లో పోటీ చేయకపోవడం కార్యకర్తల్లోనూ, గ్రామీణ నాయకత్వంలోనూ అసహనం ఏర్పడుతుందని జగన్ అంచనా వేశారు. స్థానిక సంస్థల్లో పోటీ చేయడం వల్ల రెండు ఉ పయోగాలుంటాయని జగన్ అంచనా వేస్తున్నారు. ఎన్నికల్లో పోటీ చేయడం వల్ల క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం అవుతుంది. రెండు గ్రామ స్థాయిలో అధికార, విపక్ష వర్గాలుగా విడిపోయి వచ్చే ఎన్నికలకు తమకు అడ్వాంటేజీగా మారుతుందని జగన్ అంచనా వేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో తలపడాల్సిందేనని జగన్ నేతలకు ఇప్పటికే సూత్రప్రాయంగా చెప్పారని తెలిసింది. నియోజకవర్గ ఇన్ ఛార్జులు కూడా తమ ప్రాంత పరిధిలోని పార్టీకి నమ్మకమైన నేతలకు, కార్యకర్తలకు పోటీ చేసే అవకాశం కల్పించాలని కూడా జగన్ ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. వచ్చే ఏడాది మొదట్లోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి.

నిరుద్యోగమే నిరసనలకు కారణమా?

భారత్ పొరుగు దేశమైన నేపాల్ మాదిరిగానే లడఖ్ యువత ఇటీవల పెద్ద ఎత్తున నిరసన బాటపట్టారు. ఈ నిరసనల్లో పోలీసుల కాల్పుల్లో నలుగురు ప్రాణాల్ని సైతం కోల్పోయారు. కేవలం కొన్ని లక్షల మంది ఉన్న లడఖ్‌లో నిరసనలు జరగడానికి కారణం కేంద్ర ప్రభుత్వ వైఫల్యమా కాదని బిజెపి వారిస్తోంది. మరేంటి కారణం.. అంటే నిరుద్యోగమే ప్రధాన కారణమని తెలుస్తోంది. లడఖ్ విపరాల్లోకి వెళితే..



హెచ్చుస్థాయిలోనే అక్షరాస్యత..: లడఖ్‌లో ఉన్నది మూడు లక్షల జనాభానే. అక్కడ హిందువులు, ముస్లింలు, బౌద్ధ మతస్తులు ఉ న్నారు. 90 శాతం గిరిజనులే. లడఖ్‌లో జాతీయ విద్యా పథకాలు మాత్రం పేలవంగానే అమలవుతున్నా.. అక్షరాస్యత శాతం ఎక్కువగానే ఉంది. పురుషులు 89 శాతం, మహిళలు 65 శాతం మంది అక్షరాస్యులున్నారు. ఇక్కడ ఉపాధ్యాయుల తరచూ బదిలీలతో పట్టణం వెలుపల ప్రాథమిక సెకండరీ స్థాయి విద్యా బోధనలు అంతంత మాత్రమనే చెప్పుకోవచ్చు. అయినప్పటికీ అక్కడ చిన్నారులు, తల్లిదండ్రులు చదువుకు ప్రాధాన్యమిస్తుండడం గమనార్హం.

వ్యవసాయం..: దాదాపుగా ఇక్కడ వర్షపాతం ఉండదు. పంటలు హిమనదీయ కరిగే నీటి కాలువలు, బుగ్గలు మీదే పంటలు పండుతాయి. సింధు నదీ లోయలలో దాని ఉపనదులపైనే గ్రామస్తులు ఆధారపడతారు. వారు ఎక్కువగా బార్లీ,

గోధుమలు, బఠానీలను పడిస్తారు. పండ్లలో నేరేడు, ఆపిల్స్‌ని పండిస్తారు. మరోవైపు పశువుల పెంపకందారులు పాడి, ఉన్నిలను ఉత్పత్తి చేస్తారు. మేక ఫైబర్‌లను వీరు కాశ్మీర్‌కు వర్తకం చేస్తారు. అయితే లడఖ్‌వాసులు ఆధునిక యంత్రాలతో వ్యవసాయం చేయడానికి మాత్రం విముఖత చూపుతున్నారు.

టూరిజం..: హిమాలయ పర్వతాలు, పాంగోంగ్ సరస్సు హొయలు, లోయలు.. అక్కడ సంస్కృతి, సంప్రదాయాలు పర్యాటకుల్ని కనువిందు చేస్తాయి. లడఖ్ ప్రధాన ఆర్థిక వనరు పర్యాటకమే. 1974 నుంచే ఇక్కడ పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడం జరుగుతోంది. గత కొన్నేళ్లుగా కేంద్ర ప్రభుత్వాలు ఈ రంగంలోనే వేలాదిమందికి ఉ ద్యోగ అవకాశాల్ని కల్పించాయి. ఇక్కడికి యూరోపియన్, అమెరికన్లు, భారతీయులు ఎక్కువమంది వస్తారు. ఇక్కడి పర్యావరణం పర్యాటకుల్ని ఆకర్షిస్తున్నా.. మౌలిక సదుపాయాలు సరిగ్గా లేవు. విపరీతంగా నీటికొరత ఉంది. హిమాలయ పర్వతాల నుంచి కరిగే నీటిపైనే ఆధారపడడం.. పైపెచ్చు.. ఎక్కడికక్కడ ఆనకట్టల ద్వారా దిగువకు నీరు లేకపోవడంతో.. అక్కడ ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. పైగా ఉష్ణోగ్రతల్లో మార్పులు కారణంగా వేసవిలో మంచు పర్వతాలు విపరీత స్థాయిలో కరుగుతున్నాయి. దీంతో శీతాకాలంలో నీటి సమస్య లేకపోయినా.. వేసవిలో మాత్రం నీటి కోసం అల్లాడుతున్నారు. సమ్మర్‌లోనే పర్యాటకుల రద్దీ ఎక్కువ. ఆ సమయంలోనే నీటి కొరత వల్ల పర్యాటకుల సంఖ్య కూడా తగ్గుముఖం పడుతుంది. ఇది వారి జీవనాధారంపైనే ప్రభావం చూపుతుంది. నిరుద్యోగం..: 2021-22లో 534 నాన్‌గెజిటెడ్ ఉద్యోగాలకు 50 వేల దరఖాస్తుల్ని పంపారు. అంటే ఒక ఉద్యోగానికి ఆరుగురు పోటీ పడుతున్నారన్నమాట. ఈ విషయాన్ని స్వయంగా సబార్డినేట్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు వెల్లడించింది. 2021-22లో లడఖ్ నిరుద్యోగం 9.8 శాతం. అదే 2022-23కి 26.5 శాతానికి చేరిందని పార్లమెంటు సమావేశాల సందర్భంగా 2023లో రాజ్యసభలో ఎంపీలే వెల్లడించారు. ఇది జాతీయ సగటు నిరుద్యోగ రేటు 2021-22 14.9 శాతం, 2022-23 లో 13.4 శాతానికంటే ఎక్కువ.

సమస్యను పక్కదోవ పట్టించిన మీడియా: జాతీయ మీడియా మాత్రం అసలు సమస్యను పక్కకు నెట్టేసింది. ఇటీవల కాలంలో మీడియా ఏకాడికి లడఖ్ నిరసనల్లో కాంగ్రెస్ కౌన్సిలర్ పుంట్సోగ్ స్టాంజిత్ తెపాగ్ పాల్గొనడాన్నే హైలెట్ చేసింది. పూర్తిగా బిజెపికి వత్తాసునిచ్చింది. నిరసనలకు ముందు ఉద్యమకారుడు వాంగ్‌చుక్ నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంక నిరసనల గురించి ప్రసంగించారని.. ఆయన ఆయా దేశాల యువత చేపట్టిన నిరసనల్ని హైలెట్ చేయడం వల్లే బిజెపి కార్యాలయానికి ఆందోళనకారులు నిప్పుపెట్టారని బిజెపి నేతలు ఆయనపై విరుచుకుపడ్డారు. ఇంత పెద్దఎత్తున నిరసనలు జరగడానికి కారణం.. కాంగ్రెస్ పార్టీ, కౌన్సిలర్ పుంట్సోగ్ నిరసనకారుల్ని రెచ్చగొట్టడం వల్లే జరగాయని బిజెపి ఆరోపిస్తోంది.

అక్కడి ప్రజలు డిమాండ్ చేస్తున్నట్లు ప్రత్యేక రాష్ట్ర హోదా కానీ.. ఆ డిమాండ్ తలెత్తడానికి గల కారణాల్ని కానీ మీడియా పట్టించుకోవడం లేదు. ఇదెంత దారుణం లడఖ్ జమ్మూకాశ్మీర్ కిందకే వస్తుంది. అధికారిక లెక్కల ప్రకారం 1995 నుంచి సొంతంగా కౌన్సిల్ పాలన సాగుతుంది. 2019 ఆగస్టు 5న జమ్మూకాశ్మీర్‌కి ప్రత్యేక హోదా రద్దు చేయడంతో.. లడఖ్ వాసులు ప్రత్యేక రాష్ట్ర హోదా కోసం డిమాండ్ చేయడం ప్రారంభించారు. గిరిజనుల కోసం ప్రత్యేక అధికారాలు కలిగిన 6వ షెడ్యూల్ కిందకి లడఖ్‌ని తీసుకురావాలని వారు నినదిస్తున్నారు. 6వ షెడ్యూల్ ద్వారా.. జిల్లా కౌన్సిల్‌లు, శాసన, న్యాయ పరిపాలన స్వయం ప్రతిపత్తిని కలిగి ఉంటాయి. అక్కడి భూమి.. పరిపాలనా, చట్టాలు అన్నీ వారి అధీనంలోకి వస్తాయనే కారణంతోనే లడఖ్ ప్రజలు రాష్ట్ర హోదా కోసం నిరసనలు చేస్తున్నారు. ఇక్కడి చైనా సరిహద్దు ప్రాంతంగా ఉందని.. కేంద్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తుంది.

అమరావతికి హైస్పీడ్ కారిడార్..



విజయవాడ, : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రోడ్లు, మౌలిక వసతుల కల్పన, హైస్పీడ్ కారిడార్లపై ఫోకస్ చేసింది. ఎప్పటికప్పుడూ కేంద్ర ప్రభుత్వంతో వందే భారత్ రైళ్లు పెంచడం, బుల్లెట్ రైలు అవకాశాలపై చర్చలు జరుపుతూనే.. రాష్ట్రంలో వీలున్నచోట హైస్పీడ్ కారిడార్ల ఏర్పాటు కోసం కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలో ఏపీకి మరో హైస్పీడ్ కారిడార్ రానుంది. కోల్‌కతా-చెన్నై జాతీయ రహదారి-16 ఏపీ మీదుగా వెళ్తుండగా.. దీనికి సమాం తరంగా ఒక కొత్త హైవే నిర్మించాలని కేంద్ర రవాణా, జాతీయ రహ దారుల మంత్రిత్వశాఖ (మోర్త్) నిర్ణయం తీసుకుంది. పశ్చిమ బెంగాల్‌లోని ఖరగ్‌పూర్ నుంచి ఏపీ మీదుగా తమిళనాడు రాజధాని చెన్నైకి గ్రీన్‌ఫీల్డ్ హైస్పీడ్ కారిడార్ నిర్మించేందుకు కేంద్రం సన్నాహాలు చేస్తోంది. ఈ ప్రాజెక్టు ఎలైన్‌మెంట్‌పై మోర్త్ ఇప్పటికే కసరత్తు మొదలుపెట్టింది. ఇందుకోసం సలహా సంస్థను ఎంపికచేసి, హైవే ఎలా నిర్మించాలనే దానిపై అధ్యయనం చేయించనుంది. ఇప్పటికే కోల్‌కతా-చెన్నై హైవేలో భాగంగా కత్తిపూడి-కాకినాడ నుంచి ఒంగోలు వరకు జాతీయ రహదారి 216 ఉంది. కేంద్రం తాజాగా కోల్‌కత్తా నుంచి చెన్నై మధ్య హైస్పీడ్ కారిడార్ ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. ఈ కొత్త హైవే విశాఖపట్నం సిటీకి సమీపం నుంచి వెళ్లుంది. విజయవాడ సమీపంలో అమరావతి ఔటర్ రింగ్ రోడ్‌తో హైస్పీడ్ కారిడార్ కలపనున్నారు. తద్వారా గుంటూరు అవతల అదే ఔటర్ రింగ్ రోడ్ నుంచి మిగిలిన భాగం కొనసాగుతుంది. ఆ మార్గాన్ని చెన్నై వరకు నిర్మించకపోయినా, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు మధ్య కోల్‌కతా-చెన్నై హైవేలో కలపాలని మోర్త్ ప్లాన్ చేసింది. దీన్ని పూర్తి స్థాయిలో చెన్నై వరకు కొనసాగిస్తేనే గ్రీన్‌ఫీల్డ్‌తో పాటు, యాక్సెస్ కంట్రోల్ హైవే నిర్మాణం జరుగుతుందని భావిస్తున్నారు. ప్రస్తుత కోల్‌కతా-చెన్నై హైవే మీద వాహనాల రద్దీ అధికంగా ఉంది. రోజురోజుకూ విపరీతంగా రద్దీ పెరుగుతుండటంతో ఈ హైవే అవసరం ఉంది. కానీ పూర్తి మార్గంలో ఆరు వరుసలు నిర్మించ లేదు. కొన్ని ప్రాంతాల్లో 4 లేన్లు మాత్రమే ఉన్నాయి. దాంతో వాహనాలు వేగంగా వెళ్లే అవకాశం లేదు. ఈ కారణంతో కోల్‌కతా-చెన్నై హైవేకి సమాంతరంగా మరొక హైస్పీడ్ కారిడార్ నిర్మాణం పూర్తయితే వాహనదారులకు భారీ ఊరట కలుగుతుంది. ఈ హైవే కొత్త ప్రాంతాల మీదుగా వెళ్లడంతో అవి అభివృద్ధి చెందేందుకు అవకాశాలుంటాయి. అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు 7 హైవేల మీదుగా వెళ్తుంది కనుక అభివృద్ధి జరిగేందుకు వీలుంటుంది. హైస్పీడ్ కారిడార్ అందుబాటులోకి వస్తే ఉత్తర, తూర్పు భారత్.. దక్షిణాది రాష్ట్రాలను అనుసంధానం చేస్తుందని మోర్త్ భావిస్తోంది. విజయవాడ, అమరావతి చుట్టు పక్కల ప్రాంతాలతో పాటు హైస్పీడ్ కారిడార్ వెళ్లే సమీపం ప్రాంతాల్లోనూ అభివృద్ధి జరుగుతుంది. కొత్త కంపెనీలు, పరిశ్రమలు వస్తాయి. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం అమరావతికి మరింత ప్రయోజనం చేకూర్చు తుంది. నెల రోజుల్లో ఈ హైస్పీడ్ కారిడార్‌పై స్పష్టత రానుంది. మోర్త్ ఉ న్నతాధికారులు ప్రాజెక్టు ఎలైన్‌మెంట్ల తయారీని పరిశీలిస్తు న్నారు. ఎలైన్‌మెంట్ మీద కసరత్తు పూర్తయితే ఖరగ్‌పూర్- చెన్నై హైస్పీడ్ కారిడార్ వెళ్లే రాష్ట్రాల ప్రభుత్వాలతో సమావేశమై, వారి పర్మిషన్, అభ్యంతరాలు స్వీకరించి తుది ఎలైన్‌మెంట్‌ను ఖరారు చేయనున్నారు. ప్రాజెక్టు వ్యయం, భూసేకరణ కీలకం కానున్నాయి.

100 రూపాయలతో రిజిస్ట్రేషన్

కాకినాడ : ఏపీలో కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వారసత్వ భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత సులభతరం చేసింది. అక్టోబర్ నుంచి గ్రామ సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్ చేసుకునేలా నిర్ణయం తీసుకుంది. పది లక్షల రూపాయల విలువ కలిగిన భూములకు 100 రూపాయలతో రిజిస్ట్రేషన్ చేసుకునే వేసులుబాటు కల్పించింది. అంతకుమించి అయితే వేయి రూపా యల రుసుము తీసుకోనుంది. గ్రామ సచివాలయాల్లోనే ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగనుంది. దీని ద్వారా ప్రజలకు మరింత సులువైన సేవలు అందించినట్టు అవుతుంది. దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న వారికి ఇది నిజంగా ఆనందించదగ్గ విషయమే.ప్రస్తుతం రాష్ట్రంలో భూమి కలిగిన పట్టాదారుల్లో లక్షలాదిమంది జీవించలేరు. కానీ వారి పేర్లతో ఇప్పటికీ పట్టాలు కొనసాగుతున్నాయి. ఇది భూ హక్కుదారులకు ఇబ్బందికరమే. వెబ్ లాండ్ రికార్డుల ప్రకారం రాష్ట్రంలో 85, 41,002 మంది పట్టాదారులు ఉన్నారు. వారిలో 3,91,405 మంది ఇప్పటికే మరణించారు. అంటే మొత్తం పట్టాదారుల్లో 4.58 శాతం మంది జీవించలేరు అన్నమాట. ఈ భూములు వారసుల స్వాధీనంలోనే ఉన్నా వారి పేర్లతో బదిలీ కాకపోవడంతో ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయి. దీనిపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావడంతో రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. భూ బదలాయింపులకు గాను తక్కువ రుసుముతో గ్రామ సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్ జరిగేలా చర్యలు చేపట్టింది. అక్టోబర్ నుంచి ఈ కొత్త విధానం అమలు కానుంది.వారసత్వ భూములను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలంటే ఒక శాతం స్టాంప్ రుసుము చెల్లించాలి. దశాబ్దాలుగా తమ వద్ద ఉన్న భూములను మళ్లీ రుసుము కట్టాలన్న ఆవశ్యకత ఏంటని రైతులు ప్రశ్నిస్తున్నారు. అయితే అంత మొత్తంలో భరించలేని వారు ఉన్నారు.

విషవాయువు లీకై ఐదుగురు కార్మికుల మృతి..



భరూచ్: గుజరాత్‌లోని భరూచ్ జిల్లాలో రసాయన తయారీ పరిశ్రమలో భారీ పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో ఐదుగురు కార్మికులు మృతి చెందగా, మరో ఐదుగురు గాయపడ్డారు. పేలుడు కారణంగా విషవాయువు లీకైనట్లు అధికారులు శనివారం వెల్లడించారు. వాగ్రా తాలూకాలోని సాయిఖా జీఐడీసీ పారిశ్రామిక ప్రాంతంలో ఉన్న సింజీల్ ఫార్మాకెమ్ పరిశ్రమలో శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు మేజిస్ట్రేట్ మనీషా మనానీ తెలిపారు. పేలుడు తీవ్రతకు రియాక్టర్ ట్యాంక్ పూర్తిగా ధ్వంసమైందని, యంత్రాల భాగాలు పరిశ్రమ ప్రాంగణమంతా చెల్లాచెదురుగా పడిపోయాయని తెలిపారు. సాయిఖాలో ఈ పరిశ్రమను ఏడాది క్రితమే ఏర్పాటు చేశారని, ఇక్కడ ఔషధాల తయారీకి అవసరమైన మధ్యంతర రసాయనాలను ఉత్పత్తి చేస్తున్నారని వివరించారు. ప్రమాదంలో మృతి చెందిన వారిని జయదీప్ మహేశ్‌భాయ్ పటేల్, భావిక్ దిలీప్‌కుమార్ వాసవా, వృంద్ తలావియా, అనికేత్ హరిలాల్ గౌతమ్, అర్జున్‌కుమార్ రామ్‌సింగ్ గౌతమ్‌గా గుర్తించారు. వీరిలో తొలి ఇద్దరు అమోడ్‌కు చెందినవారు కాగా, వృంద్ తలావియా గిర్ సోమనాథ్ జిల్లాలోని తలాలాకు చెందినవారు. మిగిలిన ఇద్దరు ఉత్తరప్రదేశ్‌కు చెందినవారు. గాయపడిన వారిని పవన్‌కుమార్ రామ్‌సింగ్ గౌతమ్, మౌసమ్‌కుమార్ రామ్‌సేవక్ యాదవ్, శివదయాల్ రామ్‌అవతార్ యాదవ్, ప్రతీక్ ప్రవీణ్ ప్రజాపతి, ప్రియాన్షు బహదూర్‌లాల్‌గా గుర్తించారు. వీరు బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందినవారని, ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని భరూచ్ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ అక్షయ్‌రాజ్ మక్వానా తెలిపారు.

రష్యా చమురు దిగుమతులపై భారత్‌కు అమెరికా ఊరట!



వాషింగ్టన్ : అమెరికా టారిఫ్‌ల నుంచి భారత్‌కు బిగ్ రిలీఫ్ వచ్చింది. రష్యా నుంచి చమురు, గ్యాస్ కొనుగోలు చేసే భారత్‌తో సహా మరో ఐదు దేశాలపై ఎలాంటి సుంకాలు ఉండవని ట్రంప్ ప్రకటించారు. రష్యా చమురు కొనుగోలు చేసే దేశాలపై 100 శాతం వరకు సుంకాలు విధించే లిండ్సే ఓ. గ్రాహం చట్టం నుంచి మినహాయింపు ఇస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం రాత్రి వైట్‌హౌస్ విడుదల చేసిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌లో ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. రష్యా నుంచి అత్యధికంగా చమురు, సహజ వాయువును దిగుమతి చేసుకునే తొలి ఐదు దేశాలపై సుంకాలు విధించే నిబంధనను ప్రస్తావించినప్పటికీ, అదే ఉత్తర్వులోని సెక్షన్ 4 కింద వాటిని తక్షణమే నిలిపివేస్తున్నట్లు ట్రంప్ వెల్లడించారు. అమెరికా జాతీయ ప్రయోజనాల దృష్ట్యా ఈ మినహాయింపు ఇస్తున్నట్లు కాంగ్రెస్‌కు లిఖితపూర్వకంగా ధ్రువీకరించినట్లు తెలిపారు. భారత్ రష్యా నుంచి భారీగా ముడి చమురును కొనుగోలు చేస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం ప్రాధాన్యం సంతరించుకుంది. అమెరికా దేశాంగమంత్రి మార్కో రూబియో అక్టోబర్ 17 నుంచి 22 వరకు భారత్‌లో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌తో ముంబైలో సమావేశమై, జామ్‌నగర్ రిఫైనరీ సముదాయాన్ని సందర్శించనున్నారు. ఈ నేపథ్యంలో తాజా నిర్ణయం ఇరు దేశాల సంబంధాలకు సానుకూల సంకేతంగా భావిస్తున్నారు. అయితే, రష్యా చమురు కొనుగోళ్లపై అమెరికా అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించనున్నారు. రష్యాపై ఇప్పటికే అమల్లో ఉన్న ఇతర ఆంక్షలు యథాతథంగా కొనసాగుతాయని అమెరికా స్పష్టం చేసింది.

మతం మారితే..
వివక్ష తొలగిపోదు:సుప్రీం
రూలింగ్‌పై సీపీఐ(ఎం) ఆందోళన



న్యూఢిల్లీ : ఇస్లాం మతంలోకి మారిన వెనుకబడిన సామాజిక తరగతుల వారికి రిజర్వేషన్ ప్రయోజనాలను అమల్జేయడానికి నిరాకరిస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు పట్ల భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు పార్టీ పొలిట్‌బ్యూరో శుక్రవారం నాడు ఒక ప్రకటన విడుదల చేసింది. హిందూ మతం నుంచి మరో మతానికి మారిన వ్యక్తి, మత మార్పిడికి ముందు తన కులం ఆధారంగా లభించే వెనుకబడిన తరగతుల రిజర్వేషన్ ప్రయోజనాలను ఆటోమేటిక్‌గా పొందలేరంటూ సుప్రీం కోర్టు రూలింగ్ ఇచ్చింది.ఇతర మతాలకు మారిన వారికి షెడ్యూల్డ్ కులాల రిజర్వేషన్ ప్రయోజనాలను తిరస్కరిస్తూ గతంలో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుతో కలిపి చూసినపుడు ఈ తీర్పు, రాజ్యాంగంలో పొందుపరిచిన సమానత్వం, సామాజిక న్యాయం వంటి సూత్రాలకు తీవ్ర విఘాతం కలిగిస్తోందని పొలిట్‌బ్యూరో పేర్కొంది. సామాజిక న్యాయాన్ని మత గుర్తింపు ద్వారా నిర్ధారించలేం. చారిత్రక అణచివేత కుల వివక్షత, విద్య అందుబాటులో అసమానతలు, ఉపాధి, ఆర్థికపరమైన అవకాశాలు వంటి వాస్తవికతల ఆధారంగా జరగాలి. మత మార్పిడి జరిగినంత మాత్రాన కులపరమైన వివక్ష లేదా సామాజిక, ఆర్థిక అసమానతలు తొలగిపోవు. మతపరమైన హద్దులకు అతీతంగా కుల అణచివేత కొనసాగుతునే వుంటుంది. మత మార్పిడిని ప్రాతిపదికగా తీసుకుని రిజర్వేషన్ ప్రయోజనాలను నిరాకరించడం వల్ల రాజ్యాంగ సూత్రాలైన సమానత్వం, సామాజిక న్యాయం దెబ్బతింటాయి. ఈ తీర్పుల ప్రతికూల పర్యవసానాలను అధిగమించడానికి గానూ సరైన రాజ్యాంగ సవరణల ద్వారా కేంద్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలి, ఏ మతానికి చెందినవారనేదానితో సంబంధం లేకుండా దళితులకు, వెనుకబడిన తరగతుల నుంచి మారిన వారికి రిజర్వేషన్ ప్రయోజనాలు అందచేయాలని కోరింది.

గాజాలో మళ్లీ సరుకుల కొరత
ముప్పుగాజా ట్రక్కుల యూనియన్!

జెరూసలేం: యుద్ధంతో అతలాకుతలమైన గాజాలో ప్రజలకు మరో కష్టకాలం ఎదురుకానుంది. రెండు రోజులుగా వాణిజ్య సరుకుల రవాణా నిలిచిపోవడంతో ఆహారం, పండ్లు, మాంసం, చలికాలపు దుస్తుల కొరత పెరిగే ప్రమాదం ఏర్పడింది.
సరుకుల రవాణా నిలిచిపోవడానికి హమాస్ విధిస్తున్న పన్నులే కారణమని ఇజ్రాయిల్ ఆరోపిస్తుండగా, ఆంక్షలు విధించింది ఇజ్రాలేనని గాజా ట్రక్కుల యూనియన్ చెప్తోంది. గాజాలోకి వచ్చే సరుకులను ఇజ్రాయిల్ సైన్యం తనిఖీ చేసి అనుమతిస్తుంది. మానవతా సహాయక సంస్థలు పిండి వంటి నిత్యావసరాలను అందిస్తుండగా, పండ్లు, మాంసం వంటి ఆహార పదార్థాలను వ్యాపారులు దిగుమతి చేస్తున్నారు. ఈ సరఫరా నిలిచిపోతే మార్కెట్లలో వస్తువుల ధరలు పెరిగి, పేద కుటుంబాలపై భారం పడుతుందని సహాయక సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. మానవతా సాయం ఒక్కటే ప్రజల అవసరాలను తీర్చలేదని నార్వేజియన్ రెఫ్యూజీ కౌన్సిల్ ప్రతినిధి షైనా లో తెలిపారు. హమాస్ పన్నులు, బెదిరింపుల కారణంగా వ్యాపారులే సరుకుల రవాణాను నిలిపివేశారని ఇజ్రాయిల్ సైన్యానికి చెందిన కోగాట్ సంస్థ చెప్తోంది. అయితే, ఇజ్రాయిల్ విధించిన ఆంక్షలే అసలు కారణమని గాజా ప్రయివేటు ట్రక్కుల యూనియన్ అధిపతి నాహెద్ షెహైబర్ ఆరోపించారు. గాజాలోకి వచ్చే ఒక్కో ట్రక్కుకు 10,000 ఇజ్రాయిలీ షెకెల్స్ (సుమారు 3,226 డాలర్లు) చెల్లించాలని అక్కడి ఆర్థిక శాఖ కోరినట్టు షెహైబర్ తెలిపారు. అది పన్ను కాదని, ప్రభుత్వ ఉద్యోగుల జీతాల కోసం కోరుతున్న విరాళమని ఆ శాఖ ఉప కార్యదర్శి ఖలీద్ అల్-రఖబ్ చెప్పినట్టు వెల్లడించారు. సుమారు 20 లక్షల మంది నివసించే గాజాకు రోజుకు 250 ట్రక్కుల సరుకులు అవసరమని కోగాట్ అంచనా వేసింది. అయితే, కాల్పుల విరమణ ఒప్పందంలో రోజుకు కనీసం 600 ట్రక్కులను అనుమతించాలని నిర్దేశించారు. గతేడాది ఆగస్టులో కరువు పరిస్థితులు ప్రకటించిన గాజాలో ఆహార సంక్షోభం ఇంకా కొనసాగుతోంది. 2023 అక్టోబర్ నుంచి ఇజ్రాయిల్ దాడుల్లో 74,000 మందికి పైగా పాలస్తీనియన్లు మరణించినట్టు గాజా ఆరోగ్య శాఖ తెలిపింది. సరుకుల రవాణా పునరుద్ధరించకపోతే ప్రజల కష్టాలు మరింత పెరిగే ప్రమాదం ఉంది.

దేశమంతా జంతర్ మంతర్‌గా మారుతోంది
తిరువనంతపురం కార్యాలీలో ప్రకాష్ రాజ్



తిరువనంతపురం : రానున్న రోజుల్లో దేశమంతా జంతర్ మంతర్‌గా మారబోతోందని విలక్షణ నటుడు, సామాజిక కార్యకర్త ప్రకాశ్ రాజ్ అన్నారు. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సిఇసి) జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని, ఎన్నికల వ్యవస్థను ప్రక్షా?ళన చేయాలని డిమాండ్ చేస్తూ తిరువనంతపురంలోని మానవీయ వీధిలో 'స్టూడెంట్స్ కలెక్టివ్' ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. తొలుత ఈ కార్యక్రమానికి అనుమతి లేదంటూ పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేయగా..విద్యార్థులు తీవ్రస్థాయిలో ప్రతిఘటించడంతో అక్కడి నుంచి ఖాకీలు వెళ్లిపోయారు. అనంతరం జరిగిన సభలో ప్రకాష్ రాజ్ ప్రసంగించారు. సిఇసి జ్ఞానేష్ కుమార్ ఎంపిక ప్రక్రియ, ఆ నిర్ణయం వెనుక ఉన్న దుర్మార్గపు విధానాన్ని సమాజం అర్థం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోయిందని తెలిపారు. దేశంలో పెరుగుతున్న అసంతృప్తిపై ప్రకాశ్ రాజ్ స్పందిస్తూ.. ఇవాళ దేశంలో విద్యార్థులు ఉద్యమించడం మొదలుపెట్టారని తెలిపారు.
వారి నిరసనలకు రైతులు, పౌర సమాజం గొంతు కలిపిందని పేర్కొన్నారు. ఈ పరిస్థితి చూస్తుంటే.. దేశంలోని ప్రతీ ప్రాంతం, ప్రతీ నగరం ఓ 'జంతర్ మంతర్'లా మారిపోతోందని తెలిపారు. ప్రతి ఇంటా ముప్పన్నెల్ల జెండా ఎగురవేయాలని 'హర్ ఘర్‌గా తిరంగా' అంటూ గతంలో పిలుపునిచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇప్పుడు ఢిల్లీ వీధుల్లో యువత చేతుల్లో జాతీయ పతాకం చూసి
భయపడుతున్నారని ప్రకాష్‌రాజ్ అన్నారు. 'ఈ దేశ విద్యార్థులను, యువతను చూసి..మోడీ భయపడుతున్నారు. ఆయన అహంకారాన్ని దేశ యువత దించుతోంది. ప్రజాస్వామ్య సమస్యలకు భయపడి పోలీసులు, పారామిలటరీ బలగాలను మోహరించడం ద్వారా కేంద్ర ప్రభుత్వం భయభ్రాంతులకు గురిచేసేందుకు ప్రయత్నిస్తోంది.
అక్రమ నిర్బంధాలతో బెదిరింపులకు దిగుతోంది. కానీ ఈ దేశ యువత ఇసుమంతైనా జంకకుండా పోరాడుతోంది' అని ఆయన అన్నారు. చిన్నతనంలో మొసళ్లను పట్టుకునేవాడినంటూ మోడీ గొప్పలు చెప్పుకున్నారని, ఇప్పుడు 'బొద్దింకల'ను భయపడుతున్నారని ఎద్దేవా చేశారు. సిజెపి, విద్యార్థి యువజన సంఘాల నేతలు దీప్సే, సౌరవ్, అశుతోష్, నేహా బోరాలను పోలీసులు అదుపులోకి తీసుకోవడాన్ని ప్రకాష్ రాజ్ తీవ్రంగా ఖండించారు.

ఐడిబిఐ బ్యాంక్‌లో పెట్టుబడుల ఉపసంహరణను ఖండించిన సిఐటియు....



న్యూఢిల్లీ : ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్‌లో పెట్టుబడులను ఉపసంహరించుకోవాలనే కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని సిఐటియు తీవ్రంగా ఖండించింది. ఐడిబిఐలోని 60.72 శాతం వాటాను కెనడాకు చెందిన ఫెయిర్‌ఫాక్స్ ఫైనాన్షియల్ హోల్డింగ్స్‌కు విక్రయించాలని కేంద్ర ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ (సిసిఇఎ) తీసుకున్న నిర్ణయం దేశ వ్యతిరేకమని విమర్శించింది. ఒక దేశీయ బ్యాంకుకు చెందిన వాటాలను ఇంత భారీ స్థాయిలో విదేశీ కంపెనీకి విక్రయించడం ఇదే మొదటిసారని, రూ. 4.67 లక్షల కోట్ల నికర ఆస్తులు కలిగిన బ్యాంకును కేవలం రూ.52,878 కోట్ల నామమాత్రపు ధరకు విక్రయిస్తున్నారని పేర్కొంది. 2018లో రూ.36,915 కోట్ల హెచ్‌పిసిఎల్ వాటాల విక్రయం, 2022లో ఎయిర్ ఇండియాను టాటా గ్రూప్‌కు రూ.18,000 కోట్లకు విక్రయించడాన్ని ఈ రూ. 52,878 కోట్ల విలువైన ఈ ఒప్పందం అధిగమించిందని తెలిపింది. నరేంద్ర మోడీ ప్రభుత్వం ఇప్పటి వరకూ చేపట్టిన అతిపెద్ద వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహరణ (జాతీయ ఆస్తుల బహిరంగ విక్రయం) ఇదే కానుందని విమర్శించింది. ఈ ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్‌లో ప్రభుత్వ వాటాల విక్రయంతో ప్రస్తుత బడ్జెట్‌లో లక్ష్యంగా పెట్టుకున్న రూ. 80,000 కోట్ల పెట్టుబడుల ఉపసంహరణను అధిగమించనున్నారని సిఐటియు పేర్కొంది. అయితే బడ్జెట్ పేపర్లలో "పెట్టుబడుల ఉపసంహరణ" అనే పదానికి బదులుగా "ఇతర మూలధన రాబడులు"
ఈ అమ్మకానికి ముందు ఐడిబిఐ బ్యాంకులో ఎల్ఐసికి 49.24 శాతం, కేంద్రానికి 45.48 శాతం వాటా ఉందని, దీని తర్వాత, ఎల్ఐసి వాటా 19 శాతం, కేంద్రం వాటా 15 శాతానికి దిగజారుతుందని తెలిపింది. దీంతో బోర్డులో ఎల్ఐసికి గానీ, కేంద్రానికి గానీ ఎలాంటి ప్రాతినిధ్యం ఉండదని సిఐటియు పేర్కొంది. ఐడిబిఐ బ్యాంకులో కేంద్రం పెట్టుబడిని కొనసాగిస్తుందని ఆర్థిక మంత్రి చెప్పడం దేశ ప్రజలను మోసం చేయడమేనని విమర్శించింది. ఒకవైపు ...ఓటు హక్కు రక్షణ కోసం దేశ ప్రజలంతా ఉద్యమిస్తుండగా.. మరోవైపు మోడీ మంత్రివర్గం జాతీయ ఆస్తులను విదేశీ, దేశీయ అనుచరులకు అమ్ముకోవడంలో నిమగ్నమై ఉందని సిఐటియు విమర్శించింది.

రేడియో- సాంకేతిక విప్లవానికి నాంది...!

అమెరికాలోని ప్రముఖ ఎలక్ట్రానిక్స్ సంస్థ టెక్సాస్ ఇన్‌స్ట్రుమెంట్స్ ప్రపంచానికి ఒక విప్లవాత్మక సాంకేతిక ఆవిష్కరణను అందించింది? అదే మొదటి ట్రాన్సిస్టర్ రేడియో. ఇది కేవలం ఒక కొత్త పరికరం పుట్టుక మాత్రమే కాదు, మానవ జీవితాన్ని సాంకేతికంగా, సామాజికంగా, సాంస్కృతికంగా మార్చిన మహత్తర పరిణామం. 20వ శతాబ్దపు సమాచార యుగానికి ఇది పునాదిగా నిలిచి ప్రపంచ కమ్యూనికేషన్ విధానాన్ని విస్తృతంగా మార్చేసింది. 1950 దశకానికి ముందు రేడియోలు "వాక్యూమ్ ట్యూబ్" సాంకేతికతపై ఆధారపడి ఉండేవి. అవి పెద్దవిగా, బరువుగా, విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉండే పరికరాలుగా ఉండేవి. ఇంట్లో ఒక పెద్ద పెట్టె లాంటి రేడియో ఉండటం ఒక గౌరవ సూచికగా పరిగణించ బడేది. కానీ 1947లో బెల్ లాబొరేటరీస్ శాస్త్రవేత్తలు విలియం షాక్‌లీ, జాన్ బార్డీన్, వాల్టర్ బ్రాట్టెన్ లు ట్రాన్సిస్టర్ అనే చిన్న ఎలక్ట్రానిక్ భాగాన్ని ఆవిష్కరించడం ద్వారా సాంకేతిక ప్రపంచాన్ని కొత్త దిశలో నడిపించారు. అదే ఆవిష్కరణను ప్రజల దైనందిన జీవితంలో ఉపయోగపడే విధంగా మార్చి పరిచయం చేసిన తొలి సంస్థ టెక్సాస్ ఇన్‌స్ట్రుమెంట్స్. టెక్సాస్ ఇన్‌స్ట్రుమెంట్స్ సంస్థ 1930లో స్థాపించబడింది. ఆరంభంలో ఈ సంస్థ నూనె పరిశ్రమలకు పరికరాలు తయారు చేసేది. అయితే 1950ల నాటికి ఈ సంస్థ సెమీ కండక్టర్ టెక్నాలజీ పరిశోధనల్లో ముందంజ వేసింది. ఆ క్రమంలోనే 1954లో రెజెన్సీ ఎలక్ట్రానిక్స్ అనే చిన్న కంపెనీతో కలిసి ప్రపంచపు తొలి ట్రాన్సిస్టర్ రేడియోను అభివృద్ధి చేసింది. 1954 అక్టోబర్18న మార్కెట్‌లో విడుదలైన ఈ రేడియో ధర 49.95 అమెరికన్ డాలర్లు, అంటే ఆ కాలంలో సాధారణ కుటుంబానికి పెద్ద మొత్తమే. అయినప్పటికీ ప్రజల ఉత్సాహం ఆ ఆవిష్కరణను అప్రతిహత విజయంగా మార్చింది. ఈ చిన్న పరికరంలో కేవలం నాలుగు ట్రాన్సిస్టర్‌లు మాత్రమే ఉండేవి, కానీ అవే చరిత్ర సృష్టించాయి. ఇంతవరకు ఇంటి గోడల మధ్య మాత్రమే వినిపించే సంగీతం, వార్తలు ఇప్పుడు జేబులో దాచుకొని ఎక్కడైనా వినగలిగే స్థాయికి చేరాయి. అమెరికా యువతలో కొత్త సంస్కృతికి ప్రతీకగా మారింది. రైలులో, వీధిలో, పాఠశాల ప్రాంగణంలో?ఎక్కడైనా రేడియో ధ్వనులు వినిపించడం ఆ కాలపు కొత్త దృశ్యమైంది.ట్రాన్సిస్టర్ రేడియో విజయం ప్రపంచ వ్యాప్తంగా ఎలక్ట్రానిక్స్ పరిశ్రమకు ఊపిరి పోసింది. చిన్న పరిమాణంలో ఎక్కువ పనితీరును అందించే పరికరాల తయారీకి మార్గం సుగమమైంది. అదే సాంకేతికత తరువాత కంప్యూటర్లు, టెలివిజన్‌లు, మొబైల్ ఫోన్లు, అంతరిక్ష పరికరాల అభివృద్ధికి పునాది వేసింది. టెక్సాస్ ఇన్‌స్ట్రుమెంట్స్ ఆ ఆవిష్కరణతో ఆగిపోలేదు. 1958లో ఈ సంస్థ ఇంజనీరు జాక్ కిల్బీ ప్రపంచానికి మొదటి మైక్రోచిప్‌ను పరిచయం చేశారు. ఆ ఆవిష్కరణతో ఎలక్ట్రానిక్స్ ప్రపంచం మరో నూతన దశలోకి ప్రవేశించింది. టెక్సాస్ ఇన్‌స్ట్రుమెంట్స్ అప్పటి నుండి మైక్రోచిప్‌లు, సెన్సర్‌లు, కంట్రోలర్‌లు, ప్రాసెసర్‌లు వంటి అత్యాధునిక ఎలక్ట్రానిక్ పరికరాల తయారీలో ప్రపంచ నాయకత్వం వహిస్తోంది. ఈ సంస్థ ఆవిష్కరణలు ఆధునిక కంప్యూటింగ్, మొబైల్ టెక్నాలజీ, వైద్య పరికరాలు, అంతరిక్ష పరిశోధనల వరకు విస్తరించాయి. 1954లో పుట్టిన మానవ చరిత్రలో సమాచారాన్ని "జేబులో పెట్టిన" తొలి పరికరం. ఈరేడియో మనిషి చెవులకు ప్రపంచ ధ్వనులను అందించి, సమాచారాన్ని ప్రతి ఒక్కరి రోజువారీ జీవితంలో భాగం చేసింది. ఆ చిన్న ఆవిష్కరణ నుంచే ఆతరువాతి దశలో స్మార్ట్ ఫోన్ రూపంలో పరిణామం చెందింది. అందువల్ల 1954లో టెక్సాస్ ఇన్‌స్ట్రుమెంట్స్ పరిచయం చేసిన ట్రాన్సిస్టర్ రేడియోను కేవలం ఒక సాంకేతిక పరికరంగా కాకుండా, మానవ మేధస్సు విజయానికి ప్రతీకగా, శ్రవణ విప్లవానికి నాందిగా, సమాచార యుగానికి ఆరంభ ఘట్టంగా గుర్తించాలి. ఇది మనిషి సృజనాత్మకతను ప్రతిబింబిస్తూ ప్రపంచాన్ని మరింత దగ్గర చేసింది.

భారతావని కీర్తి కిరీటం చంద్రయాన్



భారతదేశం శాస్త్రసాంకేతిక రంగంలో సాధించిన విజయాలలో అంతరిక్ష పరిశోధనకు ఒక ప్రత్యేక గౌరవ స్థానం ఉంది. ప్రపంచం లోని అగ్రరాజ్యాల సరసన నిలబడి, స్వంత ఉపగ్రహాలను ప్రయోగించి, చంద్రుడి వైపు దూసుకెళ్లిన భారత్, 2023 ఆగస్టు 23న ఒక అపూర్వ ఘట్టాన్ని సృష్టించింది. ఆ రోజు చంద్రయాన్?3 విజయవంతంగా చంద్రుడి దక్షిణ ధ్రువంపై దిగింది. ఇది భారత అంతరిక్ష పరిశోధన చరిత్రలో మాత్రమే కాకుండా, ప్రపంచ అంతరిక్ష చరిత్రలోనూ కొత్త అధ్యాయాన్ని ప్రారంభించిన ఘనత. ఈ సంఘటనకు గుర్తుగా భారత ప్రభుత్వం ప్రతి సంవత్సరం "జాతీయ అంతరిక్ష దినోత్సవం" (జెజీబితినీనిజీశ్రీ రాజూజీఇవ ఆజీఎ)గా జరుపుకోవాలని నిర్ణయించింది. భారత అంతరిక్ష పరిశోధన ప్రయాణం 1962లో విక్రమ్ సారాభాయ్ దూరదృష్టితో ప్రారంభమైంది. 1975లో తొలి ఉపగ్రహం ఆర్యభటను కక్ష్యలో ప్రవేశపెట్టడం ద్వారా భారత్ అంతరిక్ష శాస్త్రంలో తన అడుగులు వేసింది. అప్పటి నుంచి ఇస్రో (ఖోఖీూ) వందలాది ఉపగ్రహాలను ప్రయోగిస్తూ వాతావరణ అంచనాలు, టెలి కమ్యూనికేషన్, రిమోట్ సెన్సింగ్, వ్యవసాయం, విపత్తు నిర్వహణ వంటి రంగాల్లో అపారమైన సహకారం అందిస్తోంది. 2013లో మంగళ యాన్ మిషన్ విజయంతో అమెరికా, రష్యా, యూరప్ తరువాత మంగళ గ్రహాన్ని చేరుకున్న నాలుగో దేశంగా భారత్ నిలిచింది.

రేవంత్ రెడ్డి ఈఎంఐ ముఖ్యమంత్రి

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్ : సింగరేణి నిండా కుంభకోణాలు ఉన్నాయని నేను చెప్పినా. కాంగ్రెస్ చేసిన కుంభకోణాలని ప్రజల ముందు పెడితే రేవంత్ రెడ్డి, నిన్న అడ్డగోలుగా మాట్లాడిండు. నువ్వు ఉత్తరం రాస్తే నేను విచారణకు ఆదేశిస్తా అన్నాడు. మీడియా ముందు మాట్లాడుడు కాదు, దమ్ముంటే సింగరేణి కుంభకోణం పైన ప్రతిపాదిత విదేశీ బొగ్గు కొనుగోళ్లపైన విచారణ జరిపించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రేవంత్ రెడ్డికి కేటీఆర్ సవాల్ విసిరారు.శుక్రవారం అయన తెలంగాణ భవన్ లో నిర్వహించిన నర్సంపేట నియోజక వర్గ సమావేశంలో మాట్లాడారు.కేటీఆర్ మాట్లాడుతూ ఆఅంశంలోనే కాదు, దమ్ముంటే నువ్వు చేసిన అక్రమాలపై కూడా సిట్టింగ్ జడ్జితో విచారణకి ఆదేశించు. నీ బావమరిది సింగరేణిలో కొల్లగొట్టిన రూ. 10వేల కోట్ల కుంభకోణంపై విచారణ వెయ్యి. సింగరేణిలో నువ్వు చేసిన సోలార్ పవర్ కుంభకోణం బయటపెడతా. సింగరేణిని బొందపెట్టి ఇప్పుడు 70 మిలియన్ మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసిన సింగరేణిని కాదని విదేశీ బొగ్గు తేవడానికి కుట్ర చేస్తున్నాడని ఆరోపించారు.గతంలో రాష్ట్రంలో 24 గంటల పాటు కరెంట్ పోకుండా అండగానిలబడింది సింగరేణి. ఇప్పుడు అదే సింగరేణిని బద్నామ్ చేస్తున్నాడు రేవంత్ రెడ్డి. సంక్షోభంలోకి నెట్టిన తర్వాత ఇప్పుడు ముఖ్యమంత్రి బొగ్గు తేవాలి, కరెంట్ కొనాలి అని అంతా ఆగమైనంక చెబుతున్నాడు. సింగరేణి బొగ్గు వద్దు, భారతదేశంలో ఉండే బొగ్గు వద్దని అంటున్న ముఖ్యమంత్రి విదేశీ బొగ్గు కావాలి అంటున్నాడు. ఆస్ట్రేలియా నుంచి బొగ్గు కొంటే కమీషన్లు వస్తాయి. సింగరేణిలో 3,800కి టన్నుకి దొరికే బొగ్గు, విదేశాలలో అయితే 10, 12 వేలు వస్తాయి కాబట్టి అక్కడ కమీషన్లు కొట్టడం కోసమే ఈ కుట్ర చేస్తున్నాడు. రేవంత్ రెడ్డి ఈఎంఐ ముఖ్యమంత్రి. ఈఎంఐ కట్టకుంటే ఈయన పదవి పోతుంది. కాబట్టే ఇప్పుడు బొగ్గు పేరుతో స్కామ్ చేసి ముడుపులు కట్టేందుకు ప్రయత్నం చేస్తున్నాడు. కాంగ్రెస్ కి కట్టే ఈఎంఐల కోసమే ఇక్కడ ఏఐసీసీ జనరల్ సెక్రటరీ ఉన్నాడు. ఈ రికవరీ ఏజెంట్ లాంటి ఈ ఏఐసీసీ జనరల్ సెక్రటరీకి రేవంత్ రెడ్డి కమీషన్లు కట్టకుంటే ఆయన పదవిని గుంజి పడేస్తాడు. రేవంత్ రెడ్డి పదవి రెన్యువల్ కాదు. రేవంత్ రెడ్డి అడ్డగోలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి ఇప్పుడు అందరిని మోసం చేస్తున్నాడు. సింగరేణి భుజం మీద తుపాకీ పెట్టి టెండర్లు, కమీషన్లు లెక్కలు వేసుకుంటున్నాడు.సింగరేణిలో ఉత్పత్తి తగ్గించిండు. అందుకే ఈరోజు కరెంట్ ఉత్పత్తి కేంద్రాల దగ్గర బొగ్గు లేదు. సింగరేణికీ రూ. 60వేల కోట్ల బాకీలు పెండింగ్ లో పెట్టి బొగ్గు ఇవ్వడం లేదని బద్నామ్ చేస్తున్నాడు. కరెంట్ సరఫరా వ్యవస్థను పండబెట్టి ఇప్పుడు రేవంత్ రెడ్డి కొందామంటే కరెంట్ లేదని అబద్ధాలు చెబుతున్నాడు. ఒకనాడు 24 గంటల కరెంట్ వచ్చిన తెలంగాణలో ఇప్పుడు కరెంట్ ఎందుకు లేదు? కరెంట్ కొనుగోలు కోసం ఛత్తీస్ ఘడ్ తో ఒప్పందం చేసుకుంటే అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందాన్ని కుంభకోణం అన్నాడు. ఇప్పుడేమో కొందామంటే కరెంట్ లేదు అని చెబుతున్నాడు. 3 రూపాయల 90 పైసలకు అప్పుడు మేము కొంటే కుంభకోణం. అయితే, ఇప్పుడు 15 రూపాయలు పెట్టి కొనాలని చూస్తున్న కాంగ్రెస్ తీరుని ఏమనాలి? కరెంట్ కొనుగోళ్లపైన కుంభకోణం అంటూ ఒక కమిషన్ వేసిండు. బద్నాం చేయడానికి కుట్ర చేసిండు. రాష్ట్రంలో 30 లక్షల కరెంట్ పంపు సెట్లు ఉన్నాయి. సాగునీటి ప్రాజెక్టులకి కరెంట్ కావాలి, తెలంగాణ రైతులకు కరెంట్ ఇయ్యాలి. విద్యుత్ పై ఆధారపడిన కుటీర పరిశ్రమలు, పరిశ్రమలకు విద్యుత్ ఇవ్వాలి. అందుకే ఆనాడు అన్ని ప్రయత్నాలు చేసి 24 గంటల కరెంట్ ఇచ్చాము. కానీ కాంగ్రెస్ రాగానే కరెంట్ కోతలు వచ్చాయి. రేవంత్ రెడ్డి 1000 టీఎంసీల నీళ్లను సముద్రంలో వదిలిపెట్టిండు. ఇప్పటిదాకా సాగునీటి పైన, కరువు పరిస్థితుల పైన స్పందించకుండా కాలం వెళ్ళిపోయినాక ఇప్పుడు నాటకాలు చేస్తున్నాడు. ఆరు నెలల ముందే కాళేశ్వరం నుంచి నీళ్లు ఎత్తిపోయాలని మా పార్టీ తరఫున విజ్ఞప్తి చేశాము. కాళేశ్వరం ప్రాజెక్టులో వృథాగా కిందికి పోతున్న నీళ్లను అక్కడి దాకా పర్యటించి ప్రభుత్వానికి ప్రజలకు చూపించాము. కానీ కాళేశ్వరం ప్రాజెక్టును ఉపయోగిస్తే ఇన్ని సంవత్సరాలు తాను చేసిన దొంగ మాటలు ప్రజలకు ముందు తేలిపోతుందని రేవంత్ రెడ్డి నీళ్లు ఎత్తి పోయలేదు. వృథాగా కిందికి పోయిన నీళ్లు ఎత్తి పోయకుండా ఇప్పుడు ఎల్ నినో పేరుతో చేతులెత్తేసిండు. కన్నెపల్లి పంప్ హౌస్ నుంచి నీళ్లు ఎత్తమంటే రేవంత్ రెడ్డి ఎత్తలేదు. ఉన్న నీళ్లు కిందికి పోయాయి, రాష్ట్రంలో ఉన్న పంటలు ఎండిపోతున్నాయి, తాగునీటికి సాగునీటికి కొరత మొదలయ్యింది. ఇప్పుడు ఎల్ నినో వచ్చింది నేనేం చేసానని రేవంత్ రెడ్డి చేతులెత్తేస్తున్నాడు. ఇదే ఎల్ నినో దేశమంతా ఉంది, పక్కనున్న ఆంధ్రప్రదేశ్ లో కర్ణాటకలో కూడా ఉంది. కానీ ఆంధ్రాలో అక్కడ ముఖ్యమంత్రి జలపండగ చేస్తున్నాడు. 700 కిలోమీటర్ల దూరంలో ఉన్న కుప్పం దాకా నీళ్లు తీసుకుపోయిండు. 400 టీఎంసీలను పట్టిసీమ పంపుతో ఎత్తిపోస్తున్నాడు. పోతిరెడ్డిపాడు నుంచి మొదలుకొని ఆంధ్రాకి అన్ని ప్రాజెక్టులో నీళ్లు నింపుకున్నారు. ఆంధ్రాలో 700 కిలోమీటర్ల కింది దాకా నీళ్లు తీసుకుపోతే 70 కిలోమీటర్ల దూరమున్న మహబూబ్ నగర్ కి కూడా నీళ్లు తీసుకోపోలేకపోతున్నాడు రేవంత్ రెడ్డి. కాళేశ్వరం పాలమూరు ఎత్తిపోతల ద్వారా ఈరోజు తెలంగాణ దేశానికి అన్నపూర్ణగా నిలుస్తుండే. కానీ కాంగ్రెస్ పాలన వల్ల కరువు దిశగా పోతున్నది. ఇది కాలం తెచ్చిన కరువు కాదు, కాంగ్రెస్ తెచ్చిన కరువు. ఆంధ్రలో జల పండగ ఎందుకుంటది? తెలంగాణలో కరువు ఎందుకుంటది? తెలంగాణ నుంచి పారే నీళ్లతో ఆంధ్రాలో ప్రాజెక్టులు నిండుతున్నాయి.

తెలంగాణ సీఎంవోపై పర్సంటేజీ ఆరోపణలు..!?



తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేపడుతున్న మౌలిక వసతుల ప్రాజెక్టుల టెండర్ల కేటాయింపులు, బిల్లుల చెల్లింపులపై అవకతవకలు, అవినీతి ఆరోపణలు గుప్పిస్తూ ఆర్‌వీఎం కన్‌స్ట్రక్షన్స్ ఇండియా లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ నామా రమేశ్.. బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నాయకత్వానికి లేఖ రాసి దాన్ని మీడియాకు లీక్ చేశారు. హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ పరిధిలోని రేడియల్ రోడ్-2 ప్రాజెక్టు మూడు ప్యాకేజీల టెండర్లలో అక్రమాలు జరిగాయని ఆయన లేఖలో వివరించారు. సాధారణంగా 10 నుంచి 12 పెద్ద కంపెనీలు పాల్గొనే ఇలాంటి ప్రతిష్టాత్మక టెండర్లలో.. కేవలం నాలుగు సంస్థలు మాత్రమే పాల్గొనేలా సీఎం కార్యాలయం నుంచి ఇతర కాంట్రాక్టర్లకు బెదిరింపు ఫోన్ కాల్స్ వెళ్లాయని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుగానే నిర్ణయించిన సంస్థలకే పనులు కట్టబెట్టేలా ముందస్తు ఒప్పందాలు కుదిరాయని అందులో పేర్కొన్నారు. ఈ టెండర్ల ప్రక్రియలో సుశీ ఇన్‌ఫ్రా సంస్థను ఉద్దేశపూర్వకంగానే డిస్క్వాలిఫై చేశారని నామా రమేశ్ లేఖలో ప్రముఖంగా లేవనెత్తారు. ఇండో-చైనా సరిహద్దు వంటి అత్యంత క్లిష్టమైన ప్రాంతాల్లో 250 కిలోమీటర్లకు పైగా రోడ్లను విజయవంతంగా నిర్మించిన అపార అనుభవం సుశీ ఇన్‌ఫ్రాకు ఉందని తెలిపారు. టెక్నికల్ ఎవాల్యుయేషన్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఇచ్చిన అనుభవ పత్రంపై ఎస్ఈ కౌంటర్‌సైన్ లేదనే కుంటిసాకుతో దానిని తిరస్కరించారని, ఆ తర్వాత ప్రత్యామ్నాయ పత్రాలు సమర్పించినా అధికారులు నిరాకరించారని పేర్కొన్నారు. ఎల్-1 బిడ్డర్లు నిర్దేశిత విలువ కంటే 3 నుంచి 15 శాతం అధిక ధరలను కోట్ చేయగా.. సుశీ ఇన్‌ఫ్రా కోట్ చేసిన ధరలు దాదాపు రూ.600 కోట్లు తక్కువగా ఉన్నప్పటికీ, ఆ సంస్థను పక్కనపెట్టి ప్రభుత్వ ఖజానాకు నష్టం చేకూర్చారని లేఖలో ఆరోపించారు. ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మధ్య ఉన్న రాజకీయ విభేదాల కారణంగానే.. రాజగోపాల్ రెడ్డి కుటుంబానికి చెందిన సుశీ ఇన్‌ఫ్రాను లక్ష్యంగా చేసుకుని ఈ అన్యాయానికి పాల్పడ్డారని పేర్కొంటూ సంస్థ ఇప్పటికే కోర్టును ఆశ్రయించిందని వెల్లడించారు. ఈ టెండర్ల గోల్‌మాల్‌తో పాటు, రాష్ట్రంలో ప్రాజెక్టుల కేటాయింపులకు గాను కాంట్రాక్టర్ల నుంచి ఏకంగా 15 శాతం కమీషన్లు డిమాండ్ చేస్తున్నారనే సంచలన ఆరోపణను కూడా లేఖలో ప్రస్తావించారు. ఇది బహిరంగ రహస్యమైనప్పటికీ మంత్రులు, ఎమ్మెల్యేలు ఎవరూ నోరు మెదపడం లేదని, కమీషన్లు చెల్లించిన కాంట్రాక్టర్లకే బిల్లుల విడుదలలో ప్రాధాన్యత ఇస్తున్నారని వివరించారు. గత మూడేళ్లుగా ధ్రువీకరించిన బిల్లులకు సంబంధించి దాదాపు రూ.20,000 కోట్ల చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని విడుదల చేయించుకోవడానికి కూడా భారీ ఎత్తున కమీషన్లు డిమాండ్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లులు రాక ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయి ఇప్పటికే పలువురు కాంట్రాక్టర్లు ప్రాణాలు కోల్పోయారని, నిరాశానిస్పృహల్లో ఉన్నారని పేర్కొన్నారు. పాత పనులకు బిల్లులు చెల్లించలేని ప్రభుత్వం.. కొత్త టెండర్లను ఎలా పిలుస్తుందో అర్థం కావడం లేదని నిలదీశారు. ఈ తీవ్రమైన పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా తక్షణమే జోక్యం చేసుకోవాలని నామా రమేశ్ విజ్ఞప్తి చేశారు. ఏ శాఖకు గానీ, రాజకీయ పార్టీకి గానీ ఎలాంటి కమీషన్లు ఇవ్వాల్సిన అవసరం లేకుండా.. బిల్లులన్నీ ఎప్పటికప్పుడు సకాలంలో చెల్లించేలా పారదర్శక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. అధికారం ఉన్నవారితో కుమ్మక్కై పనులు దక్కించుకునే ప్రీ-అరేంజ్డ్ టెండర్ల సంస్కృతికి చరమగీతం పాడుతూ సుశీ ఇన్‌ఫ్రాకు మద్దతుగా నిలవాలని, అర్హులైన కాంట్రాక్టర్లందరికీ సమాన అవకాశాలు కల్పించేలా ఓపెన్ టెండరింగ్ విధానాన్ని పునరుద్ధరించాలని పిలుపునిచ్చారు. నిర్మాణ రంగాన్ని అవినీతి, అవకతవకల నుంచి కాపాడేందుకు కాంట్రాక్టర్లంతా ఐక్యంగా పోరాడాలని స్పష్టం చేశారు.లేఖను బయట పెట్టడం మాత్రమే కాదు.. మీడియాతోనూ ఇవే ఆరోపణలు చేశారు. ఈ నామా రమేష్‌కు.. ఇంటి పేరు కారణంగా చాలా మంది మాజీ ఎంపీ నామా నాగేశ్వర రావుకు సంబంధించిన వారని అనుకుంటున్నారు కానీ.. ఈ నామా రమేష్ కు మాజీ ఎంపీకి ఎలాంటి సంబంధం లేదు.

పాలక విధానాలపై 'ప్రపంచ' ప్రజా పోరుబాట...



పారిస్: ప్రపంచంలోని పలు దేశాల్లో ఇటీవల భారీ నిరసనలు చెలరేగాయి. ఫ్రాన్స్ నుంచి అర్జెంటీనా వరకు ఈ ఆందోళనల వెనుక దాదాపు ప్రతి దేశంలో కనిపించే సమస్యలు ఇళ్ల ధరలు, ద్రవ్యోల్బణం, ప్రజా సేవలకు నిధుల కోత, ప్రభుత్వ వ్యతిరేకత. వీటిలో ఫ్రాన్స్, అల్బేనియాలు ప్రభుత్వ విధానాలపై అత్యంత తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. శనివారం నాడు ఫ్రాన్స్ అంతటా లక్షల మంది వీధుల్లోకి వచ్చారు. పెరిగిన ధరలు, క్షీణిస్తున్న ప్రభుత్వ సేవలు, శిథిలావస్థలోని పాఠశాలలు, విద్యా నిధుల కోతలపై ఈ ప్రదర్శనలు జరిగాయి.

గత నెల పారిస్ ఉత్తర శివార్లలోని పేద ప్రాంతాల్లోని ఉన్నత పాఠశాలల్లో ఈ ఉద్యమం మొదలైంది. ఉపాధ్యాయుల కొరత, శిథిలమైన భవనాలపై కోపం క్రమంగా అసమానత, ప్రజా వ్యయం, జీవన ప్రమాణాలపై విస్తృత ఉద్యమంగా మారింది. పాఠశాలల్లో నిరసనలు మొదట స్థానికంగా మొదలై తరగతులు స్తంభించాయి. ఆ తర్వాత ఇంధన ధరలు, జీవన వ్యయంపై భారీ ఆందోళనగా రూపుదాల్చాయి.

2018 నాటి "గిలెట్స్ జోన్"(ఎల్లో వెస్ట్) ఉద్యమాన్ని పునరుద్ధరించాలని సామాజిక మాధ్యమాల్లో వచ్చిన పిలుపులు శనివారం మరింత మందిని వీధుల్లోకి తెచ్చాయి. అప్పట్లో ఇంధన పన్నుల పెంపుపై మాక్రాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈ ఉద్యమం జరిగింది.

స్టాక్ మార్కెట్‌లో లాభాలు తగ్గడానికి కారణమిదే



భారత స్టాక్ మార్కెట్లలో లాభాల శాతం తగ్గడానికి అధిక ద్రవ్య లభ్యత, మదుపర్లు తమ వాటాలను సులభంగా విక్రయించే పరిస్థితులు కూడా కారణమని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. థాయ్‌లాండ్‌లో ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో భారత మార్కెట్ల పనితీరు, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ, కృత్రిమ మేధ (ఎఐ) రంగం ప్రభావం వంటి అంశాలపై ఆమె మాట్లాడారు. ట్రంప్ సుంకాలు, అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు కొనసాగుతున్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి మెరుగ్గా ఉందని నిర్మలమ్మ తెలిపారు. అయితే, దేశీయ స్టాక్ మార్కెట్లలో ప్రధాన సూచీలు సుమారు 12 శాతం క్షీణించడం, విదేశీ పెట్టుబడిదారులు తమ నిధులను వెనక్కి తీసుకోవడం ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. భారత ఈక్విటీ మార్కెట్ల నుంచి విదేశీ మదుపర్లు పెద్ద మొత్తంలో పెట్టుబడులను ఉపసంహరించుకుంటున్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు 33 బిలియన్ డాలర్లకు పైగా నిధులను వెనక్కి తీసుకున్నట్లు పేర్కొంటున్నారు. ముఖ్యంగా తైవాన్, దక్షిణ కొరియాల్లోని కృత్రిమ మేధకు సంబంధించిన కంపెనీల వైపు పెట్టుబడులు మళ్లడం భారత మార్కెట్లపై ప్రభావం చూపుతోంది. ఈ స్థాయిలో మూలధనం తరలిపోవడం ఆందోళనకరమని ఆర్థిక మంత్రి అభిప్రాయపడ్డారు. ప్రపంచవ్యాప్తంగా ఎఐ రంగంలో ఏర్పడిన పెట్టుబడుల బుడగ పేలినా భారత్‌కు పెద్దగా నష్టం ఉండకపోవచ్చని నిర్మలా సీతారామన్ అభిప్రాయపడ్డారు. ఈ రంగంలో భారత్ నుంచి భారీ స్థాయిలో పెట్టుబడులు లేకపోవడమే ఇందుకు కారణమని తెలిపారు. అయితే, అధునాతన సాంకేతికతలో భారత్ వెనుకబడలేదని, సెమీకండక్టర్ల తయారీ రంగంలో పెట్టుబడులు వస్తున్నాయని తెలిపారు. స్టాక్ మార్కెట్ సూచీలు పడిపోయినప్పటికీ దేశ ఆర్థిక వ్యవస్థ పునాదులు బలంగానే ఉన్నాయని వివరించారు. ముఖ్యంగా తైవాన్, దక్షిణ కొరియాల్లోని కృత్రిమ మేధకు సంబంధించిన కంపెనీల వైపు పెట్టుబడులు మళ్లడం భారత మార్కెట్లపై ప్రభావం చూపుతోంది. ఈ స్థాయిలో మూలధనం తరలిపోవడం ఆందోళనకరమని ఆర్థిక మంత్రి అభిప్రాయపడ్డారు. ప్రపంచవ్యాప్తంగా ఎఐ రంగంలో ఏర్పడిన పెట్టుబడుల బుడగ పేలినా భారత్‌కు పెద్దగా నష్టం ఉండకపోవచ్చని నిర్మలా సీతారామన్ అభిప్రాయపడ్డారు. ఈ రంగంలో భారత్ నుంచి భారీ స్థాయిలో పెట్టుబడులు లేకపోవడమే ఇందుకు కారణమని తెలిపారు. విదేశీ పెట్టుబడిదారులు నిధులను వెనక్కి తీసుకుంటున్నప్పటికీ, దేశీయ మదుపర్లు మాత్రం మార్కెట్‌కు అండగా నిలుస్తున్నారు. 2021 మార్చి నుంచి ఈక్విటీ ఆధారిత మ్యూచువల్ ఫండ్లలోకి ప్రతి నెలా నికర పెట్టుబడులు వస్తూనే ఉన్నాయి. క్రమబద్ధమైన పెట్టుబడి పథకాల (ఎస్ఐపి) ద్వారా కొనసాగుతున్న నగదు ప్రవాహం మార్కెట్‌లో నిధుల లభ్యతను పెంచుతోంది. దీంతో విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ ప్రభావాన్ని కొంతవరకు తగ్గిస్తూ మార్కెట్ నిలకడగా కొనసాగేందుకు దేశీయ పెట్టుబడులు తోడ్పడుతున్నాయని నిపుణులు చెబుతున్నారు.

కెనడాలో సైనిక శిక్షణా స్థావరంలో ఘోర అగ్నిప్రమాదం



అల్బెర్టా: కెనడాలోని అల్బెర్టా ప్రావిన్స్‌లో ఉన్న సైనిక శిక్షణా స్థావరంలో సంభవించిన ఘోర అగ్నిప్రమాదంలో నలుగురు సైనికులు ప్రాణాలు కోల్పోయారు. మరో 39 మంది గాయపడి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వీరిలో 19 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. కెనడియన్ ఫోర్సెస్ బేస్ వైన్రైట్‌లో సైనికులు లైవ్ మందుగుండు సామగ్రితో యుద్ధ శిక్షణ నిర్వహిస్తున్న సమయంలో శిక్షణా ప్రాంతంలోని గడ్డి మైదానంలో మంటలు చెలరేగాయి. గంటకు 96 కిలోమీటర్ల వేగంతో వీచిన బలమైన గాలుల కారణంగా మంటలు అత్యంత వేగంగా వ్యాపించాయి. కేవలం 30 నుంచి 60 సెకన్ల వ్యవధిలోనే మంటలు సుమారు కిలోమీటరు మేర విస్తరించడంతో సైనికులు ప్రమాదంలో చిక్కుకున్నారు. ఈ దుర్ఘటనపై కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శాంతికాలంలో కెనడా గడ్డపై సాయుధ దళాలు ఎదుర్కొన్న అత్యంత విషాదకర ఘటనల్లో ఇదొకటిగా ఆయన అభివర్ణించారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యసేవలు అందించేందుకు చర్యలు చేపట్టారు.

లంచావతారులకుఆ రక్షణ వర్తించదు...



న్యూఢిల్లీ: అవినీతి కేసుల్లో ప్రభుత్వ ఉద్యోగులపై విచారణ జరిపేందుకు అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్-17(ఎ) కింద అధీకృత వ్యవస్థ నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలన్న నిబంధన లంచావతారులకు వర్తించదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. విధి నిర్వహణలో భాగంగా తీసుకున్న నిర్ణయాలు, చేసిన సిఫార్సులకే ఈ రక్షణ వర్తిస్తుంది తప్ప.. లంచాలకు సంబంధించి కాదని తేల్చి చెప్పింది. రాజస్థాన్‌కు చెందిన పోలీసు కానిస్టేబుల్.. ఒక నిందితుడిని నేరం నుంచి తప్పించేందుకు సహకరించడం కోసం లంచం తీసుకున్నాడు. ఈ వ్యవహారంలో ఏసీబీ కోర్టు స్పెషల్ జడ్జి అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్-7 కింద అభియోగాలు ఖరారు చేసి విచారణకు అనుమతించారు. సెక్షన్-17(ఎ) కింద అనుమతులు తీసుకోక ముందే తనపై విచారణకు ఉపక్రమించడాన్ని ఆ కానిస్టేబుల్ సవాలు చేశాడు. దీనిపై సర్వోన్నత న్యాయస్థానంలో విచారణ నిర్వహించిన జస్టిస్ ఎస్.వి.ఎన్.భట్, జస్టిస్ ఎన్.వి.అంజారియాల ధర్మాసనం.. లంచగొండుల విషయంలో సెక్షన్-17(ఎ) రక్షణ వర్తించదంటూ తీర్పు వెలువరించింది. రుతుక్రమ ఆరోగ్యం ప్రాథమిక హక్కుల్లో భాగమేనంటూ తాము వెలువరించిన తీర్పు అమలవుతున్న తీరును రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు కేంద్రానికి నివేదించకపోవడంపై సుప్రీం కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. తమ తీర్పును కాగితాలకే పరిమితం చేస్తారా అని ప్రశ్నించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్-21 ప్రసాదించే 'జీవించే హక్కు'లో రుతుక్రమ ఆరోగ్యమూ భాగమేనని ప్రకటిస్తూ ఈ ఏడాది జనవరి 30న సుప్రీం తీర్పు వెలువరించింది. ఇందుకోసం ప్రతి పాఠశాలలో తగిన సదుపాయాలు కల్పించాలని తర్వాత ఆదేశించింది.ఆ తీర్పు ఎలా అమలవుతోందో నివేదించాలని తాము కోరినప్పటికీ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి స్పందన రాలేదని ఈ నెల 13న కేంద్రం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్యా భాటీ సుప్రీం కోర్టుకు తెలిపారు. దీంతో జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌ల ధర్మాసనం తీవ్ర అసహనం వ్యక్తం చేసింది.

రష్యాపైకి డ్రోన్ల దాడిమంటల్లో ఇంధన టెర్మినల్!



కీవ్ : రష్యాపై ఉక్రెయిన్ భారీస్థాయిలో విరుచుకుపడింది. ఏకకాలంలో వెయ్యికిపైగా డ్రోన్లను ప్రయోగించింది. ఉక్రెయిన్ జరిపిన అతిపెద్ద వైమానిక దాడుల్లో ఇది ఒకటి. ఈ డ్రోన్ల దాడిలో సెయింట్ పీటర్స్‌బర్గ్‌లోని ఓ ఇంధన టెర్మినల్ మంటల్లో చిక్కుకుపోయింది. రష్యా చమురు మౌలిక సదుపాయాలను కీవ్ లక్ష్యంగా చేసుకోవడాన్ని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విమర్శిస్తున్న తరుణంలోనే తాజా దాడులు జరగడం గమనార్హం. ఉక్రెయిన్ దాడుల్లో ఒకరు మృతి చెందగా.. మరో ఐదుగురు గాయపడినట్టు స్థానిక అధికారులు తెలిపారు. పీటర్స్‌బర్గ్ ఆయిల్ టెర్మినల్‌తోపాటు రూచి ఆయిల్ డిపోలో మంటలు చెలరేగాయని చెప్పారు. ఓజోన్ లాజిస్టిక్స్ కేంద్రం, వీకే డేటా సెంటర్‌పైనా దాడులు జరిగాయన్నారు. మొత్తం 1,015 ఉక్రెయిన్ డ్రోన్లను కూల్చేసినట్టు రష్యా రక్షణ శాఖ తెలిపింది. మరోవైపు.. ఉక్రెయిన్‌లోని జపోరిజియాపై రష్యా జరిపిన దాడుల్లో ఒక మహిళ ప్రాణాలు కోల్పోగా.. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు.

రేవంత్ డ్రీం టీంకు గ్రీన్ సిగ్నల్



హైదరాబాద్,: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు పూర్తి చేసుకుంటున్న తరుణంలో, రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ, ప్రక్షాళన అంశం మరోసారి తెరపైకి వచ్చింది. హైదరాబాద్ వేదికగా జరిగిన భారత్ సమ్మిట్ సందర్భంగా లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , రాష్ట్ర మంత్రులతో సమావేశం కావడం, ఇరువురి మధ్య ఉన్న సమన్వయాన్ని స్పష్టం చేస్తోంది. ఢిల్లీ అధిష్టానం వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన స్థానాన్ని మరింత పదిలం చేసుకున్నారని, ఇకపై రాష్ట్ర రాజకీయ నిర్ణయాల్లో ఆయన అభిప్రాయానికే అధిష్టానం అత్యధిక ప్రాధాన్యత ఇచ్చే అవకాశాలు ఉన్నాయని కాంగ్రెస్ అంతర్గత వర్గాల్లో చర్చ జరుగుతోంది.ప్రస్తుతం మంత్రివర్గంలో ఖాళీగా ఉన్న స్థానాల భర్తీతో పాటు, కొందరు మంత్రుల శాఖల మార్పు, పనితీరు ఆధారంగా ప్రక్షాళన జరిగే అవకాశం ఉంది. అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇస్తే, ఫలానా నాయకుడికే పదవి ఇవ్వాలని ఢిల్లీ పెద్దలు ఒత్తిడి చేసే కంటే, పార్టీ విధానాలకు అనుగుణంగా సామాజిక, ప్రాంతీయ సమీకరణాలను సమన్వయం చేసుకుంటూ జాబితాను రూపొందించే స్వేచ్ఛ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికే లభిస్తుంది. పార్టీలో కొందరు సీనియర్లు, ఇతర నేతల నుంచి వచ్చే ఫిర్యాదుల కంటే, రాబోయే రెండేళ్ల పాలన , ఎన్నికల వ్యూహాలకే హైకమాండ్ ప్రాధాన్యత ఇస్తోందని పార్టీ వర్గాల సమాచారం.అయితే మంత్రివర్గ విస్తరణపై అటు సీనియర్ ఎమ్మెల్యేలు, ఇటు యువ నాయకుల నుంచి తీవ్ర స్థాయిలో పోటీ నెలకొనడం నాయకత్వానికి కత్తిమీద సాములా మారింది. ఒక వర్గానికి లేదా ప్రాంతానికి అవకాశం కల్పిస్తే, మిగిలిన ఆశావహుల్లో అసంతృప్తి తలెత్తే అవకాశం ఉండటంతో అధిష్టానం , ముఖ్యమంత్రి ఆచితూచి అడుగులు వేస్తున్నారు. ముఖ్యంగా ఉమ్మడి జిల్లాల ప్రాతినిధ్యం, సామాజిక న్యాయం, పార్టీ క్రమశిక్షణ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని తుది నిర్ణయం తీసుకోవాల్సిన పరిస్థితి ఉంది.ఏదేమైనా, మిగిలిన రెండేళ్ల పాలనను దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎప్పుడు సరైన సమయమని భావిస్తే అప్పుడే మంత్రివర్గ విస్తరణ లేదా ప్రక్షాళన జరిగే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలును వేగవంతం చేయడంతో పాటు, పార్టీలో సమతూకాన్ని కాపాడుకోవడానికి రేవంత్ రెడ్డి , ఢిల్లీ అధిష్టానం కలిసి ఎలాంటి కూర్పును ఖరారు చేస్తాయన్నది తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది.

మూడు ఎమ్మెల్సీలు ఖాళీ

శాసనమండలిలో గవర్నర్ కోటా కింద ఉన్న మూడు ఎమ్మెల్సీ స్థానాలు శనివారం ఖాళీ అయ్యాయి. ప్రస్తుత ఎమ్మెల్సీల పదవీకాలం ముగియడంతో ఈ ఖాళీలు ఏర్పడ్డాయి. గవర్నర్ కోటాలో నామినేట్ అయిన ప్రముఖ ప్రజా కవి, గాయకుడు గోరటి వెంకన్న, మాజీ మంత్రి, సీనియర్ నేత బస్వరాజు సారయ్య, బొగ్గారపు దయానంద్‌ల పదవీ కాలం పూర్తయింది. దీంతో గవర్నర్ కార్యాలయం వారికి సంబంధించిన నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో ఈ మూడు పదవులను భర్తీ చేయాల్సి ఉంటుంది. ఈ మూడు స్థానాలను వెంటనే భర్తీ చేసే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం లేదని తెలుస్తోంది. గవర్నర్ కోటా నామినేటెడ్ స్థానాలు కావడంతో వీటి భర్తీకి ఎన్నికల సంఘం గడువు నిబంధనలు వర్తించవు. ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకుని.. దాని ప్రకారం.. గవర్నర్‌కు సిఫారసు చేయనుంది. ప్రభుత్వం ఎంపిక చేసిన నాయకులు బయోడేటా, వారి గ్రాఫ్ ఆధారంగా గవర్నర్ ఎంపిక చేస్తారు. అయితే.. ప్రస్తుతం ఈ ఎంపిక ప్రక్రియ వాయిదా పడే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇప్పటికే పలు నామినేటెడ్ పదవులను భర్తీ చేయాల్సిన అవసరం ఉంది. దీనిపైనే ప్రభుత్వం సహా పార్టీ కూడా భారీ కసరత్తు చేస్తోంది. ముందుగా వివిధ కార్పొరేషన్లు, కమిషన్ల నామినేటెడ్ పదవుల భర్తీని పూర్తి చేసిన తర్వాతే, డిసెంబర్ రెండో లేదా మూడో వారంలో ఈ మూడు ఎమ్మెల్సీ పేర్లను ఖరారు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ భావిస్తున్నట్లు సమాచారం. కార్పొరేషన్ పదవులను భర్తీ చేయడం ద్వారా ఎమ్మెల్సీ కోటాలో పోటీని తగ్గించే ప్రయత్నం చేస్తున్నారు. ఇదేసమయంలో పార్టీకి అనుకూలంగా ఉన్నవారు.. వచ్చే ఎన్నికల నాటికి సామాజిక వర్గాల పరంగా పార్టీకి దోహదపడేవారు.. పార్టీకి విధేయులు ఇలా.. అన్ని కోణాల్లోనూ ఈ దఫా ఎమ్మెల్సీ అభ్యర్థులను వడపోయనున్నారు. ఖాళీ అయిన మూడు స్థానాల్లో ఒకటి పద్మశాలీ సామాజికవర్గానికి ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే సిరిసిల్ల సభలో ప్రకటించారు. మిగిలిన రెండు స్థానాలను బీసీ(మున్నూరు కాపు లేదా ముదిరాజ్), బ్రాహ్మణ లేదా ఎస్సీ(మాదిగ) వర్గాలకు కేటాయించే అంశంపై అధికార కాంగ్రెస్ పార్టీలో కసరత్తు జరుగుతోంది. ఇదిలావుంటే.. సుప్రీంకోర్టులో గతంలో దాఖలు చేసిన కేసుల విచారణ మరోసారి ఈ నెల 18న విచారణకు రానుంది. అప్పట్లో గవర్నర్ కోటా వివాదం తలెత్తిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ కేసు రెండు సంవత్సరాలుగా విచారణ దశలోనే ఉంది. ఈ తీర్పును అనుసరించి.. ప్రభుత్వం కొత్తవారికి అవకాశం ఇచ్చే ఛాన్స్ కనిపిస్తోంది.

రూ 4 వేలకు చేరుకున్న ఫించన్లు



నిజామాబాద్,తెలంగాణ ప్రభుత్వం చైతన్య పథకం ద్వారా సామాజిక పింఛన్లు అందిస్తోంది. వృద్ధులు, అంగవైకల్యులు, ఒంటరి మహిళలు మరియు ఇతరులు ప్రతి నెలా పింఛన్లు పొందుతున్నారు. ఇటీవల అధికారులు కొత్త పింఛన్ దరఖాస్తులను స్వీకరించారు.కొత్తగా ఆమోదించిన పింఛన్ పొందేవారికి నగదు పంపిణీ జరుగుతోంది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో గెలిస్తే పింఛన్లను రూ. 4,000కు పెంచుతామని హామీ ఇచ్చింది. ఈ హామీ వారి మానిఫెస్టోలో చేర్చబడింది.అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రభుత్వం పింఛన్లు పెంచలేదు. పింఛన్లు పెంచేందుకు చాలా మంది ఎదురుచూస్తున్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పింఛన్ల గురించి కీలక ప్రకటన చేశారు.పేదల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన తెలిపారు. నల్గొండలోని అచేరి గార్డెన్స్ వద్ద కొత్త పింఛన్లు పంపిణీ చేయబడ్డాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని ప్రాధాన్యత ఇస్తుందని కోమటిరెడ్డి తెలిపారు.గత హామీలను క్రమంగా నెరవేర్చుతామని ఆయన చెప్పారు. ప్రస్తుతం పింఛన్‌ను రూ. 2,000 నుంచి రూ. 4,000కు పెంచే యోచనలో ఉన్నామని మంత్రి ప్రకటించారు. వారి ప్రభుత్వం మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి దృష్టిని అనుసరిస్తుందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సవాలుగా ఉంది. కొత్త పింఛన్లను అనుమతించడంలో వేగం పెంచేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందిగత ప్రభుత్వాలు భారీ అప్పులు తీసుకున్నాయి. ప్రస్తుత ప్రభుత్వం సంక్షేమానికి రూ. 95,000 కోట్లను కేటాయించింది. ఆర్థిక భారం ఉన్నప్పటికీ సంక్షేమానికి తమ కట్టుబాటును మంత్రి హైలైట్ చేశారు.మహాలక్ష్మీ పథకం మహిళలకు ఉచిత ఖీఅ బస్సు ప్రయాణాన్ని అందిస్తోంది. ఖీఅని లాభదాయకంగా మార్చడానికి రూ. 13,000 కోట్లను ఖర్చు చేశారు. ఈ పథకం కింద మహిళలు మూడు సంవత్సరాలుగా టిక్కెట్లు లేకుండా ప్రయాణిస్తున్నారు.ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా కిలోకు రూ. 77 విలువైన ఉచిత అన్నం పంపిణీ చేస్తోంది. ఈ కార్యక్రమం పేదలకు రోజుకు రెండు భోజనాలు అందించడంలో సహాయపడుతోంది. గతంలో అందించిన అన్నం పశువుల ఆహారానికి అనుకూలంగా ఉండేది.ఇప్పుడు ప్రభుత్వం నాణ్యమైన అన్నం అందిస్తోంది. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం అమలు చేయబడుతోంది. ఇందిరమ్మ గృహ పథకం అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లు అందించడానికి లక్ష్యంగా ఉంది.ఇల్లు నిర్మాణానికి రూ. 5 లక్షల ఆర్థిక సహాయంఅందించబడుతోంది. అన్ని అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లు అందించబడతాయని మంత్రి హామీ ఇచ్చారు. కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఈ ప్రకటన జరిగింది.కాంగ్రెస్ పార్టీ మానిఫెస్టోలో సామాజిక సంక్షేమానికి సంబంధించిన హామీలు ఉన్నాయి. మంత్రి చేసిన వ్యాఖ్యలు ప్రభుత్వ సంక్షేమంపై దృష్టి పెడుతున్నాయి. పింఛన్ పెంపు పేదల సంక్షేమానికి ప్రభుత్వ కట్టుబాటుకు భాగంగా ఉంది.రాష్ట్ర ఆర్థిక పరిస్థితిలో సవాళ్లు ఉన్నాయని మంత్రి అంగీకరించారు. ఎన్నికల హామీలను నెరవేర్చేందుకు ప్రభుత్వం పనిచేస్తోంది. మంత్రి చేసిన వ్యాఖ్యలు నల్గొండలో జరిగాయి.చైతన్య పథకం వివిధ దుర్భర సమూహాలకు మద్దతు ఇవ్వడానికి లక్ష్యంగా ఉంది. ఆర్థిక సవాళ్ల ఉన్నప్పటికీ ప్రభుత్వం సంక్షేమాన్ని ప్రాధాన్యత ఇస్తోంది. నాణ్యమైన ఆహారం పేదలకు అందించడంలో మంత్రి ప్రాముఖ్యతను హైలైట్ చేశారు.ఉచిత విద్యుత్ పథకం ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల భాగంగా ఉంది. గృహ సహాయం జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి లక్ష్యంగా ఉంది. మంత్రి చేసిన ప్రకటనలు కొనసాగుతున్న సంక్షేమ ప్రయత్నాల భాగంగా ఉన్నాయి. ప్రభుత్వం తన పౌరుల జీవిత ప్రమాణాలను మెరుగుపరచడంపై దృష్టి సారిస్తోంది.

ట్రంప్ దెబ్బతో అమెరికా చదువులకు బైబై
యూరప్‌కు వరుస కట్టిన విదేశీ విద్యార్థులు

వాషింగ్టన్ :అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రవేశపెట్టిన కఠిన వలస విధానాలు, వీసా తనిఖీలు, అపాయింట్‌మెంట్లలో జాప్యంతో ఈ ఏడాది అక్కడి యూనివర్సిటీల్లో అంతర్జాతీయ విద్యార్థుల చేరికలు తగ్గుముఖం పట్టాయి. అదే సమయంలో విద్యార్థులు యూరప్, ఆసియా దేశాలను ప్రత్యామ్నాయంగా ఎంచుకుంటున్నారని తేలింది. సీటెల్‌లోని యూనివర్సిటీ ఆఫ్ వాషింగ్టన్‌లో వరుసగా రెండో ఏడాది విద్యార్థుల సంఖ్య పదేండ్ల కనిష్ఠానికి చేరింది. ఒహియో స్టేట్ వర్సిటీలో 13 శాతం తగ్గి 16 ఏండ్లలో అత్యల్ప స్థాయికి చేరింది. ఇల్లినాయిస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విద్యార్థుల తగ్గుదలతో తన ఎండోమెంట్ నిధుల నుంచి 200 మిలియన్ డాలర్ల వరకు అప్పు తీసుకోవాలని యోచిస్తున్నది. వీసా జాప్యాలు కరోనా సమయంలో కంటే ఈ వేసవిలో దారుణంగా ఉన్నాయని ఎన్‌ఏఎఫ్‌ఎస్‌ఏ డైరెక్టర్ ఫాంటా అవ్ తెలిపారు. తాజా సర్వేలో ఆగస్టు-అక్టోబర్ మధ్య యూరప్‌లో 50 శాతం



కళాశాలల్లో అండర్‌గ్రాడ్యుయేట్, ఆసియాలో 59 శాతం విద్యాసంస్థల్లో పీజీ విదేశీ విద్యార్థుల సంఖ్య పెరిగింది. ఎఫ్-1 వీసాదారులు చదువు తర్వాత సంబంధిత రంగంలో పనిచేసేందుకు ఉపయోగపడే ఓపీటీ కార్యక్రమానికి ఒక్కో విద్యార్థి 70 వేల డాలర్లు చెల్లించేలా ట్రంప్ ప్రభుత్వం ప్రతిపాదించింది. కొన్ని కొత్త హెచ్-1బీ పిటిషన్లకు లక్ష డాలర్లకు పైగా ఫీజుల ప్రతిపాదన కూడా ఉంది.

ఫోన్ ట్యాపింగ్ కేసులో చర్యలకు సిద్ధం..!



హైదరాబాద్, ,తెలంగాణ రాజకీయాలను కుదిపేస్తున్న ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం మరోసారి కీలక మలుపు తిరిగింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాజకీయ నేతలు, న్యాయమూర్తులు, ప్రముఖ వ్యాపారవేత్తలపై అక్రమంగా నిఘా పెట్టారన్న ఆరోపణలపై సాగుతున్న సిట్ విచారణ తుది దశకు చేరుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలతో ఈ అంశం మళ్లీ హాట్ టాపిక్‌గా మారింది. తన ఫోన్‌ను ట్యాప్ చేసినా తనకు ఎలాంటి అభ్యంతరం లేదని వ్యాఖ్యానిస్తూనే, విచారణ ముగింపు దశలో ఉందని, త్వరలోనే సంచలన విషయాలు వెలుగులోకి వస్తాయని సీఎం సంకేతాలు ఇవ్వడం రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠకు దారితీసింది.బదిలీ అయిన హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ పర్యవేక్షణలో సిట్ అధికారులు ఇప్పటికే పలువురు కీలక రాజకీయ నాయకులు, బాధితులు, నిందితుల వాంగ్మూలాలను నమోదు చేసి తుది చార్జిషీట్‌ను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. సజ్జనార్ బదిలీతో దర్యాప్తు వేగం తగ్గుతుందన్న ఊహాగానాలకు తెరదించుతూ, విచారణ పక్కాగా సాగుతోందని అధికార కాంగ్రెస్ వర్గాలు విశ్వాసం వ్యక్తం చేస్తున్నాయి. ఈ కేసులో నిందితులుగా ఉన్న మాజీ ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్ రావు, ప్రణీత్ రావు, రాధాకిషన్ రావు తదితరుల పాత్రపై దర్యాప్తు సంస్థ ఇప్పటికే కీలక వివరాలు సేకరించింది.అయితే ఈ వ్యవహారంలో రాజకీయ వేడి ఎంతగా ఉన్నప్పటికీ, న్యాయస్థానంలో నేరాన్ని నిరూపించడంలో దర్యాప్తు సంస్థలకు పెను సాంకేతిక సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉందని సైబర్ భద్రతా నిపుణులు, న్యాయకోవిదులు విశ్లేషిస్తున్నారు. ప్రధానంగా, ఈ కేసులో బాధితులుగా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా పలువురు మాజీ మంత్రులు, ప్రతిపక్ష నేతలు, న్యాయమూర్తులు అత్యంత కట్టుదిట్టమైన ఎన్‌క్రిప్షన్ భద్రత కలిగిన 'యాపిల్ ఐఫోన్'లను వినియోగిస్తుంటారు. సాధారణ వాయిస్ కాల్స్, ఎస్ఎంఎస్‌లను టెలికాం సర్వీస్ ప్రొవైడర్ల సహాయంతో ట్యాప్ చేయడం సులభమే అయినా, వాట్సాప్, ఫేస్‌టైమ్, ఐమెసేజ్ వంటి ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రిప్టెడ్ మాధ్యమాల ద్వారా ఐఫోన్లలో జరిగే సంభాషణలను సాధారణ సాఫ్ట్‌వేర్లతో హ్యాక్ చేయడం సాధ్యం కాదు.ఇక్కడే అసలైన సాంకేతిక చిక్కుముడి ఏర్పడింది. ఇజ్రాయెల్‌కు చెందిన పెగాసస్ వంటి అత్యున్నత మిలిటరీ గ్రేడ్ స్పైవేర్‌ను వినియోగించి ఉంటే తప్ప ఐఫోన్ల డేటాను తస్కరించడం అసాధ్యమని సైబర్ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. మరోవైపు నిందితులు ఆధారాలను చెరిపేసే క్రమంలో ఎస్ఐబీ కార్యాలయంలోని కీలక హార్డ్ డిస్క్‌లను ధ్వంసం చేసి మూసీ నదిలో పడేశారన్న ఆరోపణలు ఉన్నాయి. అసలైన సర్వర్ లాగ్స్, టెలికాం సంస్థల సాంకేతిక ఆధారాలు లేదా స్పైవేర్ వినియోగించిన జాడలు స్పష్టంగా లేకుండా, కేవలం నిందితులు, సాక్షులు ఇచ్చిన వాంగ్మూలాల ఆధారంగా ఐఫోన్ ట్యాపింగ్ జరిగిందని కోర్టులో నిరూపించడం సిట్ అధికారులకు కత్తిమీద సాములా మారనుంది.భారత సాక్ష్యాధారాల చట్టం ప్రకారం, పోలీసుల విచారణలో నిందితులు ఇచ్చే వాంగ్మూలాలకు నేరుగా న్యాయస్థానంలో విలువ ఉండదు. వాటిని బలపరిచే బలమైన ఎలక్ట్రానిక్ ఎవిడెన్స్ తప్పనిసరి. సాంకేతిక ఆధారాలు బలహీనంగా ఉంటే ట్రయల్ సమయంలో కేసు నిలబడటం కష్టమవుతుందని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలోనే, సిట్ అధికారులు విదేశీ టెక్నాలజీ నిపుణుల సాయంతో ధ్వంసమైన హార్డ్ డిస్క్‌ల నుంచి డేటాను రికవరీ చేయడంతో పాటు, ఇజ్రాయెల్ సంస్థల నుంచి కొనుగోలు చేసిన నిఘా పరికరాల ఇన్‌వాయిస్‌లు, విదేశీ సర్వర్ల లాగ్స్‌ను సేకరించడంపై ప్రధానంగా దృష్టి సారించినట్లు సమాచారం.మరోవైపు సాంకేతిక చిక్కులు ఎలా ఉన్నా, రాజకీయంగా మాత్రం ఈ కేసును తుది అంకానికి తీసుకెళ్లడం ద్వారా గత పాలకులను ఇరకాటంలో పెట్టాలని రేవంత్ సర్కార్ భావిస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అప్పటి ప్రభుత్వ పెద్దల ఆదేశాలతోనే ఈ అక్రమ నిఘా సాగిందన్న కోణంలో కీలక నేతలకు నోటీసులు జారీ చేయడం లేదా సప్లిమెంటరీ చార్జిషీట్‌లో పెద్ద తలకాయల పేర్లను చేర్చడం వంటి పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. మొత్తానికి, సిట్ దాఖలు చేయబోయే తుది చార్జిషీట్‌లో కేవలం పోలీసు అధికారుల పాత్రే పరిమితమవుతుందా లేక గత పాలకుల ప్రమేయంపై బలమైన సాంకేతిక ఆధారాలను బయటపెట్టి సంచలనం సృష్టిస్తారా అనేది రాబోయే కొద్ది రోజుల్లో తేలనుంది.

రూఫ్ పునఃప్రారంభం పథకం అమలు

హైదరాబాద్, ,గతంలో వివిధ కారణాలతో మధ్యలోనే ఆగిపోయిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'రూఫ్ పునఃప్రారంభం' అనే ప్రత్యేక పథకాన్ని తీసుకొచ్చింది. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో భాగంగా చేపట్టిన ఈ పథకం కింద అర్హులైన లబ్ధిదారులను గుర్తించేందుకు గెజిటెడ్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహిస్తున్నారు.రాష్ట్రంలో 2006 నుంచి 2013 మధ్య మంజూరైన పాత ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకాల కింద సుమారు 4.52 లక్షల ఇళ్లు వివిధ దశల్లో నిలిచిపోయినట్లు అధికారులు గతంలోనే గుర్తించారు. అలాగే, 2023లో గృహలక్ష్మి పథకం కింద ప్రారంభమైన మరో 9,741 ఇళ్ల పనులు కూడా మధ్యలోనే ఆగిపోయాయి. ప్రస్తుతం వీటిలో చాలా ఇళ్లు పునాదులు, గోడల దశలో ఉండగా, మరికొన్నింటికి రేకులు లేదా రాతి వలకలతో తాత్కాలిక పైకప్పులు వేసుకున్నారు.ఇలాంటి ఇళ్లకు ఇందిరమ్మ ఇళ్ల రెండో విడతలో భాగంగా శాశ్వత శ్లాబ్ వేసుకుని నిర్మాణం పూర్తి చేసుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇందుకోసం గ్రేటర్ హైదరాబాద్ మినహా రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గానికి 500 చొప్పున మొత్తం 48,590 ఇళ్లను మంజూరు చేయాలని నిర్ణయించి, రూ. 1,400 కోట్ల నిధులను కేటాయించింది. ఈ పథకం కింద ఎంపికైన ప్రతి లబ్ధిదారుడికి రూ. 2 లక్షల ఆర్థిక సహాయం అందనుంది.రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 48 వేల మంది లబ్ధిదారులను గుర్తించాల్సి ఉండగా, ఇప్పటి వరకు అధికారులు 24,298 ఇళ్ల వద్దకు వెళ్లి సర్వే పూర్తి చేశారు. ఇందులో 6,198 మందిని అర్హులుగా తేల్చి జాబితాను సిద్ధం చేశారు. మిగిలిన దరఖాస్తులు అనుమతుల కోసం వివిధ దశల్లో ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం, జోగులాంబ గద్వాల, వికారాబాద్, మెదక్, వరంగల్ జిల్లాల్లో లబ్ధిదారులు అధిక సంఖ్యలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. సూర్యాపేట, సంగారెడ్డి, పెద్దపల్లి, జనగామ జిల్లాల్లో ఇప్పటివరకు లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియ కొలిక్కి రాలేదు.

మేనిఫెస్టోకు మూడేళ్లు..కాంగ్రెస్ నయవంచనకు మూడేళ్లు..
అభయ హస్తం కాస్త మొండి హస్తమయ్యిందని హరీశ్‌రావు సెటైర్లు

హైదరాబాద్‌వంద రోజుల్లోనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్నా నేటికీ అతీగతీ లేకపోవడంపై బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు తీవ్ర విమర్శలు గుప్పించారు. మేనిఫెస్టోకు మూడేళ్లు.. కాంగ్రెస్ నయవంచనకు మూడేళ్లు అని ఎద్దేవా చేశారు. గొప్పగా చెప్పుకున్న అభయహస్తం.. హామీలను అమలు చేయని మొండి హస్తంగా మారిందని విమర్శించారు. మేనిఫెస్టో మాకు భగవద్గీత, ఖురాన్, బైబిల్‌తో సమానమని, దానిని తూచా తప్పకుండా అమలు చేస్తామని మూడేళ్ల క్రితం ఇదే రోజు మల్లికార్జున ఖర్గే సమక్షంలో రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని హరీశ్‌రావు గుర్తుచేశారు. మూడేళ్లు గడిచినా ఆ హామీలకు దిక్కులేదు. అమలు ఊసే లేదని అన్నారు. అభయ హస్తం.. శూన్య హస్తం అయ్యిందని విమర్శించారు. ఓట్లు వేసిన ప్రజలనే కాదు.. ఒట్లు వేసి దేవుళ్లను, పవిత్ర గ్రంథాలను సైతం మోసం చేసిన చరిత్ర కాంగ్రెస్‌ది అని మండిపడ్డారు. గాంధీ భవన్ సాక్షిగా తెలంగాణ ప్రజలకు ఇచ్చిన మాటను ఎందుకు నిలబెట్టుకోలేదని ప్రశ్నించారు. దీనిపై మల్లికార్జున ఖర్గే, మేనిఫెస్టో కమిటీ చైర్మన్ శ్రీధర్ బాబు, భట్టి విక్రమార్క సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తొలి క్యాబినెట్‌లోనే ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పిస్తామన్న హామీ నీటిమూటగానే మిగిలిందని హరీశ్‌రావు అన్నారు. ఇప్పటివరకు 38 క్యాబినెట్ సమావేశాలు జరిగినా.. ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత ఎందుకు కల్పించలేదని ప్రశ్నించారు. మేనిఫెస్టో పేరుతో మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చి, హామీల అమలును గాలికొదిలేశారని విమర్శించారు. ఆరు గ్యారెంటీలు 420 హామీలతో అరచేతిలో వైకుంఠం చూపించి, అధికారంలోకి వచ్చాక ఒక్కొక్క హామీకి తూట్లు పొడిచారని మండిపడ్డారు. గాంధీ పేరు చెప్పుకుని రాజకీయాలు చేసే కాంగ్రెస్.. గాంధీభవన్ సాక్షిగా ఇచ్చిన హామీలు కూడా అమలు చేయలేక పోవడం సిగ్గుచేటు అని విమర్శించారు. కాంగ్రెస్ మోసపూరిత వైఖరి చూస్తే గాంధీ ఆత్మ కూడా క్షోభిస్తుందని హరీశ్‌రావు అన్నారు. ప్రజల ఆశలను ఓట్లుగా మార్చుకున్నారని.. అధికారాన్ని అందుకున్నాక ఆ ఆశలను ఆవిరి చేశారని మండిపడ్డారు. హామీలు అమలు చేయకుండా మూడేళ్లుగా ప్రజలను మభ్యపెట్టడమే కాంగ్రెస్ సాధించిన ఘనత అని వ్యాఖ్యానించారు.

కేసీఆర్ ఇచ్చిన కరెంటు, నీళ్లు కూడా
ఇవ్వలేకపోతున్నారు : జగదీష్ రెడ్డి



హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ సాధారణ ఎన్నికలకు ముందు కేసీఆర్ చేసిన వాటి కన్నా రెండింతలు ,మూడింతలు ఎక్కువ చేస్తామని చెప్పింది. .స్వర్గమే ఇక్కడికి తెస్తామన్నారు. 420 హామీలు గ్యారంటీలు డిక్లరేషన్లతో కాంగ్రెస్ జాతీయ నాయకులు ప్రజలను మభ్యపెట్టారు..రైతులను, యువతను ,బీసీ ,ఎస్సీ ,ఎస్టీలను ,మైనారిటీల ను డిక్లరేషన్లతో మోసం చేశారని మాజీ మంత్రి జగదీష్ రెడ్డి మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ నేతలు అఫిడవిట్లు ,బాండ్ పేపర్లు ఇచ్చి మరీ ప్రజలను నమ్మించే ప్రయత్నం చేశారు.. తులం బంగారం ఇస్తామని ఫించన్ల మొత్తం పెంచుతామని ఎన్నికల సభల్లో ఊదర గొట్టారు. ఆటో డ్రైవర్లను ,విద్యార్థులను రకరకాల హామీలతో మోసం చేశారు. కాలేజీలకు వెళ్లే విద్యార్థినిలకు స్కూటీలు ఇస్తామని చెప్పారు. రైతు రుణమాఫీ ,రైతు బంధు పై మోసం చేశారు.. ప్రజల ఆశలు నిరాశలు అయ్యాయి ..కలలు కల్లలు అయ్యాయి. కాంగ్రెస్ మేనిఫెస్టోను ప్రజలు చిత్తు కాగితాల్లాగా చూస్తున్నారు. ను బ్లాక్ డేగా మార్చారు..: ఇంత చెత్త పాలనను గతంలో ఎన్నడూ చూడలేదని ప్రజలు అంటున్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల గొంతు కోశారు.. రాష్ట్రాన్ని సర్వ నాశనం చేస్తున్నారు. కేసీఆర్ ఇచ్చిన కరెంటు ,నీళ్లు కూడా ఇవ్వలేకపోతున్నారన్నారు జగదీష్ రెడ్డి . కాంగ్రెస్ మేనిఫెస్టోను చెత్తబుట్టలో వేయాల్సిందే. మూడేళ్ల క్రితం ఇదే రోజున కాంగ్రెస్ మేనిఫెస్టో ను విడుదల చేశారు. తెలంగాణకు ను బ్లాక్ డే గా మార్చారు. మంత్రులు రకరకాలుగా మాట్లాడుతున్నారు.. హైదరాబాద్ కు మంచి నీటి సమస్య లేదని ఒకడు పంటలు వేసుకువద్దని ఇంకొకడు మాట్లాడుతారు.. అభయ హస్తం భస్మాసుర హస్తంగా మారింది. భస్మాసుర హస్తంగా మారిన కాంగ్రెస్ మేనిఫెస్టోను చింపి చెత్తబుట్టలో వేస్తున్నాం. కేసీఆర్ మళ్లీ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని జగదీష్ రెడ్డి స్పష్టం చేశారు. డబ్బుల సంపాదనే కాంగ్రెస్ కు ముఖ్యమైంది. కాంగ్రెస్ భూ స్థాపితం కావడం ఖాయం. సమ్మక్క సారక్క బ్యారేజ్‌కు అనుమతి కోసం సీఎం రేవంత్ ,ఉత్తమ్ ఇపుడు ఛత్తీస్ ఘడ్‌కు వెళ్తున్నారు.కేసీఆర్ మళ్లీ సీఎం అయివుంటే ఇప్పటికే ప్రాజెక్టులకు అనుమతి వచ్చి ఉండేది. ఉత్తమ్ కు ఒక్కడికే హైదరాబాద్‌లో నీళ్ల కొరత లేదని అనిపిస్తున్నట్టుంది. ప్రజల దగ్గరికి వెళితే తెలుస్తుంది. చంద్రబాబుకు దక్షిణగా గోదావరి కృష్ణా జలాలు తరలించారనేది నూటికి నూరు పాళ్లు నిజమన్నారు.

వారానికి ఓ పాలి.. ఇక నీకు తిరుగుండదోయి..



కరివేపాకు సాధారణంగా మనం కూరల నుండి తీసి పక్కన పెట్టేస్తుంటాం. కానీ అదే కరివేపాకుతో అద్భుతమైన రుచికరమైన, ఆరోగ్యకరమైన పులుసును సులభంగా తయారు చేసుకోవచ్చు. కంటి చూపు మెరుగుపరచడం, జుట్టు ఆరోగ్యానికి, రక్తాన్ని శుద్ధి చేయడానికి కరివేపాకు ఎంతో మేలు చేస్తుంది. ఈ వంటకం వారానికి ఒకసారైనా తింటే పిల్లలు కూడా ఇష్టంగా తింటారు. మనం ప్రతిరోజూ వండుకునే కూరల్లో అద్భుతమైన రుచిని, సువాసనను అందించే కరివేపాకును చాలామంది తినేటప్పుడు తీసి పక్కన పెట్టేస్తుంటారు. అయితే, ఈ కరివేపాకు కేవలం రుచి కోసమే కాకుండా, మన ఆరోగ్యానికి ఎన్నో రకాలుగా మేలు చేస్తుంది. కంటి చూపు మెరుగుపరచడం నుండి జుట్టు కుదుళ్లను బలోపేతం చేయడం వరకు, శరీరంలోని మలినాలను పోగొట్టి రక్తాన్ని శుద్ధి చేసే అద్భుతమైన శక్తి కరివేపాకుకు ఉంది.

కావలసిన పదార్థాలు: కరివేపాకు – 2 కప్పులు, నూనె – సరిపడినంత, ఆవాలు – అర స్పూన్, జీలకర్ర – పావు స్పూన్, ఎండుమిర్చి – 1, వెల్లుల్లి రెబ్బలు – గుప్పెడు, పచ్చిమిర్చి – 2–3 (ముక్కలు), ఉల్లిపాయలు – 4 (సన్నగా తరిగినవి), ఉప్పు – రుచికి సరిపడా, పసుపు –కొద్దిగా, కారం – 2 స్పూన్లు (తినే కారాన్ని బట్టి), బెల్లం – చిన్న ముక్క, చింతపండు రసం – నిమ్మకాయ సైజంత చింతపండు నుండి తీసినది, నీళ్ళు ? సరిపడినంత

తయారీ విధానం: 1. కరివేపాకు వేయించడం: ముందుగా స్టవ్ మీద కడాయి పెట్టి, రెండు మూడు స్పూన్ల నూనె వేసి వేడి చేయాలి. నూనె కాగిన తర్వాత కడిగి, తడి లేకుండా ఆరబెట్టిన రెండు కప్పుల కరివేపాకు వేసుకోవాలి. మంటను మీడియం ఫ్లేమ్ లో ఉంచి, కరివేపాకు క్రిస్పీగా అయ్యేంత వరకు కలుపుతూ వేయించాలి. సరిపడినంత నూనె వేసుకోవడం ముఖ్యం. వేగిన కరివేపాకును నూనె రాకుండా ఒక గిన్నెలోకి తీసుకుని, పూర్తిగా చల్లారిన తర్వాత మిక్సీ జార్ లో వేసి మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. రోట్లో వేసుకున్నా బాగా మెత్తగా రుబ్బుకోవచ్చు. 2. పోపు తయారీ: కరివేపాకు వేయించిన నూనెలో కూరకి సరిపడినంత నూనె అదనంగా వేసుకోవాలి. నూనె కాగిన తర్వాత అర స్పూన్ ఆవాలు, పావు స్పూన్ జీలకర్ర, ఒక ఎండుమిర్చి వేసి ఒకసారి కలిపి, తొక్కలు వలిచిన గుప్పెడు వెల్లుల్లి రెబ్బలు వేసుకోవాలి. వెల్లుల్లి ఇష్టం లేని వారు స్కిప్ చేయవచ్చు. ఇవి వేగిన తర్వాత రెండు మూడు పచ్చిమిర్చిల ముక్కలు, సన్నగా తరిగిన నాలుగు ఉల్లిపాయల ముక్కలు వేసి రుచికి సరిపడా ఉప్పు కూడా కలపాలి.

ఈ స్నాక్‌తో పిల్లలకు ఐరన్, కాల్షియం కొండంత బలం!



మన పూర్వీకులు రాగులతో చేసిన వంటకాలను ఎక్కువగా తీసుకోవడం వల్లే ఎంతో దృఢంగా, ఆరోగ్యంగా ఉండేవారు. ఈ మధ్యకాలంలో జనాల్లో ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగి మళ్లీ సిరిధాన్యాల వాడకం పెరిగింది. ముఖ్యంగా మహిళల్లో వచ్చే రక్తహీనత, ఎముకల బలహీనత వంటి సమస్యలకు రాగులు ఒక సంజీవనిలా పనిచేస్తాయని పెద్దలు చెబుతున్నారు. మరి అంతటి పోషక విలువలున్న రాగి పిండితో ఎప్పుడూ ఒకే లాంటి టిఫిన్స్ తింటే బోర్ కొడుతుంది కదా. అందుకే ఎప్పటిలాగా రాగి దోసా, రోటీ, సంకటి లాంటివి కాకుండా కేవలం కొద్ది నిమిషాల్లోనే ఎంతో రుచికరమైన రాగి చెక్కలను ఎలా చేసుకోవాలో ఈ స్పెషల్ స్టోరీలో తెలుసుకుందాం? కావలసిన పదార్థాలు: రాగి పిండి/ బియ్యం పిండి (చెక్కలు క్రిస్పీగా రావడం కోసం)/ వేరుశెనగ పప్పులు (కొద్దిగా కచ్చాపచ్చాగా దంచినవి)/ నువ్వులు/ పచ్చిమిర్చి, అల్లం పేస్ట్/ కరివేపాకు, కొత్తిమీర తరుగు/ ఉప్పు (తగినంత)/ వెన్న లేదా వేడి నూనె (పిండి కలుపుకోవడానికి)/ డీప్ ఫ్రైకి సరిపడా నూనె తయారీ విధానం.. ముందుగా ఒక వెడల్పాటి గిన్నెలో రాగి పిండి, కొద్దిగా బియ్యం పిండి తీసుకోండి. అందులో నువ్వులు, కచ్చాపచ్చాగా దంచిన వేరుశెనగ పప్పులు, తగినంత ఉప్పు వేసి బాగా కలుపుకోండి. తర్వాత ఈ మిశ్రమంలో పచ్చిమిర్చి–అల్లం పేస్ట్, సన్నగా తరిగిన కరివేపాకు, కొత్తిమీర వేయండి. చెక్కలు సాఫ్ట్‌గా, క్రిస్పీగా రావడం కోసం కొద్దిగా వెన్న లేదా వేడి నూనె వేసి పిండిని బాగా ముద్దలా కాకుండా పొడిపొడిగా కలుపుకోవాలి. ఇప్పుడు కొద్దికొద్దిగా గోరువెచ్చని నీటిని పోస్తూ, చపాతీ పిండి కంటే కొంచెం గట్టిగా (మరీ జారుడుగా కాకుండా) ముద్దలా కలుపుకుని పక్కన పెట్టుకోవాలి. అలా పక్కన పెట్టుకున్న పిండిని చిన్న చిన్న ఉండలుగా చేసుకోవాలి. ఒక ప్లాస్టిక్ కవర్ లేదా బట్టర్ పేపర్‌పై కొద్దిగా నూనె రాసి, ఈ ఉండలను చేత్తో పలచని చెక్కల్లా ఒత్తుకోవాలి. ఆపై కాగుతున్న నూనెలో వేసి రెండు వైపులా చక్కగా కాలే వరకు మీడియం ఫ్లేమ్‌పై డీప్ ఫ్రై చేయాలి. అంతే ఆరోగ్యకరమైన రాగి చెక్కలు రెడీ.

మద్యం కాలేయానికే కాదు.. మెదడుకూ ముప్పే..!



మద్యం సేవించడం వల్ల కాలేయం, గుండెకు మాత్రమే నష్టం జరుగుతుందని చాలామంది భావిస్తుంటారు. అయితే, మద్యం ప్రభావం మెదడుపైనా తీవ్రంగా పడుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. తరచూ లేదా అధికంగా మద్యం సేవించడం వల్ల జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం, నిద్ర నాణ్యత వంటి మెదడు పనితీరుపై ప్రతికూల ప్రభావం పడుతుందని న్యూరాలజిస్టులు చెబుతున్నారు.

మెదడులో జ్ఞాపకశక్తి, నేర్చుకునే సామర్థ్యానికి కీలకమైన హిప్పోక్యాంపస్‌పై మద్యం మొదట ప్రభావం చూపుతుంది. దీని వల్ల తాత్కాలిక జ్ఞాపకాలను దీర్ఘకాలిక జ్ఞాపకాలుగా మార్చే ప్రక్రియ దెబ్బతింటుంది. ఫలితంగా ఎక్కువ మద్యం సేవించినప్పుడు కొందరికి 'బ్లాక్‌అవుట్స్' ఏర్పడి, ఆ సమయంలో జరిగిన విషయాలు పూర్తిగా గుర్తు లేకపోవచ్చు. అంతేకాదు..

మద్యం జ్ఞాపకశక్తినే కాకుండా మెదడులోని ఫ్రంటల్ లోబ్‌పై కూడా ప్రభావం చూపుతుంది. ఈ భాగం ఏకాగ్రత, ప్రణాళిక, సరైన నిర్ణయాలు తీసుకోవడం, భావోద్వేగాలను నియంత్రించడం వంటి కీలక పనులను నిర్వహిస్తుంది. మద్యం ఎక్కువగా తీసుకునేవారికి సంభాషణలను అర్థం చేసుకోవడం, పేర్లు గుర్తుంచుకోవడం, సమస్యలను పరిష్కరించడం వంటి పనులు క్రమంగా కష్టమవుతాయి.

మద్యం తాగితే బాగా నిద్రపడుతుందని చాలామంది అనుకుంటారు. కానీ అది కేవలం తాత్కాలిక మత్తును మాత్రమే కలిగిస్తుంది.

బాదం పప్పుతో మధుమేహానికి చెక్..!



భారతదేశంలో మధుమేహం బారిన పడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ ఆందోళనకరంగా పెరుగుతోంది. బ్లడ్ షుగర్ స్థాయిలను అదుపులో ఉంచుకోవడానికి మందులతో పాటు మనం తీసుకునే ఆహార నియమాలు కూడా అంతే ముఖ్యం. ముఖ్యంగా ఉదయం పూట బ్రేక్‌ఫాస్ట్‌కు ముందు తీసుకునే ఆహారం రోజంతా మన జీవక్రియలను ప్రభావితం చేస్తుంది. అందుకే, డయాబెటిస్ ఉన్నవారు ప్రతిరోజూ ఉదయాన్నే ఖాళీ కడుపుతో నానబెట్టిన బాదంపప్పులను తినాలని వైద్యులు మరియు పోషకాహార నిపుణులు బలంగా సిఫార్సు చేస్తున్నారు. ఇన్సులిన్ పనితీరును మెరుగుపరుస్తుంది: బాదంలో మెగ్నీషియం ఖనిజం పుష్కలంగా ఉంటుంది. డయాబెటిస్ ఉన్నవారిలో చాలా మందికి మెగ్నీషియం లోపం ఉన్నట్లు పరిశోధనల్లో తేలింది. శరీరంలో తగినంత మెగ్నీషియం ఉంటే, అది ఇన్సులిన్ హార్మోన్ కణాల్లోకి గ్లూకోజ్‌ను పంపే ప్రక్రియను సులభతరం చేస్తుంది. అంటే బాదం తినడం వల్ల శరీరం ఇన్సులిన్‌ను మరింత సమర్థవంతంగా వాడుకుంటుంది. షుగర్ స్పైక్స్‌ను అడ్డుకుంటుంది: బాదంపప్పులలో కార్బోహైడ్రేట్లు చాలా తక్కువగా ఉండి, ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రొటీన్లు, ఫైబర్ సమృద్ధిగా ఉంటాయి. ఉదయాన్నే పరగడుపున వీటిని తినడం వల్ల జీర్ణక్రియ నెమ్మదిస్తుంది.

సమస్య వచ్చినపుడు సహాయం చేయడంలో ముందుంటాం



ఎల్ నినోపై అవగాహన కల్పించేందుకు ఇండస్ట్రీ ముందుకు రావాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. తాజాగా దీనిపై టాలీవుడ్ కింగ్, అక్కినేని నాగార్జున స్పందించారు. ఇట్లు అర్జున సినిమా ఈవెంట్ లో ఆయన దీనిపై మాట్లాడారు. ప్రపంచం మొత్తాన్ని ఎల్ నినో తీవ్రంగా ప్రభావితం చేస్తోందన్నారు. ఎల్ నినోపై ప్రజలకు అవగాహన కల్పించడం చాలా అవసరమన్నారు. సినిమా ఇండస్ట్రీలో అందరూ ముందుకు వచ్చి సహాయం చేస్తామన్నారు.

సమస్య వచ్చినపుడు సహాయం చేయడంలో ఇండస్ట్రీ ఎప్పుడూ ముందుంటుందని నాగార్జున పేర్కొన్నారు. ఎల్ నినో ఎఫెక్ట్ ఎప్పటి వరకు ఉంటుందో ఎవరికీ తెలియదని, ప్రజలు పొదుపు చర్యలు పాటించాల్సిన అవసరం ఉందని సూచించారు. రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావం తీవ్రంగా ఉందని సీఎం రేవంత్ రెడ్డి ఇటీవలే హెచ్చరించారు. దీనిపై అఖిలపక్ష సమావేశం నిర్వహించి, ఆ నివేదికను కేంద్రం వద్దకు తీసుకెళ్తామన్నారు. ముఖ్యంగా నీరు, విద్యుత్ కొరత రోజురోజుకూ తీవ్రతరమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు కూడా ఒక పంటను ఆపుకుని ప్రభుత్వానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

'వృషకర్మ' రిలీజ్ డేట్ ఫిక్స్..



హీరో నాగ చైతన్య నటిస్తున్న మైథికల్ థ్రిల్లర్ 'వృషకర్మ'. ఈ చిత్రాన్ని డిసెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ మరోసారి అధికారికంగా ధృవీకరించారు. కార్తీక్ దండు దర్శకత్వంలో ఎస్‌విసిసి, సుకుమార్ రైటింగ్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం మునుపెన్నడూ చూడని సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ ను అందించబోతోంది. బాపినీడు సమర్పిస్తున్నారు. మైథాలజీ, మిస్టరీ, థ్రిల్లర్ అంశాలను ఎవరూ టచ్ చేయని ఒక సరికొత్త నేపథ్యంలో ఈ సినిమాను భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నారు. సినిమా విడుదలకు 50 రోజుల కౌంట్‌డౌన్‌ను పురస్కరించుకుని మేకర్స్ సరికొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో నాగ చైతన్య స్టైలిష్‌గా, యాక్షన్ అవతార్‌లో కనిపిస్తున్నారు. ఇంటెన్స్ , యాక్షన్ లుక్ లో నాగ చైతన్య ఆకట్టుకుంటున్నారు. పురాణాలు, సస్పెన్స్, యాక్షన్‌తో కూడిన ఈ సినిమా అడ్వెంచర్, మిస్టరీతో నిండిన ప్రపంచాన్ని పోస్టర్ ద్వారా పరిచయం చేస్తున్నారు. మీనాక్షి చౌదరి కథానాయికగా నటిస్తుండగా, స్పర్ష్ శ్రీవాస్తవ విలన్ పాత్రను పోషిస్తున్నారు. రాగుల్ డి హెరియన్ డీవోపీగా పని చేస్తుండగా, అజనీష్ బి లోక్‌నాథ్ సంగీతాన్ని సమకూరుస్తున్నారు. శ్రీ నాగేంద్ర తంగాల ప్రొడక్షన్ డిజైనర్, నవీన్ నూలి ఎడిటింగ్ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు.

'రియాలిటీ'లో హీరోయిన్ ఫిక్స్.. ఆకట్టుకుంటోన్న క్యూట్ పోస్టర్



ఇటీవల 'చెన్నై లవ్ స్టోరీ'తో ప్రేక్షకులను అలరించిన యంగ్ హీరో కిరణ్ అబ్బవరం.. ఇప్పటికే నటుడిగా, నిర్మాతగా గుర్తింపు తెచ్చుకున్నాడు. ఇప్పుడు తన కెరీర్‌లో ఒక పెద్ద అడుగు వేయబోతున్నారు. ఈ మేరకు మొదటిసారిగా మెగాఫోన్ పట్టి దర్శకత్వం వహించేందుకు సిద్ధమయ్యారు. 'రియాలిటీ' అనే డిఫరెంట్ టైటిల్‌తో రాబోతున్న ఈ సినిమాతో ఆయన డైరెక్టర్‌గా పరిచయం కానుండటంతో సినిమాపై అప్పుడే మంచి బజ్ ఏర్పడింది. గ్రామీణ నేపథ్యంలో రాబోతున్న ఈ చిత్రంలో శరత్‌కుమార్, సాయికుమార్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఇక దేవిక భట్ హీరోయిన్‌గా నటిస్తుందంటూ వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. దీనిపై తాజాగా క్లారిటీ ఇస్తూ క్యూట్ పోస్టర్ షేర్ చేశారు మేకర్స్. ఈ మేరకు మొదటిసారిగా మెగాఫోన్ పట్టి దర్శకత్వం వహించేందుకు సిద్ధమయ్యారు. 'రియాలిటీ' అనే డిఫరెంట్ టైటిల్‌తో రాబోతున్న ఈ సినిమాతో ఆయన డైరెక్టర్‌గా పరిచయం కానుండటంతో సినిమాపై అప్పుడే మంచి బజ్ ఏర్పడింది. గ్రామీణ నేపథ్యంలో రాబోతున్న ఈ చిత్రంలో శరత్‌కుమార్, సాయికుమార్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు.''రియాలిటీ'తో ఇదే అసలైన వాస్తవం.. తెలుగు చలనచిత్ర పరిశ్రమలోకి అందమైన దేవిక భట్‌కు స్వాగతం.డిసెంబర్ 25న వీరు ఇద్దరూ వెండితెరపై మెరిసి, ఈ క్రిస్మస్‌నుమరింత వినోదాత్మకంగా మార్చబోతున్నారు' అంటూ పంచుకున్న పోస్టర్ నెట్టింట క్యూట్ క్యూట్‌గా వైరల్ అవుతున్నది.

Edited, Printed, Published & Owned by PUSALA SRINIVAS, Printed at D.K. Publications,2-3-691/1/A CPL Main Road, Amberpet, Hyderabad and Published # Do.No. 2-2-1075/20/E/1, Opp. Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13. Editor : PUSALA SRINIVAS, RNI. NO. APTEL/2008/26737. Cell: 9603754136, 9949653944 E-mail: dkchaatimpu80@gmail.com